54470

## నండూరి బాపయ

# విఘ్నేశ్వర చరిత్ర - అనుశీలనం

డా॥ సి. శివశేఖరరెడ్డి

ప్రథమ ముద్రణ — 1995
కాపీలు — 1000

వెల — 15 రూ.

035,3cs,1
N95

సరళా పబ్లికేషన్స్
రెడ్డివారిపల్లె,
అగ్రహారం (పోస్టు)
నిమ్మనపల్లి (మండలం)

SRI VENKATESWARA
CENTRAL LIBRARY
RESEARCH CENTRE
Acc. 54470.
Date
TIRUPATI

THIS BOOK IS
PUBLISHE WITH THE
FINANCIAL ASSISTANCE OF
TIRUMALA TIRUPATI DEVASTHANAMS
UNDER THEIR SCHEME
" AID TO PUBLISH, RILIGIOUS BOOKS "

ముద్రణ :
స్వాతి ప్రింటర్స్,
పీలేరు

# కృతజ్ఞతలు

శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం తెలుగు అధ్యయన శాఖలో "నందూరి బాపయ విఘ్నేశ్వర చరిత్ర - అనుశీలనం అనే అంశంపై పరిశోధన చేయడానికి అవకాశం కల్పించిన అప్పటి తెలుగు అధ్యయన శాఖాధ్యక్షులైన ఆచార్య పి. సి నరసింహారెడ్డిగారికి, ప్రస్తుత తెలుగు శాఖాధ్యక్షులైన డాక్టర్ ఎస్. జి. డి చంద్రశేఖర్‌గారికి నా హృదయపూర్వక నమస్సులు.

నా పరిశోధనకు పర్యవేక్షకులుగా వ్యవహరించడానికి చిరునవ్వుతో అంగీకరించి, పర్యవేక్షణా బాధ్యతను స్వీకరించి పరిశోధనాకాలంలో నాకు అన్ని విధాల తోడ్పడి తగిన సూచనలు, సలహాలు యిస్తూ నా పరిశోధన నిరాటంకంగా కొనసాగడానికి దోహదం చేసిన ఆచార్య మద్దూరి సుబ్బారెడ్డి గారికి నా నమస్సుమాంజలులు.

* ఈ గ్రంథ ముద్రణకు ఆర్థిక సహాయం అందించిన తిరుమల తిరుపతి దేవస్థానము యాజమాన్యమునకు నా కృతజ్ఞతాభివందనములు పరిశోధనా కాలంలో పరిశోధనా పద్ధతులను విపులంగా వివరించిన మా తెలుగు అధ్యయనశాఖ ఉపాధ్యాయ బృందానికి నా నమోవాకములు.

నా పరిశోధనకు కావలసిన విషయసేకరణకు తోడ్పడిన శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ గ్రంథాలయ సిబ్బందికి నా ధన్యవాదములు.

కాణిపాకం దేవాలయం నందు నా పరిశోధనకు కావలసిన విషయ సేకరణకు సహకరించిన దేవాలయ సిబ్బందికి

నా పరిశోధనాకాలంలో కావలసిన సహాయ సహకారాలందించి, తగు సూచనలిచ్చి ప్రోత్సహించి నా పరిశోధనపూర్తి కావడానికి నాకు అన్ని విధాల సహకరించిన ప్రియమిత్రులు ఆదినారాయణరెడ్డి, తదితరులకు, పుస్తకమును సకాలంలో అందంగా ముద్రించి యిచ్చిన స్వాతి ప్రింటర్స్ వారికి నా కృతజ్ఞతలు.

డా॥ సి. శివశేఖర్‌రెడ్డి

# విషయ సూచిక


| వ. నెం. | | పుటలు |
|---|---|---|
| 1 | తెలుగు ప్రబంధం—క్షేత్రమహాత్మ్యకావ్యాలు | |
| | క్షేత్రమత్మ్య కావ్యాలు | 21—37 |
| 2 | ప్రాచీన, అర్వాచీన సాహిత్యాలలో విఘ్నేశ్వరునికథ | 39—79 |
| | వాణిపాకం—క్షేత్రమహాత్మ్య వివరణ | 81—83 |
| 3. | నందూరిబాపయ జీవిత విశేషాలు | 86—89 |
| 4. | నందూరిబాపయ విఘ్నేశ్వర చరిత్ర—రచనా విశేషాలు | |
| | శైలి | 92—96 |
| | ఇతివృత్త నిర్వహణ—కథాకథనం | 97—104 |
| | రసపోషణ | 105—109 |
| | వర్ణనలు | 110—119 |
| | ఛందస్సు | 119—131 |
| | అలంకారములు | 131—144 |
| | ఇతర కవుల ప్రభావం | 144—149 |
| | ఉపయుక్త గ్రంథసూచి | |

# 1

# తెలుగు ప్రబంధం - క్షేత్ర మహాత్మ్య కావ్యాలు.

పురాణ మనగనే సంస్కృత సాహిత్యము స్మృతి పథములో మెదలునట్లు ప్రబంధమనగనే ఆంధ్రవాఙ్మయము జ్ఞప్తికివచ్చును సర్వాంధ్ర మహాకవుల నానావిధ దోహదములతో ప్రబంధ ప్రక్రియ పరిణామము చెంది పటిష్ఠ రూపమును పొందినది సంస్కృత ప్రాచీన ఆంధ్ర కవులు ఆలంకారికులు, ఛందో లక్షణ వేత్తలు ప్రబంధ శబ్దమును బహుళముగా ప్రయోగించిరి కానీ ఈ ప్రబంధ శబ్దమును ఒకనిర్దిష్టార్థ ద్యోతకముగా ప్రాచీనులెవ్వరూ పరిగణించలేదు. నండూరి బాపన విరచితమైన విఘ్నేశ్వర చరిత్ర మను కావ్యము కూడా ప్రబంధముగనే పరిగణించ వచ్చును

ప్రబంధావతరణము హఠాత్సంభూతము గాదు. భారత రచన యందుకూడా ఈ ప్రబంధ ఛాయలు కానవచ్చుచున్నవి. భారతమున వ్యక్తా వ్యక్తముగను, ఎఱ్ఱనలో నంకురముగను, సోమునిలో మొలకగను పొడ సూపిన ప్రబంధ లత శ్రీనాథుని కాలమున కొనలు సాగి చిగిర్చి మారాకు వైచినది. అది శ్రీకృష్ణ దేవరాయల కాలమున పుష్ప ఫల సమన్వితమైనది శ్రీనాథుని యుగమునకు పూర్వము కూడ నన్నెచోడుని కుమార సంభవము వంటి కొన్ని గ్రంథములు ప్రబంధ లక్షణములు పెక్కింటిని కల్గియున్నను వస్తు విస్తృతిని బట్టి అవి ప్రబంధ లక్షణములకు దూరములగుచున్నవి.

ఆంధ్ర లోకము ప్రబంధము నొక విశిష్ట వాఙ్మయ శాఖగా అంగీకరించి యున్నది. ఆంధ్ర వాఙ్మయ నిర్మాతలలో కొందరు "ప్రబంధ-యుగము" అనిపేరుగా ఒకయుగ విభాగమును గావించియున్నారు. మను,వసు చరిత్రాది గ్రంథములు వాఙ్మయ ప్రపంచమున ప్రబంధములని ప్రసిద్ధిగాంచి యున్నవి. ఇట్లాంధ్ర లోకమునకును వాఙ్మయమునకును సుపరిచితమైయున్న ఈ ప్రబంధ శబ్దము అర్వాచీనమా? ప్రాచీనమా? సంస్కృతాలంకారికులు ఈ శబ్దమును వాడి యుండిరా? నిజముగా ఇదొక విశిష్ట ప్రక్రియయా? లేక ఒక ప్రక్రియాంతర్భాగమా? అను నిట్టి ప్రశ్నలకు సరియగు సమాధా-నాలిచ్చి ఆంధ్ర ప్రబంధ స్వరూప స్వభావముల నిర్ణయము గావింపవలెను

సంస్కృతమున కావ్యములని ఏవి వ్యవహరింప బడుచున్నవో అవి తెనుగున కూడ కావ్యములనియే యనబడుచున్నవి. వాటిలో కొన్నిటినె ప్రత్యేకించి ప్రబంధము లనుచున్నాము.

మొదట పూర్వులు ఈ ప్రబంధ శబ్దమును నే యర్థమున వాడిరి

నన్నయ భట్టు "కవి వృషభులు మహాకావ్యమని యెంచినను తాను మహాభారతమును సంహితగానే రచియింప నెంచినాడు. నన్నయ భట్టారకుడు ప్రబంధ శబ్దము నుపయోగించినట్లు కానరాదు.

నన్నెచోడుడు తన కృతిని "దివ్య సుకృతి" 1-34, యనియు

"దివ్యకథ" 1-45, 1-67 యనియు, "సద్రస బంధురమగు ప్రబంధము" 1-48, "ఉత్తమ కావ్యము" 1-56 యనియు, "దివ్యకావ్యము" 1-69 యనియు వచించినాడు. ఇంతకు ముందాంధ్రమున ప్రబంధ శబ్దమును నెవ్వరును ప్రయోగించిన వారు లేక పోవుటచే నీ శబ్దమును మొట్ట మొదట ప్రయోగించిన వాడు ఈతనే యని చెప్పవలసి యున్నది. ఈతడు వాడిన విధమును బట్టి ప్రబంధ శబ్దమునకు "కావ్యము" అని అర్థమును నిర్ణయింపవచ్చును.

నన్నెచోడుని తర్వాత తిక్కన తనతొలి కృతియగు నిర్వచ నోత్తర రామాయణము "కావ్యము" 1-9 అనియు,"కథ" 1-45 అనియు,మహా-కావ్యము ( ఆశ్వాసాంతగద్యలలో ) అనియు వచించెను. ఇందు ప్రబంధ శబ్దము కానరాదు. తరువాతివగు మహాభారతమును "ప్రబంధ మండలి" 4-1-8 అనియు,"పుణ్యప్రబంధములు" 4-1-31 అనియు,"మహాకావ్య-ము" 4-1-37 అనియు పేర్కొనెను

తరువాత నెఱ్ఱయ తన నృసింహ పురాణమును"మహాప్రబంధ-ము" పీఠిక-14,27 అనియు ప్రబంధము" పీఠిక-20 అనియు "ఉదాత్త ప్రబంధము" 1-5 అనియు పురాణ కథ 1-1 అనియు వ్యవహరించెను.

శ్రీనాథుడు నైషధమును "మహా ప్రబంధమని" 1-45 వ్యవహ-రించి కాశీఖండము నట్లు వ్యవహరింపలేదు.రాయలు ఆముక్త మాల్యదను 1-50, పెద్దన మను చరిత్రమును 1-48, రామరాజ భూషణుడు వసు చరిత్రమును 1-90,నంది తిమ్మయ పారిజాతా పహరణమును 1-34 మహా ప్రబంధములుగా వ్యవహరించిరి.

చేమకూర వేంకటకవి "విజయ విలాసము"ను పీఠిక-65, ముద్దు పళని "రాధికా సాంత్వనము" ను 1-43, కూచిమంచి జగ్గకవి "శివలీలా విలాసమును"ను 1-13 శృంగార ప్రబంధములుగా వ్యవహరించిరి.

పై వివరణము వలన తేలిన సారాంశ మేమనగా నేడు మనము

''ప్రబంధ''మునే యర్థమున వాడుచున్నారో పూర్వకవులాయర్థమున దానిని వాడలేదని తెలియుచున్నది. అంతేగాక ప్రబంధ శబ్దమును పూర్వ కవులు కేవలము ''కావ్యము'' అను అర్థమున వాడినట్లును స్పష్టమే.

సంస్కృతాలంకారికులగు విద్యానాథుడును, వామనుడును, రాజశేఖరుడును, ఆనంద వర్ధనాచార్యుడును, క్షేమేంద్రుడును ప్రబంధ శబ్దమును తమ గ్రంథములందు ''కావ్యము'' అను అర్థముననే వాడినారు విద్యానాథుడు.

''యద్యస్య సా ప్రబందేషు ప్రాచాం సాధు నిరూపితా''
(ప్రతాప రుద్రీయ నాయక ప్రకరణము)

''అథ మహా కావ్యాదయః ప్రబందా నిరూప్యన్తే''
''అథ క్షుద్రాః ప్రబంధా నిరూప్యన్తే''
(కావ్యప్రకరణము)

వామనుడు;

సూ॥ ''సందర్భేషు దశరూపకం శ్రేయః''
వృత్తి ''సందర్భేషు ప్రబంధేషుదశరూపకం నాటకాది శ్రేయః''
వామనుని కావ్యాలంకార సూత్ర వృత్తి (1 అధి , 3 అధ్యా)

రాజశేఖరుడు,

''నిక్షేపో విక్రయో దానమ్ దేశత్యాగో2ల్ప జీవితా 1తృటికో వహ్ని పంభశ్చ ప్రబందో చ్ఛేద హేతవః... ప్రబంధ వినాశ కారణాని
(రాజశేఖరుని కావ్య మీమాంస; కవిరహస్యము; 9వఅధ్యాయము)

క్షేమేంద్రుడు;

''ప్రబంధ స్సుత రాంభాతి యదాస్థానం నవేశితైః''
(సువృత్తతిలకము)

రాజశేఖరుడు ప్రబంధ శబ్దమునె గాక ''మహాప్రబంధ''శబ్దమును గూడ ''మహాకావ్యము'' అను నర్థమున వాడినాడు.

ముక్తకే కవయో2నంతాః సంఘాతే కవయశ్శతమ్
మహా ప్రబంధేతు కవి రేకో ద్వౌ దుర్లభాస్త్రయః''
—కావ్య మీమాంస ; కవి రహస్యము :10 అధ్యా

దీనినిబట్టి చూడగా ప్రాచీనాంధ్ర కవులును గీర్వాణాలంకారికులును ప్రబంధ శబ్దమును కావ్యమను అర్థమునను, మహా ప్రబంధ శబ్దమును మహా కావ్యమను నర్థమునను వాడినట్లు స్పష్టముగా విదితమగుచున్నది. విన్నకోట పెద్దనయు నీ ప్రబంధ శబ్దము నిట్లే వాడినాడు.
విన్నకోట పెద్దన:

''ధరజాటు కృతుల లోనం బరగు సుదాహరణ మను ప్రబంధము...'
—కావ్యా. చూ . 4 ఉల్లా; 11 ప;

మహాకావ్యమను నర్థమున ''భవ్య ప్రబంధము'' అను పదమును కూడా విన్నకోట పెద్దన వాడినాడు.

నగర ముఖ్యాష్టావశ వర్ణనల చేత బరఁగునదియును ''భవ్యప్రబంధ మనగ''...... ..— కావ్యా. చూ. 3 ఉల్లా; 91 ప

పై విషయము లన్నింటిని బట్టి చూడగా మను, వసు చరిత్రాదులు నేడు మనము వ్యవహరించు చున్నట్లు ప్రబంధ మాత్రములు కావనియు అవి మహా ప్రబంధము లనియు చెప్పవలసి యున్నది.

కానీ అప్పకవీయమున మాత్రము ఏమి కారణముననో గాని మహా కావ్య పదమునకు పర్యాయముగా ప్రబంధ శబ్దము వాడబడినది.

సీ॥''...ఇరువది రెండు వర్ణనలు గూర్చి చెప్పవలయు ప్రబంధంబు శ్రీనివాస''— అప్పకవీయము ; 1-27.28,

అట్టి కావ్యంబు ద్వివిధమై యతిశయిల్లు (బరువడిఁ (బబంధ చాటు

ప్రబంధములన సర్గముల సంస్కృతమున నాశ్వాసములను, దెనుఁగునఁ బ్రబంధ మనునది తనరు కృష్టి. — అప్పకవీయము.

నేటి మన ప్రబంధ శబ్ద వ్యవహారమునకు అప్పకవి వాతయే మూలమయి యుండు ననజెల్లు చున్నది.

ఇంతకు తేలిన సారాంశము నేఁడు మనము ప్రబంధమని వ్యవహ-రించునది మహాకావ్యముగాని, మహా ప్రబంధముగాని యగుననుట.

కవి చేసిన దంతయు కావ్యమే గదా! కాబట్టి ప్రబంధము కూడ కావ్యమే అగుచున్నది. కావ్యములకు లక్షణములను మన పూర్వలాక్షణికులు చాలామంది వ్రాసియున్నారు సంస్కృతమున దండ్యాదు లనేకములగు కావ్య భేదములను చూపియున్నారు తనకంటె పూర్వులైనలాక్షణికుల యభిప్రాయములను క్రోఢీకరించి వాటి నన్నిటిని సేకరించి ధ్వన్యాలోక కారుడైన ఆనంద వర్ధనుడు తన ధ్వన్యాలోకమున ఇట్లను చున్నాడు.

"యతఃకావ్యస్య ప్రభేదాః-ముక్తకమ్ సంస్కృత ప్రాకృతాప భ్రంశ నిబద్ధమ్ సందానితక విశేషక కాలాపక కులకాని పర్యాయ బన్ధః పరికథా సకల కథా ఖణ్డకథే సర్గబన్ధో 2 భినేయార్థ మాఖ్యాయికా కథేత్యేవ మాదయః" — ధ్వన్యాలోకము - 3·7

ముక్తకము- ఇది సంస్కృత నిబద్ధము ప్రాకృత నిబద్ధము అపభ్రంశ నిబద్ధము అని మూడు విధములుగా నున్నది. సందానితకము, విశేషకం కాలాపకము, కులకము, పర్యాయ బంధము, పరికథ, ఖండకథ, సకలకథ, సర్గబంధము, అభినేయార్థము, ఆఖ్యాయిక, కథ మొదలుగునవి.

పై కావ్య భేదములలో నెచ్చటను ప్రబంధ శబ్దము ప్రత్యేకముగ కానరాదు. కానీ ఈతడిచ్చిన నిర్వచనములలో మాత్రమొకటి రెండు మాటలు ప్రబంధ శబ్దము గానవచ్చుచున్నది.

"పర్యాయ బన్ధః ఖణ్డకావ్య స్వరూపః
సమాప్తాయా మప్యవాన్తర క్రియా
యాం వసన్తాద్యేకతమ వర్ణనీయ
వస్తు వర్ణనాత్మకః ప్రబన్ధః"

" ఆఖ్యాయికా స్వాచిత్ర వక్త్రా పరవక్త్రా
దిచ్ఛన్దస్క ఉచ్ఛ్వాసా శ్వాసాబ
దవిభాగ భాగే గద్య ప్రచురః ప్రబన్ధః"

"కథా సజ్జన దుర్జన వృత్తాన్త వర్ణన పరః
క్వాపి చిత్రార్యా వక్త్రా పరవక్త్ర యుక్త ఆశ్వా
సాది శూన్యో గద్యమయః ప్రబన్ధః"

పై నిర్వచనములలో కావ్య బేదములన్నియు చెప్పబడినవి. ఈ దా-హృత కావ్యభేదములలో నెచ్చట నూ ప్రబంధ శబ్దోచ్చారణమైననూ లేదు. పర్యాయ బంధమును, ఆఖ్యాయికను, కథనుగూడ ప్రబంధ నామముననే పేర్కొని యున్నాడు. వస్తు బేదము వలన నా మూడిటిని ప్రత్యేక కావ్య భేదములుగ నంగీకరించి వానిని ప్రబంధములని ఏక నామమున పేర్కొని యుండుటచే నీ ప్రబంధ శబ్దము సర్వగ్రంథ సామాన్య వాచియా యను సందేహము కలుగు చున్నది.

ఇక ఈ ప్రబంధ శబ్దము సంస్కృతాలంకారికులచే నెచ్చటెచ్చట ఏయే యర్థములలో వాడబడియున్నదో యించుక గమనింతము.

విశ్వనాథుడు తన సాహిత్య దర్పణమున - "నను తర్హి ప్రబన్ధాన్తర్వ-ర్తినాం కేషాం చిన్ని రసానాం పద్యానాం కావ్యత్వం నస్యాదితిచేన్న రసవత్పద్యాన్తరగత నీరస పదానామివ పద్య రసేన, ప్రబన్ధ రసేనైవ తేషాం రసవత్తాఙ్గీకారాత్" - సాహిత్య దర్పణము - 1-20 పుట.

ప్రబంధముల యందలి కొన్ని నీరసములగు పద్యములకు గావ్యత్వ ము లేదనినచో నది సరికాదు. రసవత్పద్యాంతర్గత నీరస పదములకు పద్య రసము వలనే, ప్రబంధ రసము వలననే వాని ( ఆ నీరస పద్యముల ) రసవత్త యంగీకరింపబడినది.

ఇందు విశ్వనాథుడు కావ్య ప్రబంధ శబ్దములను సమానార్థకములు గా వాడినాడు. ఈతడే ఇతిహాసమగు భారతమును, మహాకావ్యమగు రామాయణమును గూడ ప్రబంధములని వ్యవహరించి యున్నాడు. శ్రవ్య- ములగు వీనినే గాక దృశ్యములగు మాలతీ మాధవ రత్నావల్యాదులను గూడ ప్రబంధ నామముననే వ్యవహరించి యున్నాడు.

"కరుణ రసస్య దుఃఖ హేతుత్వే కరుణ రస ప్రధాన రామాయణాది ప్రబన్ధా నా మపి దుఃఖ హేతుతా ప్రసంగస్స్యాత్"

వర్ణ రచనయో రుదా హరిష్యతే- ప్రబన్ధేయథా-మహా భారతే శాన్తః, రామాయణే కరుణః, మాలతీ మాధవ రత్నావల్యా దౌశృఙ్గారః ఏవ మన్యత్ర - సాహిత్య దర్పణము, పుట. 238.

"ఇట్లే యభిజ్ఞాన శాకుంతలమునకు వ్యాఖ్య వ్రాయుచు శ్రీనివాసా చార్యులు కాళిదాసు నామా మహాకవిః నాటకాన్తమ్ కవిత్వ మితిధియా నాటక రూప ప్రబన్ధం నిర్మితవ్యాః" అని బాహాటముగా నాటకమును ప్రబంధ ముగా పరిగణించి యున్నాడు.

ఇట్లే జయదేవుడు తన ప్రసన్న రాఘవము నందు "నాట్య ప్రబన్ధ మతి మఞ్జు సంవిధానమ్" అని నాటకమును ప్రబంధముగా వ్యవహరించి యున్నాడు.

ఇట్లు దృశ్య, శ్రవ్య కావ్యములను ప్రబంధములనుటయే గాక కొందఱాలంకారికులు తమ యలంకార గ్రంథములను కూడ ప్రబంధము లనియే నుడివియున్నారు.

విశ్వనాథ కవిరాజు తన సాహిత్య దర్పణమును ప్రబంధమని క్రింది విధంగా చెప్పాడు "శ్రీ చన్ద్రశేఖర మహా కవి చన్ద్ర
సూను శ్రీ విశ్వనాథ కవిరాజ కృతం
ప్రబన్ధమ్ సాహిత్య దర్పణ
మముం సుధియో విలోక్య
సాహిత్య తత్త్వ మఖిలం సుఖ-
మేవ విత్త"
—విశ్వనాథ కవి రాజు; సాహిత్య దర్పణము

"ప్రతాపరుద్ర దేవస్య
కీర్తి మాశ్రిత్య నిర్మితః
అలంకార ప్రబన్ధో2యం
సన్తః కర్ణోత్సవో2స్తువః" -- ప్రతాపరుద్రీయము.

ఇక రాజశేఖరుడును తన కావ్య మీమాంసయందు ప్రబంధ శబ్దము నెన్నియో సార్లు వాడియున్నాడు. కావ్యము ముక్తక, ప్రబంధ భేదముల రెండు విధములని రాజశేఖరుని యభిప్రాయము.

" స పునర్ద్విధా-ముక్తక ప్రబన్ధ విషయత్వేన "
— కా. మూ, మీ —నవమాధ్యాయము.

బరోడా గ్రంధమాలలో ప్రకటితమైన కావ్యమీమాంస యందు సంపాదకు లీ విషయమున నొక విపుల వ్యాఖ్య వ్రాసియున్నారు

For the sub-divisions of Kavaya, See Dhvanyaloka. Ancient writers on Alankaras such as Bhamaha and Vamana devide Kavyas in to two either as అనిబద్ధ (Anibaddha) and నిబద్ధ (Nibaddha) or as ముక్తక (Muktaka ) and ప్రబన్ధ Prabandha respectively.

ఈ పై నుదహరింపబడిన వానిని బట్టి ముక్తక మనగా అనిబద్ధ కావ్యమనియు, ప్రబంధమనగా నిబద్ధ కావ్యమనియు ప్రాచీనాలంకారికుల యభిప్రాయమని ఊహింప వచ్చును. భామహుడు, వామనుడు, రాజశేఖరుడు మొదలగు ప్రసిద్ధ లాక్షణికులందరు నీ మత-మునే యంగీకరించియున్నారు. కావున ముక్తక మను కావ్య భేదము తప్ప తక్కిన దృశ్య శ్రవ్య కావ్యము లన్నియు ప్రాచీనాలంకారిక మతమున ప్రబంధములే నని చెప్పవచ్చు.

తెనుగు లాక్షణికులును ప్రబంధములనియు, చాటు ప్రబంధములనియు నిరు తెఱగుల కావ్య భేదములను నిరూపించి యున్నారు.

—ఉదా॥ అప్పకవీయము—27 29, 30 పద్యములు

ముక్తకాదులను చాటువులని విన్నకోట పెద్దన కావ్యాలంకార చూడామణిలో తెలిపినాడు.

ఉ॥ "ఇటుపలె ముక్తకాది
స్ఫుట తర చాటు ప్రబంధముల లక్షణముల్
పటుమతి నెఱుగుట సుయశో
పుటనంబుల కెల్ల గుదురు కవి నృపతులకున్"

—కావ్యా.చూ. చతుర్థోల్లాసము.

తెనుగు కవులును, లాక్షణికులును చెప్పిన ఈ చాటు ప్రబంధములే ప్రాచీన సంస్కృతాలంకారికులచే నిరూపింపబడిన ముక్తకాదులు.

ఇక ఈ ప్రబంధ శబ్దమును తెనుగు కవులు తమ

తమ కావ్యాలలో వాడిన విధమునకు క్రింది ఉదాహరణములను పేర్కొన వచ్చును.

1, నన్నెచోడుడు:

"భంగిగ విస్తరించెద బ్రబంధము స్వరస బంధురంబుగాన్"
— కుమార సంభవము : అవతారిక.

ఇక్కడ ప్రబంధ శబ్దము కావ్య, కృతి శబ్దముల కు సమానార్థకముగ వాడబడినది.

2. తిక్కన ;

"అని రచనా కౌతుకమున
మన మలరగ నీ ప్రబంధ మండలి కథినా
ధునిగా నే పురుషుని బే
ర్కొను వాడనో యను తలంపు గూరిన మదితోన్"
— భారతము : వి ప: 1-8.

వ॥ "అని పూని యీ దృశంబులగు పుణ్య ప్రబంధములు దేవ సన్నిధిం బ్రశంసించుటయు నొక్క యారాధన విశేషం బగుటం జేసి"
—భారతము : వి. ప: 1-31

3. కేతన ;

తత్ప్రబంధ ముఖ మండనంబుగా నమ్మహాత్ము వంశావతారంబు వర్ణించెద. —దశకుమార చరిత్ర

4. ఎఱ్ఱన :

అని యమ్మహీ నాయకు గృతి నాయకత్వంబున కభిముఖుంబుగా నొనర్చి జగదర్చితంబగు ప్రబంధంబు నిర్మింప నుపక్రమించితి''  —హరివంశము-అవతారిక

ఇక్కడ ప్రబంధ శబ్దము పూర్వ హరి వంశ పురాణమునకు వాడబడినది.

శ్రీ నృసింహావతారంబను పురాణంబు దెనుంగు బాస బ్రకటింప వలయు నమ్మహా ప్రబంధంబునకు - నృసింహ పురాణము

5. శ్రీనాథుడు ;

1.నవరస భావాను బంధ బంధురంబుగా నొక్క ప్రబంధంబు నిర్మింపదలచి -శృంగార నైషధము

2, నాకు గృపసేయు మొక ప్రబంధంబు నీవు కవిత గుణ గణ్య! శ్రీనాథ కవివరేణ్య భీమేశ్వర పురాణము.

3. బాల సఖుడవు శైవ ప్రబంధ మొకటి నుపధరింపుము నాపేర నంకితముగ - హర విలాసము

6. నంది మల్లయ ఘంట సింగయ:

వ॥ నాయక ప్రశంసయు మధ్యమాధ మోత్తమ కవిత్వంబుల తారతమ్యంబులు నభివర్ణించి యుత్తమ మార్గంబుననే తత్ప్రబంధంబు రచియింప నుద్యుక్తులమై - వరాహ పురాణము.

7. పిల్లల మఱ్ఱి పిన వీరభద్రుడు;

అని ప్రబంధంబు జెప్ప నుద్యోగించు సమయంబున''
— జైమిని భారతము.

పై విధముగ ఉదాహరణము లెన్నియేని జూపవచ్చును. తిక్కనార్యుడు తాను రచించిన పదిహేను పర్వముల భారతమును ప్రబంధ మండలియనియే పేర్కొనినాడు. ఎఱ్ఱన పురాణమగు హరివంశమును గూడ ప్రబంధము అనియే వ్యవహరించెను. మరియు ప్రబంధ పరమేశ్వరుడను బిరుదుతో ప్రఖ్యాతి గాంచెను. శ్రీనాథుడు తన గ్రంథము లన్నిటిని ప్రబంధము లనుటయే గాక వీధి యగు క్రీడాభి రామమును గూడ ప్రబంధమని చెప్పెను. కావున శతకములు మొదలగు అనిబద్ధ కావ్యములు తక్క తక్కిన యాంధ్ర గ్రంథము లన్నియు ప్రబంధములే యనవచ్చును.

ఇట్లు ప్రబంధ పదము భారతాది సర్వగ్రంథ వాచకమయ్యు ఇటీవల ఒక ప్రత్యేక కావ్య భేదముగ ఆంధ్రులచే పరిగణింపబడుచున్నది. మరియు తెలుగు వారిలో చాలామందికి ప్రబంధమనగా ఆంధ్ర గ్రంథమనియే అభిప్రాయము. శ్రీనాథకృత శృంగార నైషధమును ప్రబంధమని వ్యవహరించుచు దానికే మూలమగు శ్రీహర్షుని నైషధమును కావ్యమనియే అందురు. ఇట్టి వ్యవహారము తెలుగువారిలో నెట్లు రూఢమైనదో చెప్ప జాలము.

ఆంధ్ర గ్రంథములను సమగ్రముగా పరిశీలించినచో ఒక విశేషము కనిపించును. ఆంధ్ర కవులలో కొందరు కథా కథనము నందే దృష్టిని నిల్పిరి. కొందరు కథా కథనము కంటే కవితా శిల్పమునే విశేషముగా ఆదరించిరి. కథా కథనమునందు దృష్టిని నిలిపి వ్రాసిన వ్రాతను పురాణ ధోరణి అనియు స్థూలముగా వ్యపదేశింప వచ్చును. ఈ ప్రబంధ ధోరణి నధికముగా ఆశ్రయించిన వారు ప్రబంధ కవులనియు, పురాణ ధోరణి నధికముగా ఆశ్రయించిన వారు పురాణ కవులనియు స్థూల నిర్దేశము

ప్రబంధ లక్షణములను సాకల్యముగ నిరూపించిన ఆంధ్ర లాక్షణికు లరుదని చెప్పవచ్చును. ఇక ప్రబంధ లక్షణముల తెలుసుకొన వలెనన్నచో ప్రబంధ నామమున వెలువడిన గ్రంథములను సమగ్రముగ

పరిశీలించి వానిలోని సామాన్య లక్షణములను క్రోడ్ధీకరింపవలెను. ఆంధ్ర వాఙ్మయ వేత్తలచే ప్రబంధ యుగమని పేర్కొనబడిన రాయల కాలమున వెలసిన గ్రంథములే విషయ నిర్ణయమునకు మిక్కిలిగా ఉపయోగించును రాయల యుగమునకు పూర్వము ఇట్టి గ్రంథములు కలవు, కాని అవి విరళములు.

ప్రబంధ గుణములను ఈ రీతిగా నిర్వచింపదగును. ప్రబంధముల కేక నాయకాశ్రయత్వముతో పాటు వస్త్వైక్యమును నపరిహార్యమైన ధర్మము ప్రబంధమున కాలంబనములు నాయికా నాయకులు. నాయకుడు సాధారణముగా ధీరోదాత్తుడు, నాయిక స్వీయ, వస్త్వైక్యమనగా ప్రబంధ వస్తు భాగములు కార్యకారణ సంబంధము కలిగి ఒకదానితో ఒకటి పొంసి పొసగి వుండవలెను. ఒక చిన్న కథను సర్వాంగ సుందరముగ పెంచి వ్రాయుటకు వర్ణనలు ముఖ్యములు. ఈ వర్ణనలు ప్రబంధము లందు సాధారణముగా రెండు విధములుగా ఉండును.

1. వస్తు బహిరా కార వర్ణనము 2. వస్తుగుణ వర్ణనము

ఈ వస్తువర్ణనములో సజీవప్రకృతి వర్ణనము, నిర్జీవ ప్రకృతి వర్ణనము కలసి వుండును సజీవ ప్రకృతిలో మరల మానవ ప్రకృతి వర్ణనము, మానవేతర ప్రకృతి వర్ణనము ఉండవచ్చును. వస్తు గుణ వర్ణనమనగా తత్త్వ విచారము చేసి తన్మనోగతి వివిధ భావ పరివర్తనములను వ్యక్తము చేయుట

కృష్ణదేవరాయల కాలమునుండి బయలు దేరిన కొన్ని కావ్యములకు ప్రబంధములను ప్రత్యేక నామమును పూర్వులీయలేదు. కానీ ఆధునికులు ఆ విధంగా వాకొనుట జరిగినది. రాయల కాలము నుండి జరిగిన రచనలలో గల వైలక్షణ్యమే అట్టి ప్రత్యేక నామ సృష్టికి దారి తీసినది. ఆ వైలక్షణ్యము నుపలక్షించి విశ్లేషించి డా॥ కె. వి. ఆర్. నరసింహం ప్రబంధ లక్షణమును క్రింది విధమున నిర్వచించిరి.

కథైక్యమును, నష్టాదశ వర్ణనలును కలిగి, శృంగార రసప్రధానమై యర్థాతిశాయియైన శబ్దమును గ్రహించి యాలంకారిక సాంకేతికములకు విధేయమై, యనతి విస్తృతి గల ఇతివృత్తముతో భాషాంతరీకరణముగాక స్వతంత్ర రచనయేయైన తెనుగు కావ్యము ప్రబంధము.

ఆంధ్రప్రబంధము-అవతరణ వికాసములు -13.

పైన వివరించిన లక్షణములు కొన్ని ప్రబంధముల యందు కాన రాకున్నను ఆయా యుగ ధర్మ ప్రాధాన్యమును బట్టియు, రచనా ధోరణి బట్టియు అవియును ప్రబంధ నామముననే వ్యవహరింపబడుచున్నవి.

పై నిర్వచనము ననుసరించి అల్లసాని కృతమగు మనుచరిత్ర మొదలుగా గల రసవత్తరమైన స్వతంత్ర కావ్యము లన్నియు ప్రబంధము లగుచున్నవి. ప్రబంధములు వర్ణనా ప్రధానములు. అట్లగుట జేసి నన్నె-చోడుని కుమారసంభవము ఆది ప్రబంధముగా పరిగణింపబడుచున్నది.

ఆంగ్ల సాహిత్యమున ఆధునిక సమాజ ఫలితంగా ఆవిర్భవించిన కాల్పనికోద్యమమునకు "Romantic Moment" అని పేరు. ఆంధ్ర సాహిత్యమున ప్రబంధ యుగమునకు సమాన లక్షణములు అనేకములందు గలవు. కల్పన ప్రధానముగ గల కథాస్థితినిగాని, సన్నివేశములను గాని సృష్టించుట కాల్పనికత అనవచ్చును. విశాల కథా ప్రాతిపదికపై అద్భుతావహములైన సన్నివేశము లాధారముగా మానవాతీతమైన పాత్రలలో పదునాల్గు లోకముల వత్తాంత మూలమున మత ధార్మిక విషయ ప్రపంచము నుండి విముక్తమైన నవ్య సాహిత్యోద్యమమే ప్రబంధము.

ప్రబంధమునకు శృంగార రసము జీవము. ఈ శృంగారమునకు కూడా సంస్కృత కావ్యములలో వలె శాస్త్రీయమైన పద్ధతులలో రసముగా కాక మానవ ప్రవృత్తులు ఆధారముగ పోషించుట ప్రబంధ కవుల విశిష్ట లక్షణము. కామ ప్రవృత్తులనంతము. వ్యక్తి వ్యక్తికి శృంగార రసభావ

ప్రకటనమున వైరుధ్యముండును. ఇట్టి వైరుధ్య వైవిధ్య సృష్టియే ప్రబంధ కవుల శృంగార రస ధర్మము.

పాత్ర చిత్రణము, ఇతివృత్త నిర్మాణము, వర్ణనా పద్ధతి ప్రబంధ కవులకు పురాణ కవుల కంటె విభిన్న విశిష్ట స్థానమును ప్రసాదించినవి నిజమునకు కవి వ్యాపారమే వర్ణనము. వేద సంహిత నుండియు కథా సరిత్సాగరము నుండియు జన సాగరము నుండియు వివిధ కథలను స్వీకరించి ఉపాఖ్యాన సహితముగా మత ప్రాధాన్యమును ఉగ్గడించుట చేత పురాణ కవులది కథా సృష్టియే కాని వర్ణనాదృష్టికాదు. ప్రకృతి వర్ణనలు కథను ఉజ్జ్వలము చేసి అనుభూతి గమ్యములు కావలసి యున్నను కథలో అంతర్భాగములు కాని వర్ణనలు కావ్యకళకు భంజకములు. ప్రబంధాలు వర్ణనలకు మణి మంజూషలు.

లోకమున స్త్రీ, పురుషులలోని ఆశనిరాశలు, ప్రేమ క్రోధములు స్వార్థ త్యాగములు, పతన ఔన్నత్యములు, లౌకికా లౌకికములు సర్వము ప్రబంధములలో సజీవముగ సాక్షాత్కరించును. ఈపాత్రలలోని అలౌకిక విషయస్ఫూర్తి స్వీకృత ఇతివృత్త స్వభావము వలనను కవులకు సహజముగానున్న భావోద్రేకత వలనను సంబంధించినదేగాని, ప్రత్యేకముగ ప్రబంధకవుల సృష్టికాదు. మార్కండేయ పురాణములోని చిరు సన్నివేశము ఒకటి పెద్దన ఆత్మాశ్రయ కల్పనా సౌందర్య సాగరము నుండి మథింపబడి మను చరిత్ర అవతరించినది. ఇట్లే ప్రబంధము లన్నియు ఉపాఖ్యానములను అస్థి పంజరముల నుండి ఊహతో నిర్మింపబడిన జగన్మోహనులు

ప్రబంధములోని సౌందర్య ప్రవాహముల అట్టడుగున జీవ గాంభీర్య ప్రధానమైన ధర్మపథము నిర్దేశము యున్నవి. సమకాలిక సమాజములోని సర్వభావ సంచలనములు వ్యక్తపథము నుండి తాత్త్విక దృక్కోణముగ్గా వ్యక్తముయినవి. ఒక విధంగా ప్రబంధ ఉద్యమ నాయకుడు శ్రీ కృష్ణదేవరాయలు అనవచ్చు.

రాయల తత్త్వమే విభిన్న కవుల అత్మాశ్రయ సంవేదనములపొంది విశిష్టధర్మపథ నిర్దేశమైనది. పెద్దన విశిష్టాద్వైత వైష్ణవుడు. వేదప్రామాణము నంగీకరించి కర్మ, జ్ఞాన, భక్తి, నిష్ఠయోగములకు కళారూపముగా మను చరిత్రను మలిచెను. రాయలది గురుపరంపరా జనితవైష్ణవము. జాతి, కుల, జ్ఞానముల కతీతమైన భక్తి, నిష్ఠ ఆత్మగాకలది రాయల వైష్ణవ దృక్పథము తిమ్మన వైష్ణవుడే అయినను రాయల తత్త్వముచే ప్రభావితుడై ఆరాధన మధుర, క్రోధమును ఆధారముగా మోక్షమును పొందు వైష్ణవ మార్గము తత్త్వముగా స్వీకరించెను. జన్మతో శైవుడైన రామలింగడు స్వీకృత వైష్ణవముచే రామకృష్ణుడయ్యెను ప్రబంధములలో శాంత శృంగారముల భోగ త్యాగముల ఘర్షణయున్నది మహమ్మదీయ, శైవ, వైష్ణవ, మార్గభావ సంచలనమే నాటిభవితుల రసికతా జీవనమే ఇట్టిఘర్షణమునకు కారణము

అనుభవమునకు కాని మిథ్యా కల్పనములకు ప్రబంధములు ఆలవాలములని, సంఘ స్పర్శలేని మంత్ర నగరములని, కవి కల్పనాలోకమున వెలసిన స్వర్గసీమలు ప్రబంధములని కొందరి విమర్శకుల భావన. సూక్ష్మముగా పరిశీలించిన యెడల భారత, రామాయణములకంటె, శ్రీనాథకృతుల కంటె సమకాలిక సాంఘిక జీవనమును సుందరముగను సమగ్రముగను వ్యాఖ్యానించినవి ప్రబంధములే ప్రజలసాంఘికజీవనమే, ధనవంతులరసిక ప్రవృత్తులే ఆంధ్రసాహిత్యమున ప్రబంధమను సాహిత్య అవిర్భవించుటకు చారిత్రక కారణం రాయలయుగమునకు చెందినప్రబంధములను తిరుగులేని సిద్ధాంతము చేయుటకు అవకాశమున్నది. తమకనే రాధామాధవము, శ్రీకాళహస్తి, మహత్మ్యము, పాండురంగ మహాత్మ్యాది గ్రంథ గర్భములలో సహితము రాయలయుగపు సాంఘికజీవనమే నిక్షేపింపబడియున్నది. సమాజము లోని ధనికులతో పాటు సామాన్యజన జీవితమునకు సహితము ప్రబంధములు వ్యాఖ్యాన ప్రాయములే. కాని ఈ ప్రబంధ కవులకు అంతఃపుర జీవితముతో తాదాత్మ్య మున్నంతగా అధోజగత్సహోదరులతో భ్రాతృత్వము కనిపించదు.

ప్రబంధము లనబడిన గ్రంథములలో ఏకనాయకా శ్రయత్వముతోపాటు వస్త్వైక్యము నపరిహార్యముగ నుండును. అంతేగాదు అవిపురాణాంతర్గ తాఖ్యానములను నిమిత్త మాత్రములుగా గ్రహించి యా యసిపంజర ములను సర్వావయవ సుందరములుగ చేసిన స్వతంత్రచిత్రములు వర్ణనా బాహుళ్యము, శృంగార రసప్రాధాన్యము, అలంకారిక శైలి వీనియందు విశేషము ఈ లక్షణములు కొన్ని ప్రబంధముల యందు కానరాకున్ననూ యుగప్రాధాన్యమును బట్టి రచనాదరణి బట్టియునవియు ప్రబంధములే యగుచున్నవి.

తెనుగు ప్రబంధము గద్యపద్య కథన సంవాద వర్ణనాది వివిధ ప్రక్రియల నేకత్ర రాశీభూతముగా చేసిన సంపూర్ణమూర్తి

మహాకవి ప్రతిభకు గల ముఖ్య లక్షణములలో ఒకటి పాత్రనిర్మాణ కౌశలము. సజీవపాత్ర నిర్మాణ కౌశలము సామాన్య కవులందఱకును అందుబాటులో నుండునది కాదు. ఇది ప్రబంధ కవులందఱకును కలదని చెప్పజాలము పెద్దనార్యుని మనుచరిత్రమున వరూధినీ ప్రవరులు, తిమ్మన పారిజాత పహరణమున సత్యభామ ధూర్జటి కాళహస్తి మహాత్మ్యమున తిన్నడు తెనాలి రామకృష్ణుని పాండురంగ మహత్త్యమున నిగమశర్మ యక్క పింగలిసూరన కళాపూర్ణోదయమున కలభాషిణీ మణికంధరులు, సుగాత్రీ శాలీనులు, సుముఖాసత్తి, మణిస్తంభులు, ప్రభావతి, ప్రద్యుమ్నమున శుచి ముఖి, రాయుల ఆముక్త మాల్యదలో మాలదాసరి, చింతలపూడి, ఎల్లనార్యుని రాధామాధవమున రాధ, ఎడపాటి ఎఱ్ఱన శృంగార మల్హణచరిత్ర మున ధనదత్తుడు, శంకర కవి హరిశ్చంద్రోపాఖ్యానమున చంద్రమతీ హరిశ్చంద్రులు, కాలకౌశికుడు, చేమకూర వెంకటకవి విజయవిలాసమున ఉలూచి, సుభద్ర సజీవపాత్రలు. వీనిలో నెంతయో తరతమభేదము కలదు ప్రబంధ కవుల ప్రత్యేకత పాత్ర నిర్మాణ నైపుణియందే కానవగును.

ప్రబంధ కవితకు వర్ణనలొక ముఖ్యాంగము తుదికి వర్ణనలే మితి మీరి ప్రబంధ రచనకొక కళంకము సంపాదించినవి కాని రాయలకాలమున వెలసిన ప్రబంధములు మాత్రము యథోచిత వర్ణనా విలసితములై యున్న వనవచ్చును.

ప్రబంధములన్ని ఒక్కజాతికి చెందినవి కావు. కొన్ని పౌరాణికములు, కొన్ని చారిత్రకములు, కొన్ని సాంఘికములు, కల్పితములై ఉన్నవి.

ప్రబంధముల కొక ప్రత్యేక శైలి కలదు. ఆంధ్రవాఙ్మయమున తొలి నుండి శైలివిషయమున రెండుమార్గములు చూపట్టుచున్నవి ఒకటి శయ్యా సౌభాగ్యముతో కూడినది. రెండవది భావ గాంభీర్యము ప్రధానమైనది. ఇందు మొదటిదానికి నన్నయ, రెండవదానికి తిక్కన ఆచార్యులు. శయ్యా సౌభాగ్యమునకై పాటుపడిన ఆంధ్రకవులలో ప్రబంధ కవులు ముఖ్యులు ప్రబంధ కవులకు సంవాదాత్మక శైలిని చూపినవాడు పెద్దనయే. ప్రబంధ శైలి రామరాజ భూషణుని కవితయందు పరమావధి నందినది. ప్రబంధ కవులందఱును శయ్యా విషయమునకడు నిపుణులే యనవచ్చును.

ప్రబంధ రచనయే ప్రముఖమైన కాలము ప్రబంధయుగము ప్రబంధ రచనకు దోహద మొసగుటయేగాక స్వయముగా ఒక మహాప్రబంధ మును రచించిన విజయ నగరాధీశ్వరుడు, సాహితీ సమరాంగణసార్వ భౌముడు శ్రీ కృష్ణదేవరాయలు యుగకర్త.

ప్రబంధ శబ్దమును సంస్కృతమున ఏయే అర్థములలో ప్రయో-గించిరో ఆంధ్రకవి లాక్షణికులు కూడా అదే అర్థములలో ప్రయోగించిరని నిరూపింపబడినది రాయల కాలము నుండి రచింపబడిన స్వతంత్ర శృంగార కావ్యములకే ప్రబంధములను పేరు కలిగినదని నిరూపింపబడినది తెనుగునగల అష్టాదశ వర్ణనానియమము సంస్కృతము నుండి సంక్రమించి నదేయని చెప్పవచ్చు.

మొత్తముమీద శ్రీకృష్ణదేవరాయుల కాలమునందు తదనంతర కాలమునందు ప్రబంధ ప్రక్రియ వైభవోపేతముగా వర్ధిల్లినది. అర్వాచీన కాలమునందు ప్రక్రియ కొనసాగినను స్వతంత్రత కొఱవడి భావదాస్యము మితిమీరినది క్షీణ, దక్షిణాంధ్ర యుగములందు అతివేల శబ్దప్రాధాన్యము. అనుచిత శృంగార తాల్యము పెచ్చుపెరిగి ప్రబంధ గౌరవము సడలినది. ఆధునిక యుగమున తిరిగి కొంత స్వతంత్రతా గుణము భాసించినది. ఏమైనను రాయల యుగమునందలి ప్రబంధమాలే సర్వగుణ సంశోభితములైయున్నవని చెప్పవచ్చును.

ప్రబంధ కవులకు వక్రోక్తి చమత్కారభిక్షను పెట్టినవాడు నాచన సోముడు. ప్రబంధ కవికులమునకు మహాచార్యుడైనవాడు శ్రీనాధుడు కవిసార్వభౌముని శృంగార నైషధము ఆంధ్ర ప్రబంధములకు మేలుబంతి అయినది. ఒకవంక పురాణేతిహాస కవులైన నన్నయాదులకు ఒకచేతిని రెండవ వంక ప్రబంధకవులైన పెద్దనాదులకు మరొకచేతిని అందించి పురాణకవులకు, ప్రబంధకవులకు నెడమడుగు లేకుండ వ్యవధానము కానరాకుండ సమ్మేళనము పుట్టించిన సూత్రధారుడు శ్రీనాధుడు అందుచేతనే శ్రీనాధుని యుగమును ప్రబంధ పూర్వయుగముని పేర్కొనుచున్నాము దీని సారాంశమేమనగ భారతంలో బీజప్రాయముగ ఎఱ్ఱనలో అంకురప్రాయముగ సోమనలో మొలకగ పొడసూపిన ప్రబంధలత శ్రీనాధునిచేతిలో కొనలు సాగి చిగిర్చి మాఱాకు వేసినది. అది పుష్ప ఫల సమన్వితమగుట రాయలకాలములో మనుచరిత్రయే ఆ లత పూచిన తొలిపూవు. పండిన-తొలిఫలము మరి ఈయుగమునకు పూర్వము తిక్కనశ్రీనాథాదులు ప్రబంధ దోహద కౌశలులు అందరుండగా పెద్దనాదులనే ప్రబంధ కర్తలనుటకు కారణము మను చరిత్రాదులు స్వతంత్రరచనలగుట ఒకటియే ఈవిధముగా తెలుగు సాహిత్యంలో ప్రబంధ రచనాభివృద్ధి జరిగినది

SRI VENKATESWARA CENTRAL LIBRARY & RESEARCH CENTRE
TIRUPATI.
54420



# క్షేత్రమాహాత్మ్య కావ్యాలు

క్షేత్రము :

క్షేత్ర శబ్దమునకు భూమి, ప్రదేశము అను అర్థములు ఉన్నవి. " క్షేత్రస్యపతి " అను శబ్దమునకు ఋగ్వేదము, అధర్వణ వేదములోను దీనికి రూపాంతరమైన "క్షేత్రాణాంపతి" అనుశబ్దమునకు అధర్వణ వేదములోను "Tutelary Deity " అను అర్థము చెప్పబడినది.

బ్రహ్మ పురాణంలో క్షేత్ర శబ్దమునకు A sacred spot or district, place of piligrimage (As Benaras and Company) అను అర్థమున్నది. -williams Monier - Sanskrit English Dictionary - P 332

క్షేత్రమున కున్న అర్థములలో పుణ్యభూమి, సిద్ధస్థానము అనునవి కూడ కలవు - శ్రీ వేంకటాచార్యులు - మామిడి - ఆంధ్రదీపిక - P 240

A sacred spot a place of piligrimage అనునవి క్షేత్రమునకు అర్థములుగా Brown తెలిపినాడు.

Brown C. P. Telugu – English Dictionary, P. II 71

నిఘంటువులో క్షేత్రములకున్న అర్థములను పరిశీలించినప్పుడు మొదట "ప్రదేశం" అను అర్థంలో నుండిన క్షేత్ర శబ్దము కాలక్రమమున " పుణ్యస్థలము " గా అర్థ గౌరవమును సంతరించుకొన్నట్లు తెలియుచున్నది.

మహాత్మ్యము :

'మహన్' అను శబ్దమునకు 'A great man' అని అర్థము

చెప్పబడినది. 'మహిమ' శబ్దము-మహస్ శబ్దభవము. సంస్కృత శబ్దరత్నా వళి కర్త తకారాంత పుంలింగమగు 'మహత్' శబ్దమును పూజ్యుడు అను అర్థమున ప్రయోగించియున్నాడు.

"తకారాన్త పుంలింజ్గో మహచ్ఛబ్దః-కావున పూజ్యమగు భావమును తెలుపునది మహిమ కాగా, మహిమను వివరించునది మహత్మ్యము.

" యాని నామాని గౌణాని విఖ్యాతాని మహాత్మనః " శ్రీవైష్ణవా చార నిర్ణయము - తి ప రామానుజస్వామి - పుట. 256) అను విష్ణు సహస్త్ర నామాధ్యాయ వచనమును బట్టి మహత్మ్యముగా మహా విష్ణువను అరమును కలిగియున్నది.

ఏదేని క్షేత్ర మహత్మ్యమును తెలుపు కావ్యములు క్షేత్రమహత్మ్య కావ్యములు, అవి మహత్మ్య గ్రంథములు అనియు పిలువబడుచున్నవి

- డా॥ జి. నాగయ్య - తె సా.స. 2వ సంపుటము - పుట 112
- డా॥ జి. నాగయ్య - ద్విపద వాఙ్మయము - పుట 248

ఆంధ్ర వాఙ్మయములో క్షేత్ర మహత్మ్యములను ఒక సాహిత్య ప్రక్రియగా పరిగణింపవచ్చును. స్థల పురాణాములే క్షేత్ర మహత్మ్యములు క్షేత్రము, తీర్థము, దైవము - ఈ మూడింటి మహిమలను వర్ణించు వానిని మహాత్మ్యము లందురు. క్షేత్రమనగా పవిత్ర స్థానమని అత్మయని అర్థము తీర్థమనగా పుణ్యస్థానము, స్నానఘట్టము అని అర్థము. దైవమనగా దేవుడు దైవ విగ్రహము అనిఅర్థము. వీనిని గూర్చి ప్రకటించు గ్రంథములే మహ-త్మ్య గ్రంథములు - నాగభూషణం రాంపల్లి-తిరుపతి క్షేత్రసమీక్ష; సిద్ధాంత వ్యాసం

రసభావ నిర్భరమైన భక్తి,స్వభావోక్తి,సుభాగములైన అయా క్షేత్రములకు

సంబంధించిన వర్ణనలు ఆయా క్షేత్రములలో వెలసిన దైవమహత్మ్యములు వానికి సంబధించిన ఉపాఖ్యానములు మొదలగునవి క్షేత్రమహత్మ్య గ్రంథములలో విశిష్టంగా గోచరించు అంశములు. క్షేత్ర మహాత్మ్య గ్రంథము లందు ఫల సిద్ధి వివాహితముగా నుండును. వీనిని రచించిన కవులును మహాభక్తులు. వారి భక్తి ప్రవృత్తులు, ఆత్మీయత ఈ గంథ్రములలో ప్రతిబింబితమై యుండును.

క్షేత్ర మహత్మ్యములు చాలావరకు బ్రహ్మాండ స్కాందాది పురాణముల నుండియే పుట్టినవి బాహ్య దృష్టి కవి పురాణముల వలె భాసించుచుండును కాని పురాణ ధర్మమిందు గౌణము "పురాణములు కథ కొరకు పుట్టినట్లుండును. కాని స్థల పురాణములు కవి కొరకు పుట్టినట్లుండును" డా॥ యస్.వి జోగారావు - మనస్థల పురాణములు సప్తతంతువు-సాహిత్య వ్యాసముల సంపుట.

క్షేత్ర మహత్మ్య గ్రంథములలోని ఉపాఖ్యానములు ప్రధాన కథకు పోషక ములై కథాకథన చాతుర్యముతో, శిల్ప వైదగ్ధ్య ముతో నొప్పారుచుండును ఈ ఉపాఖ్యానములు కథా శ్రవణ ప్రవణమైన జనాభిరుచిని కొంతవరకు సంరక్షించుటచే ఇవి ప్రబంధముల కంటె మిన్న యనదగు గౌరవమును బడిసినవి.

పాండురంగ, కాళహస్తి మహత్మ్యములు మొదలగునవి.

ఉదాహరణములు :-

క్షేత్ర మహత్మ్య కావ్యములు - రకములు :-

తెలుగులో క్షేత్రమహత్మ్య కావ్యములు ఎక్కువభాగము సంస్కృతము నందలి పురాణ కథలలో చెప్పబడిన వానికి కొన్ని మార్పులు చేర్పులు చేసి వ్రాయబడినవి. వీనిని శైవ మహత్మ్య కావ్యములు, వైష్ణవ మహత్మ్య

కావ్యములని స్థూలముగ విభజింపవచ్చును. అయినను శైవ,వైష్ణవ క్షేత్రముల యందు ఇతరదైవముల ప్రసక్తి (శక్తి, గణపతి, కుమారస్వామి, సూర్యుడు ఋషులు) ఉండుటయు వారికి సంబంధించిన మహత్మ్యములు వివరించబడి యుండుటయు కావనగును. ప్రతి క్షేత్రమునకు పుస్తకరూపమున కాకపోయినను స్థల, దైవ, క్షేత్రమహత్మ్యములు జనశ్రుతి యందు గలవు అట్టి క్షేత్రములు దేశమున వేల్లుగా ఉన్నందున అన్నింటికిని సాహిత్యమునందు నిలువదగినంతట కావ్యములు వెలువడలేదు వెలువడిన వన్నియు లభ్యము కాలేదు. ఉన్న క్షేత్రములలో అతి ప్రాముఖ్యమును, ప్రాచీనతను కలిగి యున్న క్షేత్రములకు మాత్రము సుప్రసిద్ధ కవులచేత రచింపబడిన మహత్మ్య కావ్యములు లభ్యమగుచున్నవి.

పాల్కురికి సోమన రచించిన "పండితారాధ్య చరిత్ర" క్షేత్రమహాత్మ్య కావ్యముగ పరిగణింపబడకున్నను, మహత్మ్య కావ్యముల లక్షణములందు పుష్కలముగా నున్నవి. పండితారాధ్య చరిత్రములో పర్వత ప్రకరణము మొత్తము శ్రీశైల క్షేత్ర మహత్మ్య నిరూపకమే అందులో శ్రీశైల క్షేత్రము మల్లికార్జున దైవము, పాతాళ గంగాది తీర్థముల వర్ణన మహిమ విస్తృతముగా వర్ణితము

ఆంధ్రభాషయందు గల కావ్యములలో ఇతిహాసము, పురాణము, కావ్యము రూపకము, ఉదాహరణము, ప్రబంధము, శతకము, కథాకావ్యము, మొదలగు ప్రక్రియలు కలవు వానిలో మహత్మ్య కావ్యములు ఒక వర్గమునకు చెందినవి. ఇవి పురాణేతిహాసములలోని క్షేత్ర, తీర్థ, దైవ మహాత్మ్యములను గూర్చి వివరించునవిగా నున్నవి వీనిని స్థల పురాణములనుటయు గలదు. ఇట్టి కావ్యములలో కొన్ని కేవలము క్షేత్రమునకు సంబంధించిన విషయములను మాత్రము తెలుపునవై యుండగ, కొన్ని రచనా పాటవము కలిగి వర్ణనలు, అలంకారములు కథానుగుణముగ సంతరింపబడి కావ్య

లక్షణములను కూడ కలిగియున్నవి నారాయణా చల మహాత్మ్యము, వల్లి భాభ్యుదయము, ఘటికాచల మహాత్మ్యము, యదుశైల మహాత్మ్యము క్షేత్ర మహాత్మ్యములను వివరించుచుండగ పాండురంగ మహాత్మ్యము, ప్రబంధ రాజ వెంకటేశ్వర విజయవిలాసము, వేంకటాచల మహాత్మ్యము, కాళహస్తి మహాత్మ్యము, కాశీఖండము భీమఖండము మొదలైనవి, కావ్యలక్షణ లక్షితములై యొప్పుచున్నవి.

మహాత్మ్య కావ్యములలోని కథా భాగమును అనుసరించి శైవ మహాత్మ్యములుగాను, వైష్ణవ మహాత్మ్యములుగాను, వ్యవహార సౌలభ్యము నకు పండితులు విభజించిరి. వీనికి మూలసూత్రము మోక్షమైనను మత భేదముల కారణముగ ఆయా కాలములందలి దైవభేదము ననుసరించి ఇవి శైవ మహాత్మ్య కావ్యములుగను, వైష్ణవ మహాత్మ్య కావ్యములుగాను పేర్కొనబడినవి

ఈ క్రింది విధముగా ఆయా క్షేత్ర మహాత్మ్య కావ్యాలలోని ప్రాము ఖ్యతను విశదముగా తెలుసుకొనవచ్చు

నన్నయతో మొదలయిన తెలుగు ప్రాచీన కావ్యములలో ఆంధ్రదేశ ప్రశక్తి కొన్నిటిలో సంక్షిప్తముగను, కొన్నిటిలో అతి విస్తృతముగను కలదు నన్నయ తన భారతములో అమూలకమైన రాజమహేంద్రపుర ప్రస్తావన యుండుట విశేషము తెలుగు కవులు భారతదేశమునందు గల క్షేత్ర మహాత్మ్యముల వర్ణన సవిస్తారముగచేసి యున్నారు. ఆయా మతాను సారులైన రాజుల ప్రోత్సాహము వలనను, కవుల మతాభినివేశము వలననూ తెలుగులో తామర తంపరగా క్షేత్ర మహాత్మ్య కావ్యములు వెలసినవి. అహోబల క్షేత్రముగా తెలుగులో మొదటి క్షేత్ర మహాత్మ్య కావ్యముగా పరిగణింప బడుచున్నది. ఎఱ్ఱన 'నృసింహ పురాణము' ప్రాచీనాంధ్ర సాహిత్యములో వేంకటేశ్వర ప్రసక్తిని పేర్కొన్న కవులలో ఈతడే మొదటివాడు.

నృసింహ పురాణ క్షేత్ర మహత్మ్యమైన అహోబలము నూట ఎనిమిది దివ్య తిరుపతిలలో ఒకటి. నూటఎనిమిది దివ్య తిరుపతులలో ఆంధ్రదేశములో వెలసినవి రెండే రెండు 1. తిరుపతి - తిరుమల, 2 అహోబలము. ఈ అహోబలమునకు తమిళంలొ 'శిఙ్గవేలుకున్ఱమ్' అని పేరు. 'తిరుమంగైయాళ్వార్' అహోబలస్వామిని కీర్తించినాడు నూటఎనిమిది తిరుపతుల వైభవము.

అహోబల దేవాలయాలలో లభించు శాసనాధారమును బట్టి ఈ ఆలయాలు రెడ్డిరాజులు కాలమున ప్రసిద్ధి కెక్కినవిగా తెలియచున్నది.
—శ్రీ మార్కండేయ నాగాబట్ల - మనదేవాలయాలు - సప్తగిరి - జూలై 1984

నృసింహ పురాణమనెడు పేరు లోకమిచ్చినదే కాని కవి పెట్టినది కాదు. ఇందు పురాణ లక్షణములు ఏమియు లేవు. నృసింహావతారంబును పురాణకథ నామము బ్రహ్మండాది అనేక పురాణములలో ఉన్నది. కాని బ్రహ్మండాది పురాణకథను ఎర్రన ప్రధానముగ గైకొనెను.

ఈ గ్రంథము చివరలో అహోబల క్షేత్రము యొక్క మహత్మ్యము కొంత చెప్పబడినది. దీనిని బట్టి యిది పాండురంగ, కాళహస్తీశ్వర మహత్మ్యముల వలె క్షేత్ర మహత్మ్యమనబడినను, రసపోషణ వస్త్వైక్యము, కార్యకారణ నిబద్ధత, అష్టాదశ వర్ణనలు మొదలగు వాటిని పరిశీలించినపుడు యిందులో ప్రబంధ లక్షణములు కూడ కన్పించును.

మహత్మ్య ప్రక్రియకు గ్రంథ నామమును బట్టియే గుర్తించునట్లు సంపూర్ణాకృతి కల్పించు ప్రయత్నము చేసినది శ్రీనాథుడు. శ్రీనాథుడు రచించిన శివరాత్రి మహత్మ్యమేకాక భీమేశ్వర పురాణము, కాశీఖండము కూడా క్షేత్ర మహత్మ్యములగా చెప్పవచ్చు.

శివరాత్రి మహత్మ్యమను క్షేత్ర పురాణమును శ్రీనాథుడు ప్రాయము కై వ్రాలిన పిమ్మట క్రీ శ. 1440 ప్రాంతమందు రచించినట్లు తెలియును. దీనికే 'సుకుమార చరిత్ర' మని నామాంతరము కలదు. ఈ క్షేత్ర మహత్మ్య మును ముమ్మడి శాంతయ్యకు అంకితమియ్యబడినది. ఇందలి అవతారిక అతి పేలవమై దోష భూయిష్ఠమై అప్రౌఢ కవితతో ఉన్నది. ఈక్షేత్ర మహత్మ్యమునకు మూలము స్కాంద పురాణాంతర్గతమగు ఈశానసంహిత ఈ కథకు నాయకుడు సుకుమారుడను ఒక బ్రాహ్మణ యువకుడు అతడు పచ్చి కాముకుడై కన్న బిడ్డలతో కూడ కానిపనులు చేసి పరమ భ్రష్టుడైనను శివరాత్రి దర్శనము వలన శివైక్యము చేరుకొనినట్లు యిందు చిత్రింపబడెను

ఆంధ్రావళి మోదం బొరయ నన్నయ భట్టారకుని ఆంధ్ర భారత మవతరించినది. అట్టి వేడుకయే యన్నమంత్రి కుదయించినాడు. ఈ భీమేశ్వర పురాణము రాజమహేంద్ర వరమున రెండవ యాంధ్ర పురాణ గ్రంథముగా ఆవిర్భవించినది.

" నాకు గృపసేయుము మొక ప్రబంధంబు నీవు
కవిత గుణగణ్య శ్రీనాథ కవివరేణ్య "

శ్రీనాథుడీ పలుకులు పలికించినది భీమేశ్వర పురాణ కృతిభర్తయైన బెండపూడి అన్నామాత్యుని నోట. భీమేశ్వర పురాణ ప్రారంభమున సుకవి బృందమునకు, గై మో డ్పు లి డి కుకవి నిరాకరణము గావించి యొక ప్రౌఢోక్తినిటు విసరినాడు.

" ప్రౌఢి బరికింప సంస్కృత భాషయండ్రు
పలుకు నుడికారమున నాంధ్ర భాషయందు
రెవ్వరేమన్న నందుగా కేమి కొఱత
నా కవిత్వంబు నిజము కర్ణాట భాష"

— భీమేశ్వర పురాణము - 1.15

"శ్రీనాథుని కాశీఖండమిట్టి నానుడికి గురికాదగినంత కఠినశైలిలో లేదనుట నిక్కవము" అని బండారు తిమ్మయ్యగారు తెలిపినారు.

పెద్దన మనుచరిత్రతోను, తిమ్మన పారిజాతాపహరణముతోను ఇంచు మించు సమాన వయస్సుగలది ధూర్జటి కవికృత "కాళహస్తి మహత్మ్యము

ఈ గ్రంథము శివ పారమ్యమును బోధించు క్షేత్రమే అయినను అందు ఆ మహాకవి నానాశాస్త్ర పరిజ్ఞానముతో పాటు పాత్రనిర్మాణ కౌశల మును కూడ చూపియున్నాడు. ఈ గ్రంథములోని నాలుగు ఆశ్వాసములలో తిన్నని కథ, వేశ్యకన్యా వృత్తాంతము అతిలోక రమణీయములై యున్నవి కవికి గల లోకవృత్త పరిజ్ఞానము ఇందే సువ్యక్తమైనది.

కవి మహానగర వాసియయ్యు మహాటవీ మధ్యగతులైన కిరాతజనుల జీవితములను భావన చేతనే కాక ప్రత్యక్షముగా కూడ చూచి, తాను చూచిన దానిని చూచినట్లుగా చిత్రించినాడు.

ధూర్జటి నిర్మించిన పాత్రములలో తిన్నని పాత్ర అగ్రగణ్యమని చెప్పవచ్చును. పుట్టుకచే ఆటవికుడయ్యు తిన్నడు వీర మాహేశ్వరులలో ఉత్తముడుగా పరిగణింపదగినవాడు. శివభక్తి యాతనికాజన్మ సిద్ధము. తిన్ననికి కులాచారాను గుణముగ విలువిద్య యబ్బినది. తిన్ననికి స్వప్న మున సదాశివుడు సాక్షాత్కరించి మొగలేటదరి గొండవండ శిలాతట మూలమున శివలింగము కలదనిచెప్పి యంతర్ధానమైనాడు. తిన్నడుమేల్కొని నంతనే అచ్చోట దివ్యలింగమును గాంచినపుడు అతని సంతోషాతిశయము ను తన్మయత్వమును ఈ క్రింది విధంగా వర్ణించాడు

"కాంచి రోమాంచికంబు కోదండచి తాంగుడగుచు నానంద బాష్పంబు లతిశయిల్ల నమ్మహాలింగమునకు సాష్టాంగ నతులు సేసి ముకుళితహస్తుడై

సంస్కృతభాషా ప్రౌఢిమ, తెలుగు పలుకు నుడికారపు తేనియు జత గూడక వినువారి చెవులలో కవితా ఝుళం ఝుళీనాదములు మార్మోగునట్లు కవిత చెప్పగల దిట్ట శ్రీనాధుడు. శ్రీనాథుని రచన లన్నిటికిని సంస్కృత మున నేదియో యొక గ్రంథము మూలమగుచునే యున్నది ఈ కావ్య మునకు మూలము స్కాంద పురాణాంతర్గతమైన గోదావరి ఖండము. ఈ కావ్యమును ప్రౌఢ నిర్భర వయః పరిపాకమున రచించినట్లు కాశీఖండ ప్రారంభంలో చెప్పుకొన్నాడు

ఈ భీమేశ్వర పురాణమందలి కథావస్తువు కేవలము భీమమండలము నందలి తీర్థ, క్షేత్ర మహత్మ్యము నుగ్గడించునది. పరమేశ్వర భక్తిభావా విష్టచిత్తులకది కొంత యుత్సుకత సంపాదించునది యైనను కావ్య రసా స్వాదలోలుపుల కది యంత తృప్తిని గొలుపునది కాజాలదు ఈ రచనలో భీమ మండలమున కంతటికి ఒక భౌ గో ళి క రేఖా చిత్రమును తీర్చి దిద్దినాడు. మూలములో నుండి విసుగు జనించెడి వర్ణన విషయములను సంక్షేపించుచు, సంక్షిప్తములైన వానిని కొంత కొంత విపులీకరించుచు ఈ క్షేత్ర మహత్మ్యమునకు ప్రబంధ ముద్ర నతికించి పెట్టినాడు.

శ్రీనాథుడు " ప్రాయమింతకు మిగుల గైవ్రాల కుండ " రచించిన ప్రౌఢకావ్యము కాశీ ఖండము. స్కాంద పురాణాంతర్గత మగు కాశీ ఖండ మునకిది అనువాదము కాశీఖండములో వింధ్య ప ర్వ త విజృంభణము అగస్త్యుడు కాశిని బాయుట, అగస్త్యుని దక్షిణాపథ తీర్థసేవనము, కుమా రస్వామి కాశీ మహత్మ్యమును వర్ణించుట, వ్యాసుడు కాశిని బాయుట మొదలైనవి ప్రధానవిషయములు కావ్య సౌందర్యమునేకాక మానవ జీవిత కర్తవ్యత అవశ్యకమైన వివేక విస్తరమంతయు కాశీఖండమున చూడవచ్చు

" కాశీఖండ వయః పిండమ్ " అను అభాణకము తెలుగు కాశీ ఖండమునుబట్టి యేర్పడినదని నిడుదవోలు వేంకటరావుగారి అభిప్రాయము

చేరబోయి" అని వర్ణించినాడు.

పరమేశ్వరుని కంట నెత్తురు కారుచుండగా తిన్నడు చూచి సహింప లేకపోయినాడు "కంటికింక గంటికంటె పెందుగలదె ముక్కంటికి" నని యనుకొని తనగ్రుడ్డు పెకిలించి యాలింగము కంటికి తగిలించినాడు. కానీ పరమేశ్వరునిపరీక్ష యింతను ముగియులేదు. రెండవకంట కూడా గీలాలము దొఱగుచున్నది. అట్లయిన రెండవకన్ను నిచ్చెదనని తిన్నడు స్థిర నిశ్చయుడు కాగా హరుడానంద పరవశుడై తిన్నని తీవ్రతకన్ను మున్నుగ నయ్యాశుగ మును చేతబట్టి నిలునిలుమను నెలుంగు సెలంగ మ్రోల సాక్షాత్కరించి నాడు.

ఈ క్షేత్ర మహాత్మ్యమును చదివి చూడవలయునే గాని యిట్టిదని చెప్పనలవిగాదు. ఆంధ్ర ప్రబంధ వాఙ్మయమున నిట్టి నిర్మాణ మదృష్ట పూర్వమనియే చెప్పవచ్చును. పాత్రోచితములైన భావములును, భావమున కుచితమైన భాష యు నిందు పొందు పఱుపబడియున్నది.

క్షేత్ర మహాత్మ్యమునే రాసినను ప్రబంధ కవులలో ఒక్కనిగా పేర్కొన దగ్గవాడు తెనాలి రామకృష్ణుడు. ఈతని పాత్ర నిర్మాణ చాతుర్య మును కథా కథన కౌశలము, రసపోషణ సామర్థ్యమును తెలుసుకొనవలె నన్నచో పాండురంగ మహాత్మ్యమునందలి నిగమశర్మోపాఖ్యానము పేర్కొన దగినది. గుణనిధ్యాదులు నిగమశర్మ కంటెను ప్రాచీనులు కొందరుగలరు కాని నిగమశర్మ యక్క ను పోలినవారు ఆంధ్ర వాఙ్మయముననే లేరనిన అతిశయోక్తి కాదు. నిగమశర్మ అక్కయని యీమెను పేర్కొనవలెనే కాని యీమె పేరేమియో కవి తెలుపలేదు. తీర్చిదిద్దిన యీతని శిల్పచాతుర్య మంతయు ఈరెండు పాత్రల యందు కేంద్రీకరింప బడియున్నది.

పాండురంగ మహాత్మ్యము క్షేత్ర మహాత్మ్యమగుటచే నిందు తెనాలి రామకృష్ణుడు తనపాత్ర నిర్మాణ కౌశలమును పరిపూర్ణముగా ప్రదర్శించుట

కవకాశము లేకపోయినది ఇది మ హ రా ష్ట్ర దేశమున చంద్ర భాగనదీ తీరమున వెలసిన దివ్యక్షేత్రము. ఇందలి క్షేత్ర,తీర్థ, దైవములు మూడును సమాన మహిమ కలిగినవియు ఇది భూలోకమున సాటిలేని క్షేత్రమనియు చెప్పబడినది. ఇందు పుండరీకుడను బ్రాహ్మణుడు తల్లిదండ్రులకు సేవ చేయుచు తపస్సుచేయుట బాలగోపాల రూపమున శ్రీకృష్ణుడు ప్రత్యక్ష మగుట, ఆ క్షేత్ర తీర్థ, దైవములు పుండరీకునిపేరుతో ప్రసిద్ధి గాంచునని వరమిచ్చుట చెప్పబడినది. ఈ క్షేత్ర మహాత్మ్య కావ్యమున అనేక యితర దైవములు తీర్థములు గలవు ఇచ్చట తీర్థములన్నియు మహిమోపేతము లని, పాపనాశకములని, మోక్షప్రదములని ఈ కావ్యమున వర్ణింపబడెను

తరికొండ వేంకమాంబ రచించిన శ్రీ వేంకటాచల మహాత్మ్యము వైష్ణవ క్షేత్రములలో పేరెన్నిక గన్నది. భూలోక వైకుంఠమన దగునది తిరుమల క్షేత్రము శ్రీమన్నారాయణుడు కలియుగమున జనులను కాపాడుటకు శ్రీ వేంకటేశ్వరస్వామిగా అవతరించినట్లు చెప్పబడు క్షేత్రము. వేంకటే శ్వరుని వంటి దైవమును, వేంకటాచలము వంటి క్షేత్రమును బ్రహ్మాండ మున లేవని ప్రసిద్ధి గాంచినది.

లక్ష్మి వైకుంఠమును వీడి భూలోకమును చేరుట బ్రహ్మ,శివులు ఆవు దూడలై శివుని సేవించుట, పద్మావతీ, శ్రీనివాసులు కళ్యాణము, స్వామి వరాహస్వామివద్ద భూమి తీసుకొనుట, కుబేరుని వద్ద అప్పుచేయుట, అప్పు తీర్చుటకై భక్తులనుండి వారి కర్మరూపమగు వడ్డీని తీసుకొనుట వర్ణింప బడినది.

ఈ క్షేత్ర దర్శనమునను, స్మరణమునను మహాపుణ్య మొనగూడునని కలికల్మష నాశమగునని, కర్మవ్యాధులు నశించి అభీష్ట స్థలము లబ్బునని ఈ క్షేత్రము నందలి యుత్సవ కాలమున స్వామిని సేవించిన విశేష ఫల మబ్బునని వర్ణించబడినది.

క్షేత్ర మహత్మ్య కావ్యములలో పేర్కొన దగినది తెనాలి రామకృష్ణ కవి రచించిన శ్రీ ఘటికాచల మహత్మ్యము. మహాప్రసిద్ధమైన యోగ వర సింహస్వామి దివ్య క్షేత్రము ఘటికాచలము. శ్రీ మహావిష్ణువునకు ప్రీతి కరమైన మూడు స్థలములలో రెండవది ఘటికాద్రి మొదటిది నారాయణ గిరి. మూడవది వృషభాద్రి.

సీ॥ దివ్య మౌనీంద్రు తీర్థంబులో గ్రుంకి
ధన్యులైకడు మహత్త్వంబు గనిరి
ఎవ్వరు మద్భక్తులిందు మజ్జనమాడ
నపవర్గ సంప్రాప్తి కర్హులగుదు

రాదిమాశ్రమము నారాయణగిరి నాకు
నల రెండవది ఘటికాచలంబు
వృషభాద్రి మూడవ దీమూడు నెలవుల
నశ్రాంతమును నేను విశ్రమింతు.

ననిన దద్దేవ దేవు పాదాంబు జముల
కమ్మునీంద్రులు సాష్టాంగ మాచరించి
విన్నవము గల దొక్కటే వేదవేద్య
కృపవదలిర్పంగ నది చిత్తగింపవలయు.

— ఘటికాచల మహత్మ్యము 3-24

ఘటికాచల క్షేత్రము నేటిఉత్తర ఆర్కాడు జిల్లా వాలాజా తాలూకాలోని చోళలింగపురము (షోలింగపురము, షోళింగర్, Sholinghur) అను స్థలము చోళసింహపురమని ఇటీవల ఇచ్చట వైష్ణవులందరుకాని యది యప్రసిద్ధ నామకరము. ఈ షోలింగర్ అరకోణం రైల్వేస్టేషన్‌కు పడమర 18 మైళ్ళ దూరమున నున్నది. ఇది చిత్తూరుకు

తూర్పున 25 మైళ్ళ దూరమున నున్నది. ఈ షోళింగరునకు దక్షిణమున 1½ మైలు దూరమున నున్న కొండకు ఘటికా చలమని పేరు. అందు పెద్దకొండ, చిన్నకొండ అను రెండు కొండలు పడమర, తూర్పు దిక్కులం దొకదానికొకటి యభిముఖముగా నున్నవి. పెద్దకొండయందు యోగలక్ష్మీ నరసింహస్వామియు, చిన్నకొండ యందు చతుర్భుజ శంఖ చక్రములతో యోగాంజనేయ స్వామియు వెలయుచున్నారు. ఈ రెండు దైవములును యోగరూఢులై శాంతివిగ్రహులైన భక్తజన సమస్తవాంఛా ప్రదులై భాసిల్లు చున్నారు ఈ కొండలకు మెట్లున్నవి. మెట్లు కట్టించినది రాయోజి అను నతడు. కొండ క్రింద కొండపాళెమను చిన్నగ్రామము కలదు ఇయ్యది గొప్ప సేవాస్థలము సప్తర్షి ప్రముఖులు ఈ క్షేత్రమున వసించిరని, సప్తర్షులను సనకసనంద నాదులను అనుగ్రహించుటకు నరసింహస్వామి యందు ప్రత్యక్షమయ్యెనని దీని మాహాత్మ్యము తెలుపుచున్నది. ఇందనేక తీర్థరాజములు కలవు. రెండవ మైసూరు యుద్ధము (27 సెప్టెంబరు, 1781) షోళింగరులో జరిగిన కాలమున పై కొండలలోని యుత్సవమూర్తిని షోళింగరు దేవాలయమున స్థాపించిరట నాటినుండి షోళింగరు, ఘటికాచలము లొక్కటైనవి నేడు ఘటికాచల దేవస్థాన కార్యాలయాదులు షోళింగరు దేవాలయముననే యున్నవి.

సంస్కృత ఘటికా శబ్దమే తమిళమున 'కడిగై' అనియైనది అందు దాని యర్థమును విలక్షణముగా నున్నది. ఇరువది నాలుగు నిముషముల కాలమును అర్థముతోపాటు వేదము అని అర్థమున్నది. మరియు కేవలము బ్రాహ్మణులు నివసించు పేట కడిగై మరియు బ్రాహ్మణ గురువులు బ్రాహ్మణ శిష్యులకు మత తాత్త్విక శాస్త్రాది విద్యలను బోధించు ప్రదేశమునకు 'కడిగై' అని పేరు గ్రంథ గౌరవ నిర్ణయ సమర్థమైన విద్యత్పరిషత్తునకు 'కడిగై' అని పేరున్నది

ఘటికాచలము నూట ఎనిమిది దివ్య తిరుపతులలో ఒకటి ఈ మహత్మ్య గ్రంథమున రామకృష్ణుడు 'కడిగై' విషయమెత్తలేదు.

ఘటికాచల మహత్మ్యమున కథావస్తువు విస్తారముగ లేదు. అన్ని వర్ణనలు అవసరమైనంత విస్తారముగ కూడలేవు. మరియు ఈ ఘటికాచల మహత్మ్యమున నాయకుడు లేడు. ఉన్నచో ఆయన శ్రీ నరసింహస్వామియే కావలయును. ఆయన గ్రంథాంతమున గాని అసలు కనిపించడు. అందువలన మహత్మ్య నిరూపణమునకు ఏర్పాటు చేసుకొను కథయందే ఈ వర్ణనావకాశమును రామకృష్ణుడు చూచుకొనవలసి వచ్చినది. అష్టాదశ వర్ణన వైభవమే గాక భగవద్భక్తి వైభవ, వర్ణనవైభవ మీ గ్రంథమున మిక్కుటముగా నున్నది.

ఘటికాచల మహత్మ్యమున వైష్ణవము కొంత ముదిరిన సూచనలున్నవి. శ్రీ వైష్ణవుల మతము గ్రంథము కొంతయున్నదనియు" పాండురంగ మహత్మ్యములోనిది ఇంకను శిథిలమైన వైష్ణవము" అని శ్రీ మాన్ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ గారు చెప్పియున్నారు. - తెలుగు విజ్ఞాన సర్వస్వం - మూడవ సంపుటం - పుట 564

ఘటికాచల మహత్మ్యమున శ్రీ వైష్ణవ ధర్మ పారదృశ్య దనర్చువాడు గోవిందశర్మ ఇతడు పాండురంగ మహత్మ్యము నందలి పుండరీకుని వంటివాడు పుండరీకునికి వలెనే గోవిందశర్మకును భార్య అప్రతీపమతి. పుండరీకుని భార్య పేరు తెలియరాలేదు. గోవిందశర్మ భార్యపేరు భద్రాంగి.

నారదుడు తాను నూట ఎనిమిది తిరుపతులను చూచితినని వానిని పేర్కొనెను. ఈ తిరుపతులన్నియు వైష్ణవ క్షేత్రములు శ్రీ వైష్ణవుల కవి ముఖ్యమైన యాత్రాస్థలములు అవన్నియు ఎక్కువ భాగము తమిళ దేశముననే యున్నవి. అందుకనియే రామకృష్ణుడు ఆయా తిరుపతులను

వాటి వాటి తమిళనామముల తోడనే పేర్కొనినాడు. అందలి దైవతములను కూడా ఒకటి రెండు చోట్ల తమిళనామముల నుంచియే చెప్పినాడు శ్రీవైష్ణవుల నిత్య వ్యవహారములోని తమిళ శబ్దములను అట్లే తెలుగున ప్రయోగించినాడు. పాండురంగ మహాత్మ్యమునకు ఈ తమిళ శబ్ద పయోగములు అక్కరలేదు. ఘటికాచల మహాత్మ్యమున కున్నది, అందువలన ఇందలి వైష్ణవము కొంత ముదిరినట్లు కనిపించును.

మహాత్మ్యము అనునది పూర్తిగా పురాణేతిహాసములలోని మహాత్మ్య వృత్తాంతముల నాధారము చేసుకొని తెనుగున ఒక స్వతంత్ర కావ్యప్రక్రియగా అవతరించినది. ఎర్రన కృతమైన నృసింహ పురాణము తెనుగులోని మొదటి మహాత్మ్య గ్రంథ మననంతగా వీలుకానప్పటికి తచ్ఛాయాన్వయిని అని మాత్రము చెప్పవచ్చును. మహాత్మ్య ప్రక్రియను గ్రంథ నామమును బట్టియే గుర్తించునట్లు సంపూర్ణాకృతి కల్పించు ప్రయత్నము చేసినది శ్రీనాథుడు. శివరాత్రి మహాత్మ్యమే కాక భీమఖండము, కాశీఖండములను మహాత్మ్యలనియే చెప్పవగియున్నవి. ఈ మహాత్మ్య ప్రక్రియను తరువాత నెమ్మదిగా శ్రీ రంగ మహాత్మ్యమును వ్రాసి భైరవుడు, శ్రీ కాళహస్తీశ్వర మహాత్మ్యమును వ్రాసి ధూర్జటి, పాండురంగ, ఘటికాచల మహాత్మ్యములను వ్రాసి తెనాలి రామకృష్ణుడు క్రమముగా పుష్టివర్ధనము చేసినారు. ఆ పిమ్మట వారికి ఈ ప్రక్రియా రచనావిధానము కొట్టిన ఆంధ్ర వాఙ్మయమున అనేక మహాత్మ్య గ్రంథములు వెలసినవి.

మహాత్మ్య గ్రంథములందు వస్తు వైవిధ్యం కలదు. ముఖ్యంగా స్థల దైవ, తీర్థ మహాత్మ్యములు వ్యస్తముగా కాని, కలగా పులగముగా కాని ఈ ప్రక్రియకు అతివృత్తము లగుచుండును. ఇవికాక మరియు అనేకము లు మహాత్మ్యములు కలవియు ఇతి వృత్తములగును. అనగా పురాణ ప్రసిద్ధములైన మంత్ర మహాత్మ్యములు - మాస మహాత్మ్యములు - వారమహాత్మ్యములు - పర్వదిన మహాత్మ్యములు - భగవద్వస్తు మహాత్మ్యములు - భగ

వద్భక్తజన మహత్మ్యములు మొదలైన వన్నియు ఈ ప్రక్రియకు కథావస్తువే శ్రీనాధుని శివరాత్రి మహాత్మ్యము పర్వదిన మహత్మ్యము. కార్తీక, మాఘ మహత్మ్యములు మాస మహత్మ్యములు, సోమవార మహత్మ్యము వార మహత్మ్యము, ఉద్భటారాధ్య చరిత్రము భగవద్వస్తు మహత్మ్యము. స్థల, దైవ, తీర్థ మహత్మ్యములు మూడును గలది పాండురంగ మహత్మ్యము. రామకృష్ణుని చేతిలో ఈప్రక్రియ. చేరవలసిన స్థాయికిచేరినది. ఘటికాచల మహత్మ్యము స్థలమహత్మ్యం ఈ విధంగా ఈ మహత్మ్యప్రక్రియ వస్తు బాహుళ్యము చేత విరివిగా కన్పించుచున్నది వస్తు బాహుళ్య మింతయున్నను, స్థల, దైవ, తీర్థ మహాత్మ్యములే ఎక్కువగా కావ్య వస్తు యోగ్యతకలవి

మహత్మ్య ప్రక్రియకు సూత్రాత్మయగు భావము. అయా స్థలములు అయా తీర్థములు అత్యంత మోక్షప్రదములనియు, ఆయా దైవతములు భక్త సులభములనియు ఈ ప్రధాన భావము. అనేక కథల చేత ప్రపంచించి చూపుటలో గ్రంథ విస్తృతి పెరుగును. ఈ ప్రక్రియ యొక్క పరమ ప్రయోజనము మోక్షమునకు సులభ మార్గముగా భగవద్భక్తిని ఆకర్షవంతముగా చూపి ప్రచారము చేయుటయే. ఇందులో కవి ఎంత కవితాశక్తి చూపినను అది భగవద్భక్తికి లొంగియుండవలయునే కాని అతిశయించరాదు.

కమ్మర్షియల్ అర్ట్‌లో అర్ట్‌కు ఎంత ప్రాధాన్యమో మహత్మ్య కావ్యములలో కావ్యత్వమున కంతమాత్రమే ఉండును. కమర్షియల్ ఆర్ట్ ఆర్ట్‌అయినట్లే ఈ మహాత్మ్యగ్రంథములను, ప్రబంధములు కావ్యములు అగుచున్నవి. ప్రక్రియా రచనకు భక్త్యావేమే ప్రధాన కారణం. భక్తిశివ, విష్ణు భేదము చేత స్థూలముగా రెండు విధాలుగా ఉన్నందున మహాత్మ్యములలో శివ మహత్మ్యములు కొన్ని, విష్ణు మహాత్మ్యములు కొన్ని ఇందు వైష్ణవ మహత్మ్యములే ఎక్కువ శ్రీ మహవిష్ణువునకున్న అవతార వైశిష్ట్యము శివునకులేకపోవుట అందుకు ఒక కారణము. కావచ్చును గ్రంథమే మహత్మ్యమును

చెప్పునది యైనను అందలి కథలన్నియును ఆయా మహాత్మ్య విషయ నిరూపణముల యందు పర్యవసానము కలవి కావలయును. నదీ నదములు సముద్రమునకు ఎక్కినట్లు మహాత్మ్య గ్రంథముల యందలి కథలు అన్నియును ఆయా దైవతముల, యొక్కయో, తీర్థముల యొక్కయో, స్థలముల యొక్కయో మహాత్మ్యమును ప్రకటించి సార్థకము కావలెను.

# 2

# ప్రాచీన అర్వాచీన సాహిత్యాలలో విఘ్నేశ్వరుని కథ - విలక్షణ.



అంబరము అనగా వాస్త్రము, ఆకాశము అని అర్థములు కలవు శుక్లాం బరదము అనగా తెల్లని ఆకాశము. అనగా దానిని ధరించినవాడు. ఆకాశమునకు వర్ణము లేదు. కాని విష్ణ్వీశ్వరుడు శుక్లాం బరధరుడు. తెల్లని ఆకాశమును ధరించిన వాడని అర్థము. ఆకాశమునకు వర్ణము లేదు కదా! కనిపించు వల్లధనము న ల్ల ద న ము కాదు కదా ! లేవి తెల్లదన మొకటి వచ్చినది.

మన శాస్త్రములలో సత్త్వ, రజ, స్తమో గుణములవి మూడున్నవి. సత్త్వగుణము తెలుపు రజోగుణము ఎఱుపు తమోగుణము నలుపు.

ఆకాశమనగా అవకాశము. ఇది పంచ భూతములలో ఒకటి ఇది లేకుండా ఏ రెండు భూతములకు సంయోగము లేదు. ఒక భూతములో నున్న రేణువుల మధ్యకూడ ఆకాశముండుచు. ఈ ఆకాశమునందు జగవచ్ఛక్తి అభివ్యాప్తమై యుండును.

సత్త్వగుణము చేత అభివ్యాప్తమై యున్న ఆకాశమును ధరించిన వాడని అర్థము.

విష్ణువు-సర్వవ్యాపి. శశివర్ణుడు-శశియనగా చంద్రుడు. శశమును ధరించినవాడు. శశమనగా కుందేలు, చంద్రునిలో నున్నమచ్చ కుందేలని అల్లబుల్లి కథ. శశమనగా దాట్లు పెట్టుచు పోవుచున్నది యని యర్థము అందుచేతనే చంద్రుని శశియన్నారు. అతడు శుక్ల, కృష్ణ పక్షములను చేయును. సూర్యునివలె నిత్యజ్యోతిస్సు కాదు అందుచేత నతడు శశి. ఈ విష్ణ్వీశ్వరుడు అజాతి కలవాడు అనగా కాల స్వరూపుడు.

కాలము రెండు విధములు. ఖండకాలము, అఖండకాలము, ఖండ కాలమనగా దిన, పక్ష, మాస సంవత్సరాత్మకమైనది. అఖండ కాలమనగా సూర్య, చంద్ర గ్రహ చారములు లేనిచోట నుండునది.

ఈ విఘ్నేశ్వరుడు ఖండకాల స్వరూపుడని అర్థము. అనగా లోకమును పాలించెడి వాడని అర్థము ఈ కాలమునందు బ్రతుకుచు ఈ కాలమున కధీనమై యున్న మనము ఖండకాలమును పాలించెడి యొక తత్త్వమును నిర్మించుకొని దానికి విఘ్నేశ్వర రూపము నిచ్చినాము.

చతుర్భుజం - చతుర్భుజుడు - నాలుగు భుజములు కలవాడు భుజమనగా ఒక అర్థము భోజనము చేయునది. రెండవ అర్థము పాలించునది. నాలుగు భుజములతో విఘ్నేశ్వరుడు భుజించును. అనగా నాలుగు భుజములతో కాలమును భుజించును అనగా ఖండకాలమును అఖండ కాలముగా మార్చుచున్నమాట.

పాలించుట అను అర్థములో నాలుగు విషయములను పాలించు నన్నమాట......కాలమును నాలుగు చేతులతో భుజించుచున్నాడు కదా ! నాలుగు యుగములుగా తనలో లయింప చేసుకొనుచున్నాడని అర్థము.

ఇంత పూజ దేనికి ? సర్వ విఘ్నోపశాంతి కొరకు విఘ్నములు ఉపశమించుట కొరకు ఉపశమించుమనే గాని నశించవు. అతనిని ధ్యానించినచో ఉపశమించును" —సాహిత్య సురభి పుటలు 3-4

శ్రీ విశ్వనాథ వారిపై వివరణ గణేశ తత్త్వమును విశదీకరించుచున్నది. ఇది విఘ్నేశ్వరుని ప్రప్రథమ స్వరూపము ఈ నాడు మనము ఆరాధించు రూపము దీనికి భిన్నమైనది. అనంతర కాలమున కల్పింపబడినది. గణపతి జననమునకు సంబంధించిన కల్పన లనేకములు. ఆ వివరములు తెలుసు కొనుటకు ముందుగ ఒక విషయమును గమనించ వలెను

ప్రముఖముగ వినాయకుడు పార్వతీ పరమేశ్వరుల కుమారుడగ చెప్పబడినాడు. కాని ఇతడు పార్వతీ పరమేశ్వరులలో ఏ ఒక్కరి చేతనో సృజింపబడినట్లు తెలియుచున్నది. కాని వారిరువురి సంయోగము వలన

సంభవించిన వాడుగా కనబడుట లేదు. పార్వతీ పరమేశ్వరులు నూఱు దివ్య సంవత్సరములు రమించినను సంతానము కలుగలేదు. వారికి సంతానము కలిగిన ఆ భూతము నెవరు సహింపగలరని బ్రహ్మాదులు భయపడి పరమేశ్వరుని ప్రార్థించి యిట్లనిరి "దేవ దేవ ! నీ తేజస్సున పుట్టినపుత్రుని లోకములు భరించలేవు. కనుక నీవు దేవితో గూడి లోకకళ్యాణార్థము తపమాచరింపుము" అంత పరమేశ్వరుడు దేవతలతో " మంచిది " అని చెప్పి అప్పుడు తన స్థానమునుండి జారిన ఉత్తమగు నా తేజము నెవరు ధరించ గలరని ప్రశ్నించెను. దేవతలు భూదేవి ధరించ గలదనిరి. శివుడు భూమిపై విడిన తేజమునవాయువుతోగూడి ప్రవేశించుమని దేవతలు అగ్నినిప్రార్థించిరి ఆ తేజస్సు అగ్నిచే వ్యాపింపబడి శ్వేత పర్వతమై పిదప తెల్లతోపుగా మారినది. అందు కుమారస్వామి జనించెను అనంతరము దేవతలు పార్వతీ పరమేశ్వరులను పూజించిరి పార్వతి క్రోధ సంరక్తలోచనయై " పుత్రుని కొరకు జరుగుచున్న సంగమము మీ వలన నివారింపబడినది కనుక మీ భార్యల యందు మీకు సంతానము కలుగకుండుగాక " అని దేవతలను శపించినది అప్పటినుండి దేవతలు నిస్సంతులైరి — రామాయణము

బాల సర్గ 36

దేవతల సంతతిగా చెప్పబడు వారు కేవలము వారి మానసపుత్రులో లేక మానవులకు తెలియని రహస్య పద్ధతిలొ కలిగిన వారో అని శ్రీ. పి. థామస్‌గారు వ్రాసిరి. -Epics myths and legends of India P44

అందుచే పార్వతీ పరమేశ్వరులను విఘ్నేశ్వరుని తల్లి దండ్రులనుట కన్నా తత్త్వ భూతుడగు విఘ్నేశ్వరునకు రూపకల్పన చేసిన వారనుట సమంజసము

వేదముల యందు బ్రహ్మణస్పతి అనుపేరుతో వినాయకుడు ప్రసిద్ధి నొంది యున్నాడు ఋగ్వేదము నందలి ద్వితీయ మండలమున గణపతి స్తుతి ప్రసిద్ధమై యున్నది.

ఋగ్వేదంలో గణపతి పేరున్న మంత్రములు ఒకటి. రెండు కలవు వాటిలో ఎక్కువ వ్యాప్తిలో ఉన్నట్టి మరియు ఈనాడు గణపతి పూజకాలమున చెప్పబడు మంత్రము.

"గణానాం త్వా గణపతిం హవా మహే, కవిం కవీనా ముపమశ్రవస్తమం ।
జ్యేష్ఠ రాజం బ్రహ్మణాం బ్రహ్మణస్పత ఆనః శృణ్వన్నూతిభిః
సీదసాదనమ్‌॥"

పై ఋగ్వేద సూక్తి అనుసరించి విఘ్నేశ్వరుడిని గణాధిపతిగా వ్యవహరిస్తారు. గణ శబ్దానికి చాలా విస్తృతమైన అర్థం చెబుతారు. "గణ్యతే బుద్ధ్యంతే తే గణాః అంటే లెక్కపెట్టడానికి సాధ్యమైనదంతా, బుద్ధిచేత సాధ్యమైన దంతా గణం క్రిందికి వస్తుంది. జీవాత్మకు, పరమాత్మకు గల సంబధాన్ని అవగాహన చేసుకోడానికి అవకాశమిచ్చే తత్త్వమే గణపతి తత్త్వం అని పెద్దలు చెబుతున్నారు. బ్రహ్మ విష్ణు పరమేశ్వరులు గణపతి తత్త్వం నుంచే ఆవిర్భవించునట్లు కొందరి విశ్వాసం.

ఈ మంత్రానికి సాయనుల వ్యాఖ్య "ఓ బ్రహ్మణస్పతీ" ప్రవృద్ధమగు కర్మలకు ప్రభువైనట్టి వాడవూ, దేవ గణములకు చెందిన వాడవూ, స్వగణములకు నాయకుడవూ క్రాంత దర్శులైన కవులలో శ్రేష్టుడవూ, అపరిమితమైన ఆహారము కలవాడవూ, ప్రముఖుల మధ్య ప్రకాశించు వాడవూ, మంత్రాది దేవతవూ అయిన నిన్ను ఈ కర్మ నిమిత్తముగా ఆహ్వానిస్తున్నాను మా నుతులను వింటూ నీ రక్షణలతో యజ్ఞ గృహమునకు వచ్చి కూర్చుండుము.

యాస్కుడు ఈ మంత్రమందలి బ్రహ్మణస్పతి అను పదానికి అన్నము మరియు ధనములకు అధిపతి అని నిర్వచించినాడు.

బ్రహ్మణస్పతి అనుచోట 'బ్రహ్మన్' శబ్దమునకు వాక్ (వాణి) అను

అర్ధము కలదు. అందుచే వాక్పతి, వాచస్పతి అనియు ప్రతీతికలదు. 'జ్యేష్ఠ రాజ' శబ్దమునకు "అధిదేవత" అనియు 'శాసనకర్త' అనియు అర్ధములు కలవు గణపతి శబ్దమునకు గణములకు పతి అనియు, గుణములకు ఈశుడనియు చెప్పవచ్చును. 'గణ్' అను ధాతువునుండి 'గణ' వచ్చినది. 'గణ్' ధాతువు సమూహే అను అర్ధమున సమూహమనగ గణములు (దేవతలు) సమూహము లేక అహంకారాది తత్త్వముల సమూహము. గణపతి దేవతల కధిపతి మరియు సృష్టితత్త్వముల కధిపతి 'గ' కారము సకల దృశ్యాదృశ్య ప్రపంచమును మనోవాక్కాయ కర్మల ద్వారా పోందించునది. మనోవాక్కు- 'గణ' అను పదము మనోవాక్కులతో కూడిన తతోరహితమైన ప్రపంచము అజ్ఞానము మనయందే ఉన్నది.

మాద్గల పురాణము నందు గణ అనుపదము ఈ క్రింది విదముగ వ్యాఖ్యానింపబడినది.

> మనో వాణీ విహీనం చ సంయోగ యోగ సంస్థితమ్ ।
> ణకారాత్మక రూపం తత్ ణకార స్తత్ర సంస్థితః॥

ఋగ్వేదమున గణపతి, గణపదములు గల మరొక మంత్రము

> "నిషుసీద గణపతే, గణేషుత్వా మహుర్వ ప్రతమం కవీనాం
> నఋతే త్వత్ క్రియతే కించనారే .మహామర్కం మఘవం జితమర్చ"

ఈ రెండు మంత్రములే గాక 'గణేన' అను పదము మాత్రమే గల మంత్ర మొకటి వున్నది. ఇచ్చట గణపదమును "అంగీరస గణాః" అనగా సంగీతజ్ఞులు అని నిర్వచించినారు. ఇదివరకే పేర్కొన్న మంత్రమందలి 'గణేషు' అను శబ్దములో గల 'గణ' పదానికి "స్తుతికర్తలు" అని అర్ధము

ప్రవర్గ్య అను యాగమున వినియోగమైన 'గణానాంత్వా' మంత్రానికి ఋగ్వేదమందలి 'గణపతి' అను పదానికి మనము ఈ నాడు పూజిస్తున్న

గణపతికి ఎట్టి సంబంధమూ లేదు. దీనిని బట్టి ఋగ్వేద కాలమున గణపతి అను దేవత లేదని ప్రాచ్య పాశ్చాత్య విద్వాంసుల అభిప్రాయము.

ఈ ఋక్కులో గణపతి పదము చెప్పబడుట వలన పురాణాలలో పేర్కొన్న ఈశ్వర పుత్రుడైన గణపతిని పూజించునప్పుడు యీ మంత్రమును పఠించుట వాడుక అయినది. గణపతిని స్తుతించునప్పుడల్లా యీమంత్రాన్ని గణపతే పదము గల "నిషుసీద గణపతే గణేషు ....." అను ఋక్కును పఠించుట వాడుకగా వున్నది.

కాని పురాణోక్తమగు గణపతి అను దేవతకూ యీ మంత్రమును పేర్కొన్న "బ్రహ్మణస్పతి" అనుదేవతకూ ఎట్టి సంబంధమూ లేదు. ఋగ్వేదంలో గణపతి అను పేరుగల దేవత లేదు గణపతి శబ్దానికి దేవ గణముల అధిపతి అన్న అర్థమునుండి యీశబ్దము బ్రహ్మణస్పతికి విశేషముగ వుంది

ఈ వివరాలలో గణపతి ప్రాచీన ఋగ్వేద కాలంనాటి దేవుడు కాదని స్పష్టమవుతున్నది. ఋగ్వేదకాలమున మనమీనాడు పూజిస్తున్న విఘ్నరాజ గజముఖ గణపతి లేడు. పురాణ కాలంలోనే ఈతని పూర్ణరూపం సిద్ధమైంది కానీ గజముఖ గణపతి సృష్టికి అవసరమైన మూలవస్తువు ఋగ్వేద కాలంలోనే చిగురు వేసింది.

తైత్తిరీయ ఆరణ్యకమున దంతి భగవానునిపై ఒక మంత్రమున్నది.

"తత్ పురుషాయ విద్మహే వక్రతుండాయ
ధీమహి తన్నో దంతిః ప్రచోదయాత్"

శయనాచార్యుడు ఈ దంతి వక్రతుండుడైన గణపతియేనని వివరించి యున్నాడు. ఋగ్వేదమున బృహస్పతి పరశు లేక బంగారు గొడ్డలి కుడి చేతిన కలిగి యుండెను బృహస్పతినే గనపతిగా పేర్కొనబడి యున్నది. ఫాదర్ హీరాస్ పండితుడు గణేశుని గాథలను గూర్చి పరిశోధించి చక్కని

గ్రంథాన్ని ప్రచురించాడు — Father Heeras, The problem of Ganapathy, Varanasi -1972.

గణపతి వేదకాలం నాటి దైవం కాబట్టే సాయణ మాధవులు తమ యజుర్వేద భాష్యారంభంలో గణపతిని ప్రథమంగా ఇట్లు ప్రార్థించారు.

"వాగీశాద్యాస్సు మనసః సర్వార్థా నా ముపక్రమే
యంనత్వా కృత కృత్యాః స్యు స్తమ్ నమామి గజాననమ్"

మానవుడు తన పురోగతికి ఏదో ఒక అవ్యక్త శక్తి అడ్డుతగులు తున్నదని భావించినపుడు తన కోర్కెలన్నీ సఫలం కానపుడు, తన ఇష్టార్థాలన్ని నెరవేరనపుడు "విఘ్న"ములకూ ఒక అధిదేవత ఉండవచ్చునసే నిర్ణయానికి వచ్చినాడు. విఘ్న కారక మగు ఆ దైవాన్నిపూజించి తృప్తిపరచి ప్రసన్న మొనర్చు కొన్నపుడు విఘ్నములు నివారింపబడి ఆ దేవతయే 'సిద్ధి దాయకుడు' కాగలడన్న విశ్వాసం కలిగింది.

ఈ విధంగా విఘ్నకారీ, సిద్ధిదాత అయినదేవుడు వాస్తవంగా అతిశక్తి మంతుడూ, బుద్ధిమంతుడూ, అయి వుండవలెను. వీరులకు భూషణమైన క్షమాగుణయుతుడై తప్పులను మన్నించే కరుణామూర్తియై వుండవలెను. ఇతడు సర్వశక్తుడూ, దయామయుడూ, కావుననే అతని అజ్ఞానువర్తుల దేవతల బృందము లేదా పరిచారకులు అతని ననుసరించి యుండవచ్చును ఈ విధమైన పెక్కు కల్పనలే నేటి వినాయక, గణపతి, విఘ్నేశ్వర, సిద్ధి దాత అను దేవత ఏర్పడడానికి కారణమని ఊహింపవచ్చును.

గణపతి అనార్య లేదా ద్రావిడ దేవుడని, వైదికదైవము కాదని ఆర్యులు, ద్రావిడుల విశ్వాసమును చూరగొనుటకై ఈ దైవాన్ని తాము కూడా స్వీకరించి ఆ అగ్రపూజా గౌరవమును యిచ్చిరి అనే వాదా మొక

టున్నది. ఋగ్వేదమునకాని తరువాతి ప్రాచీన వైదిక సాహిత్యంలో కాని గజముఖ-గణపతి యొక్క ప్రస్తావన లేకుండుటయే ముఖ్యకారణము.

వేదకాలము నుండి మహాగణపతి ఆహ్వానము ఆరాధనా ప్రవృత్తులు అవిచ్ఛిన్నంగా విశ్వవ్యాప్తంగా సాగివస్తున్నవి వేదానుశాసనాన్ని అనుసరించి శృతి, స్మృతుల, పురాణాల ఆధారంగా, అంతర్దృష్టిగల మహర్షులు విశ్వరక్షకృతుడైన వినాయకుని సగుణ, నిర్గుణ, బ్రహ్మగుణాలకు అధిష్ఠాన తత్త్వమైన గణాధిపతిని అనాథనాథ సర్వజ్ఞ గీర్వాణ పరిపూజితునిగా ప్రత్యక్ష స్వరూప పరమాత్మగా గానం చేశారు.

సకల కార్యసిద్ధి ప్రదాతగా, ప్రప్రథమ ఆరాధ్య దేవునిగా అత్యంత భక్తి శ్రద్ధలతో ప్రతి ఏటా "గణాధిపతి"ని భాద్రపద శుద్ధ చతుర్థినాడు వినాయక వ్రతం కల్పోక్తముగా పూజించిన వారలకు పుత్ర, పౌత్ర, ధన, ధాన్య, స్తువ, వాహన విద్యాబుద్ధులు, భూషణాదులతో సర్వ సౌఖ్యములు సిద్ధించును సమస్త కోరికలు యీడేరును. హర్ష, పూర్ణ, హృదయులైన చాతుర్వర్ణములును, స్త్రీ, పురుష, బాల, వృద్ధ, బీద, ధనిక భేదములు లేకుండా సర్వులు ఈ వినాయకుని వ్రతమును ఆచరించుట సంప్రదాయము అరిష్టములను అపవాదములను పొందకుండుటకే యున్నది. ప్రజలలోని ప్రగాఢ విశ్వాసము.

గణపతి యొక్క ఆధ్యాత్మిక తత్త్వము అత్యంత మనోహరమైనది ఆయన బాహ్య రూపము కంటె అభ్యంతర రూపము తెలుసుకొనుటకు ముఖ్యము

గణేశుని అవయవములన్నియు ఒకేతీరున లేవు. ముఖము గజ రూపము, కంఠము క్రింది భాగము మనుష్యరూపము. శరీరము నరుని గజములను పోలి మిశ్రితమై యున్నది. గజ అని ఎవరిని పిలుతురు ?

కేవలము బ్రహ్మకే ఆ పేరున్నది. సమాధిద్వారా యోగులు దేని చెంత కేగు చున్నారో దేనిని పొందగలుగు చున్నారో అదియే 'గ' అనియు (సమాధినా యోగినో యత్ర గచ్ఛన్తీతిగః") అదే విధంగ దేనినుండి ఈవిశ్వము ఉత్పన్న మైనదో అది 'జ' అనియు (యస్మాద్బింబ ప్రతిబింబతయా ప్రణవాత్మకం జగత్ జాయత్ ఇతి 'జ') విశ్వ కారకుడగుటచే బ్రహ్మ గజ శబ్దముచే చెప్పబడినాడు. గణపతి పైభాగము గజాకృతి గాంచుటచే నిరూపాధి బ్రహ్మ యగుచున్నాడు క్రింది భాగము పై భాగముకంటె నికృష్టమైనది అందుచే సోపాధికముఉపాధితో కూడి ది మాయా విచ్ఛిన్నమైన స్వభావము కలది.

'తత్ త్వమసి' అను మహా వాక్యమునందు గణేశుని మస్తకభాగము 'తత్' పదార్థమును సూచించును. క్రింది భాగము 'త్వమ్' అను పదార్థ మును సూచించును. 'తత్' అనునది మాయాన విచ్ఛిన్నమైన శబ్ద చైతన్య మైన నిరూపాధి బ్రహ్మ త్వమ్ అనునది ఉపాధి విశిష్టమైన బ్రహ్మ జీవునకు సంకేతము. అందుచే గజాననుని అదోభాగము గణేశ పురాణమున గణపతి సహస్రము నందు ఈ విధముగ తెలియుచున్నది.

"తత్త్వానాం పరమం తత్త్వం తత్త్వం పద నిరూపితః
తారకాంతర సంస్థాన సారకస్తార కాంతకః"
జీవ బ్రహ్మైక్య తత్త్వమందీయబడినది.

వినాయకుని జననదినము-మరియు గణాధి పత్యము ప్రాప్తించినట్టి దినము భాద్రపద శుద్ధ చతుర్థియే అగుటచే ఈదినమునకు మరింత ప్రశస్తి చేకూరింది.

జ్ఞాన-నిర్వాణ వాచక గణానికి అధీశ్వరుడైన గణపతి పరమాత్మ ప్రత్యక్ష స్వరూపమే. ఆత్మరూపుడు ! ఆది తత్త్వమైనవాడు !! అవాంగ్మ

TIRUPATI.



నగోచరుడు !!! సకలలోకాలు లోకేశ్వరులు, సర్వసిద్ధి ప్రదాతగా 'గణపతి'ని సంస్మరిస్తూ ఉన్నారు.

“తత్త్వమసి” అనే పరమ సత్యానికి ప్రత్యక్షరూపం గణపతి. అనగా సర్వజ్ఞ సర్వవ్యాపక సర్వ శక్తి మంతుడైనట్టి పరమాత్మ ఆది మధ్యాంతర హితుడు! వేదాంతగత వైజ్ఞానిక మహత్తర తత్త్వము!! బ్రహ్మణస్పతి!!! గణాధిపతి!!!! 'తత్' (అది) అనగా కారణ రహితమైనది జగత్కారణమైనది తత్ నిరూపాధిక బ్రహ్మ! 'త్వమ్' (నీవు) అనగా అల్ప శక్తివంతుడైన జీవుడు

ఈ 'తత్'-'త్వమ్' అనే పదాలయొక్క అర్థాలకు సార్థకతను అసి (ఉన్నావు) అనేపదం యొక్క అర్థం కలుగచేస్తూ వున్నది. అనగా యీ తత్ + త్వమ్‌ల సమన్వయమే మానవజీవితం వానియొక్క సమగ్రతకూ... సాపేక్షతకూ అను సంభావమే మానవ జీవన స్థితి

ఆత్మ-పరమాత్మల సంయోగ సిద్ధియే సదాత్మ రూపముగా సచ్చిదానంద పరబ్రహ్మ తత్త్వరూపంగా గాణాపత్యులు గణిస్తారు. సకల సత్త్వాలకు తత్త్వాలకూ సాధనా మూలం గణపతి సకలలోక దేవాసుర, భూత నర, జీవ గణాలకు మూలాధారపతి గణపతి.

ఇంద్రియ మనో బుద్ధులకు గోచరములగు ప్రతిదీకూడా 'గణ' శబ్ద వాచ్యమే అవుతుంది 'గణం' అన్నది అస్తిత్వానికి మూలాధారమైనది. “గ” జ్ఞానార్థవాచకం 1 'ణ' - నిర్వాణ వాచకం

ప్రపంచమంతా 'గ' కారత్మకం 'గ' కారముతో 'ణ' కారాత్మకరూపము సంస్థితమై గణ శబ్దం ఏర్పడింది అట్టి “జ్ఞాన... నిర్వాణ...” మహా గణములకు' అధిపతి అయి ట్టి వినాయకుడు గణ-పతి అయినాడు.

యోగీశ్వరుల సమాధి ద్వారా ఎచ్చటికి పోవుచుందురో, ఏ పరమ తత్త్వాన్ని పొందుచున్నారో అదే 'గ'.

బింబము నుండి ప్రతి బింబము ఉద్భవించునట్లుగా ప్రణవాత్మకమైన జగత్తు దేనినుండి 'జాయంతే' పుట్టుచున్నదో అది "జ".

ఈ విధముగ 'గజ' అనునది గణపతియొక్క రూపానికీ, పరోక్ష తత్త్వానికీ...ప్రమాణంచా వున్నట్టుంది ఉత్కృష్టమైనట్టిది గజ రూపం.

అందువలనే గణపతి యొక్క రూపంలో 'గజాననం' ఊర్ధ్వభాగంగా శోభిల్లుతూన్నది. ఇక అదోబాగం "నరరూపం"-గా ఉన్నది. ఈ నరరూపం ప్రత్యక్ష తత్త్వానికి సామ్యమైనట్టిది నికృష్టమైనట్టిది. అందువలననే అది అదొభాగంగానే వుండివున్నది

గకారః పూర్వరూపమ్ ! అకారో మధ్యమ రూపమ్ ! అనుస్వార శ్చాంత్య రూపమ్ ! బిందురుత్తర రూపమ్ ! అన్నారు.

"గణ" శబ్దానికి అర్థం వాక్కు అట్టివాక్కుకు అధినాథుడు గణపతి మన ఉచ్ఛ్వాస నిశ్వాసాల సంమర్షణతో సదా ఆ—గణాదిపతి అస్తిత్వాన్నే శరణు వేడుకొనుట ఆత్మజ్ఞానం. త్రికరణ శుద్ధిగా చేయు అట్టి ఆరాధనా ప్రవృత్తులు—సర్వులకూ ఐహికా ముష్మిక ఫలప్రదములు.

భక్తి, జ్ఞాన, ధ్యాన, యోగ, యాగ, తపో, ధర్మ, నిష్ఠాపాదనము లన్నియు ఆ జగద్వరేణ్యుడైన గణాధిపతి వెలుగులో నుండే చలనము పొందుచున్నట్టి కర్మలని గ్రహించాలి.

అణుభ్యో అణుతరం రూపం కృత్వా క్వాపి వ్యవస్థితః అన్నట్లు అణువుకంటె అతి సూక్ష్మమైన రూపంలో సదాస్థితమై యున్నట్టివాడు గణేశుడు.

"అహమేకం వదే మంత్రం, తస్మైతం ప్రదిశంతుచ
సర్వకర్తా - సర్వకర్తా సర్వ పాతా కృపానిధిః
వినాయకో దేవ దేవో బ్రహ్మ విష్ణు శివాత్మకః
షడక్షర స్తస్యమంత్రో మహా సిద్ధి ప్రదాయకం"

అనే నది షడక్షర మంత్రము. ఈ మంత్రాన్ని దేవేంద్రాది దేవత లందరూ గౌతమ మహర్షి ఆదేశంతో జపించి గణేశానుగ్రహ పాత్రులయి, మనోవాంఛా ఫల సిద్ధులయినట్లుగా గణేశ పురాణం చెప్పబడుతున్నది.

"తత్పురుషాయ విద్మహే వక్రతుండాయ ధీమహి తన్నోదంతి ప్రచోదయాత్"-- అను పై మహావచనము గణపత్యోప నిషత్తులో మననీయమైనది

"ఓం నమస్తే మహా గణాధిపతియే త్వమేవ ప్రత్యక్షం తత్త్వమసి
త్వమేవ కేవలం కర్తాసి త్వమేవ కేవలం ధర్తాసి
త్వమేవ కేవలం హర్తాసి త్వమేవ సర్వం ఖల్విదం బ్రహ్మాసి
త్వం సాక్షాత్ ఆత్మాసి నిత్యమ్!"

అనగా ఓమహా గణాధిపతీ నీకు నమస్కారము నీవే తత్త్వానికి ప్రత్యక్ష స్వరూపానివి. నీవేకర్తవు నీవే విశ్వాన్ని ధరించే వాడివి. పోషించే వాడివి. నీవే విశ్వాన్ని హరించేవాడివి నీవే బ్రహ్మ పదార్థమవు. నీవే సాక్షాత్ఆత్మవు - అన్నట్లు ఈ వచనం సదాస్మరణీయం.

గణపతి విఘ్ననాయకుడు అతను చాలా అల్లరి పెట్టేరకం అటువంటి గణపతిని ప్రతిపనికి ముందు పూజించేస్థితికి సమాజం రావటానికి ఏవో చాలా కారణాలు వుండివుంటాయి గృహసూత్రాలు రచించిన కాలం నాటికే అంటే క్రీ.పూ 5వ శతాబ్దం నాటికే గణపతి విఘ్నాలను కల్పిస్తాడని అతను చాలా ప్రమాదకరమైన దైవమని ప్రచారంలో వుంది మహాభారతంలో గణపతులు, గణేశ్వరులు, వినాయకులని అనేకమంది వున్నట్లు ప్రస్తావించ

బడింది వీరంటే భయం వుండేది. ఈ గణపతులను చాలా దుష్టులుగా దుష్టశక్తులుగా పరిగణించేవారు. వీరి వలన చాలా దుష్ఫలితాలు కలిగేవని చెప్పకొనేవారు.

యజ్ఞవల్క్య స్మృతులలో మాత్రం విఘ్నాలను సృష్టించమని వినాయకుడిని రుద్రుడు, బ్రహ్మ కలసి నియోగించినట్లు పేర్కొనబడినది. (గణానాం అధిపత్యే' గణపతి తలచుకుంటే ఎన్ని కష్టాలనైనా కల్పించి రాజులకు సైతం రాజ్యాలు దక్కకుండా ముప్పతిప్పలు పెట్టగలడు మను స్మృతిలో గణయాగం చేసినవారిని శ్రాద్ధ భోజనానికి అర్హులుకారు వారిని విసర్జించాలి అనివుంది గణపతి వె కబడిన హీనజాతి ప్రజల దైవమని కూడా ఒకచోట మనువు చెప్పినట్లు తెలుస్తున్నది శూద్రులని చెప్పబడే వారు గణపతిని కొలిచేవారు.

గణపతి విఘ్నాలు కల్పించి అల్లరి పెట్టడం ఒక వృత్తిగా పేర్కొన వచ్చు. కానీ అతన్ని కొలిస్తే విఘ్నాలను తొలగించి విజయాలు కలుగ జేస్తాడనే అభిప్రాయాన్ని తరువాతరువాత పురాణాలు ప్రచారంలోకి తెచ్చాయి

'గణ' అంటే గుంపు, వర్గము, సమూహము అని అర్థము. ప్రాచీన భారతము యొక్క ఆదిమ వాసులు 'గణము'లుగా గుంపు వర్గాలుగా కొండ ప్రాంతాలలో నీటి వసతి వున్న స్థలాలలో నివసించుచుండేవారు అడవులలో స్వేచ్ఛగా విహరించుచుండిన ఏనుగులు వీరికి భయాన్ని, విస్మ యాన్ని కలిగించి యుండవచ్చు వాటి ఆకారము, శక్తి, గాంభీర్యము మరియు విధ్వంసన శక్తులకు భీతి చెందినవారు ఆ ఏనుగుల వల్ల తమకు ఎట్టి హాని కలుగకుండా వుండుటకు అంతేకాక తమకూ అట్టిశక్తి సామ ర్థ్యాలు లభింపవలెనని ఏనుగు ఆకారము గల రక్షకదైవ మొకదానిని ఆరాధిస్తూ వుండవచ్చు

ఆటవిక దశనుండి పూరి గా విముక్తి చెందని మానవ చైతన్యం ఆధ్యాత్మిక బావాలను ఏర్పరచుకోగా ఆ సంధిలో గణపతి అవతారము వెలసినది భౌతికావసరాలతో తృ పి ప డి జీవించే ఆటవిక సమాజంలో వెలసిన దేవుడు గణపతి

భౌతికావసరాలతో తృప్తిపడే సమాజం ఆధ్యాత్మికావసరాలను ఎలా తీర్చుకుందో తెలుసుకుందుకు గణపతి పుట్టు పూర్వోత్తరాలు పరిశీలించాలి గణపతి ఒక్కడేకాదు. ఈ కోవలోనికి యింకా ఎందరో వస్తారు. మన పురాణాలు కట్టు కథలల్లి ఎంత తెలివిగా మనకళ్ళలో దుమ్ము కొట్టినప్పటికీ అప్పటి ప్రజల బౌతిక దృక్పథాన్ని తెలుసుకొనేందుకు కొందరు దేవుళ్ళు మనకు సహాయపడతారు. వేదకాలం నాటి బృహస్పతి ప్రాచీన భౌతికవాద దృక్పథానకి ప్రతినిధి. శివుడు, కృష్ణుడు వీరంతా పురాణాలలోంచి పుట్టు కొచ్చిన దేవతలు. గణపతి ఆటవిక జాతుల ప్రజలచేత ఆరాధింపబడే దైవము ఒక గణానికి అధిపతి కనుక గణపతి అన్నారు. మన పండితులు గణపతి చరిత్రను చాలా అయోమయం చేశారు. శివుడ్ని, బృహస్పతిని కూడా గణపతి అన్నారు భౌతిక వాద దృక్పదం కల ఆటవిక వర్గ రహిత సమాజంలో పుట్టిన దేవుడు గణపతి గణపతికి లోకబంధు, లోకనాథ అనే పేర్లు కూడా వున్నాయి ప్రజలకు మిత్రుడు వారిని రక్షించే వాడనే అర్థంలో యీ నామాంతరాలు చెలామణిలో వున్నాయి. తాంత్రిక మతంతో గణపతి కేమైనా సంబంధం వుందా అంటే వుందని చెప్పవచ్చు. తాంత్రిక గ్రంథా లలో గణపతి పేరు విరివిగా వస్తుంది. ఆనందగిరి, శంకర విజయంలో గణపతి అను-యాయులుగా జీవించే గాణాపత్యుల ప్రస్తావన వుంది వామాచారులు ఉచ్ఛిష్ట గణపతిని కొలిచే వారని అనందగిరి చెప్పాడు.

ఇక వినాయకుని జననమునకు సంబంధించిన వివిధ కథలు

రోహిణి మృగశీర్ష, ఆర్ద్రలు ఆకాశమందు గజవీధియను దాని

యుందుండును. ఈ గజ వీధికి పై భాగము - తలయైన ఆర్ద్ర నక్షత్రమును గజవీధినుండి తీసి మిధునరాశిలో చేర్చుట గజాసురుని తలతీయుట ఆర్ద్ర పునర్వసుతో చేర్చనిగాని మిధునరాశి ఏర్పడదు మిధున మనగా పురాణ దంపతులగు పార్వతీ పరమేశ్వరులు ఆర్ద్ర చేరక పూర్వము పార్వతి (పునర్వసు) ఒంటరిగా నుండెను భర్త జాడ తెలియక భాధపడి యట్లు తన భర్త గజవీధిలో దాగియున్నట్లు-అనగా గజాసురుని గర్భస్థుడై శివుడున్నట్లు తెలుసుకొని విష్ణువును వేడగా (సూర్యుని వేడగా - సూర్యుడు సంచరించు రాసులే గనుక - అతడు వానిని సరిదిద్దగలడని) ఆర్ద్రను పునర్వసుతో చేర్చి మిధునమునకు సరియగు రూపకల్పన జరిగినట్లు కథ. ఆర్ద్ర రుద్ర దేవతాకమైన నక్షత్రము అది వృషభరాశిపైన సూర్యాస్తమయ సమయమున గోచరించును అందుచే శివుడు వృషభవాహనుడని చెప్పుచున్నాము శివుని వాహనమగు వృషభము- నందీశ్వరుడు. గజాసురుని సంహరించి పార్వతీదేవితో శివుని చేర్చుట జరిగినది ఇట్లు తనను చేరరానున్న భర్త విషయమును విన్న పరాశక్తి ముదమొంది అభ్యంజన స్నానము చేయబోయెను.

పార్వతీదేవి స్నానశాల యందుండు సమయమున పరమేశ్వరుడు ఆమెను తరచుగ ఉడికించుచుండెను. భర్తకు గల ఈ అలవాటును మాన్పుటకై పార్వతి ఒకనాడు నలుగు పిండితో ఒక మానవుని కల్పించి అతనిపై గంగా జలమును చిలకరించి ప్రాణప్రతిష్ఠచేసి ద్వారము కట్టనుంచెను. అంతలో పరమేశ్వరుడు వచ్చి లోపలికి పోబోవ విఘ్నేశ్వరుడు అడ్డుకొనెను. కోపావేశుడై విఘ్నేశ్వరుని తలద్రుంచి పరమేశ్వరుడు లోనికి జొచ్చెను పార్వతి బయటకువచ్చి తన కుమారుడు మరణించుట చూచి చింతిల్లగా శివుడామెను అనునయించి తనకు కనబడిన మొదటి ప్రాణి శిరమును తెచ్చి బాలుని బ్రతికింతుననెను. దైవికముగా అది ఏనుగు కాగా శివుడు ఆ ఏనుగు తలను ఖండించి పార్వతీపుత్రుని శిరమున కతికించి ప్రాణప్రతిష్ట చేసెను

ఆ కుమారుడే విఘ్నేశ్వరుడు.

ఒకనాడు పార్వతియును, శివుడును, క్రీడించు చుండగా దేవతలు వచ్చిరి అపుడు వారి క్రీడకు భంగమయ్యెను. అపుడు శివుని వీర్యము నేలపై బడెను, అందుండియే పుత్రుడు పుట్టెను వానిని పార్వతి పెంచెను ఒకనాడు ఆమె బాలునెత్తుకొని నాపుత్రుని జూడుమని శివుని పిలిచెను. శివుడు బాలుని చూచినతోడనే ఆ బాలుని శిరము వ్రయ్యలయ్యెను పార్వతి దుఃఖముతో మిక్కిలి విలపించెను. దేవతలందరూ బైలు వెడలి పుష్పభద్ర తీరమున నున్న ఏనుగు తలదెచ్చి యాబాలుని కంఠమున కంటించిరి ఈ బాలుడే విఘ్నేశ్వరుడు.

స్త్రీ ప్రమేయం లేకుండా, పురుష ప్రసక్తి లేకుండా స్త్రీకి జన్మించిన వాడని మరొకచోట చెప్పారు అతని జన్మ అసాధారణమైనదని చెప్పడమే వారి ఉద్దేశ్యం. అతని జన్మకథలో పురాణాలలోంచి తొలగించడానికి వీలు లేని విశేషం ఒకటివుంది అది అసహ్యమైన మలినమైన దాంట్లోంచి గణపతి ఉద్భవించాడని చెబుతూ వుంటారు వినాయకచవితినాడు మనం చెప్పుకొనే కథలో "కైలాసంబున భర్త రాకను దేవాదుల వలన విని ముదమొంది అభ్యంజన స్నాన మాచరించి తన శరీరము నుండి వచ్చిన నలుగుపిండితో ఒక బాలునుచేసి, ప్రాణంబొసంగి వాకిలి ద్వారమున కాపుంచే" అనివుంది ఈ మలినము నలుగుపిండికి సంబంధించి మరొక కథ కలదు.

పార్వతిదేవి తనువాడే తైలంలో తన శరీరం నుండి ఉద్భవించే మాళి న్యాలను మేళవించి గంగవద్దకు పోయి అక్కడ ఏనుగు తలతో వున్న ఒక రాకసి చేత ఆతైలాన్ని త్రాగించిందట ఆ రాకసిపేరు మాలిని మాలిని గర్భం ధరించి ఒక బిడ్డను కన్నదట పార్వతి ఆ బిడ్డను స్వీకరించింది. ఆ బిడ్డ గణపతి. అయినప్పటికీ గణపతి గజాననుడు కావటానికి సరైన కథను సృష్టించటం కోసం పురాణాలు చాలా శ్రమ పడ్డాయి. పుట్టిన కొద్ది సేపట్లో శనిదృష్టి తగలటంచేత గణపతి తన శిరస్సును కోల్పోయాడని బహ్మ

వైవర్త పురాణంలో వుంది విష్ణుమూర్తి శోకిస్తున్న ఆ తల్లిపై జాలిపడి ఏనుగు తలకాయను తెచ్చి మనిషి మొండానికి అతికించినట్లు చెప్పబడివుంది

బ్రహ్మవైవర్త పురాణంలో గణపతి ఖండమను అధ్యాయమున్నది. దానిలో గణపతికి చెందిన పెక్కు విషయములున్నవి కృష్ణపరమైన బ్రహ్మ వైవర్త పురాణములో గణపతి కృష్ణుని అంశముననే జన్మించినట్లు చెప్పబడింది.

పార్వతి పుత్రకాంక్షతో శివునితోకూడి రతిక్రీడలో ఉన్న సమయమున దేవతలు రతి గృహద్వారము వద్దకు వచ్చి మొరపెట్టుకొన్నారు. సంభోగ మధ్యమున వెలుపలికి వచ్చిన శివునివీర్యము భూమిపై పడినది. దానివలన షణ్ముకుడు అవతరించినాడు - బ్రహ్మవైవర్త పురాణము-గణపతిఖండము అధ్యాయము 1 శ్లోకము - 42

కాని పార్వతికి తనకు సంతానము కలుగలేదన్న వ్యథ ప్రారంభ మయింది. శ్రీ కృష్ణుని సూచన మేరకు శివుడు పుత్రప్రాప్తి కొరకు పుణ్యక వ్రతము ఆచరించినట్లు చెప్పెను ఆ వ్రతమును చేసిన తరువాత శ్రీకృష్ణుడు గోపకిశోర రూపమున ఆమెకు దర్శనమిచ్చెను కోటి కందర్ప లావణ్య మనోహరమగు కృష్ణుని వంటి పుత్రుడు తనకు కావలెనని ఆశించి యిష్టార్థ సిద్ధిని పొందింది - బ్రహ్మ వైవర్త పురాణము - గ ణ ప తి ఖ ం డ ము అధ్యాయము - 8 శ్లోకము - 8

తరువాత పుత్రాకాంక్షతో పరమశివునితో రతి క్రీడలో నున్న సమయమున విష్ణువు మాయ రూపమున వచ్చి ద్వారమువద్ద నిలచి 'భిక్షాం దేహి' అన్నాడు మాయా భిక్షువు పలుకులు విన్న శివుడు సంభోగ మధ్యమున లేవగ అతని రేతస్సు అక్కడే శయ్యపై పడెను. (గణపతి ఖండము : అధ్యాయము - 8; శ్లో- 27)

శివ పార్వతులు భిన్న వదనులై వెలుపలకి వచ్చి గృహస్థ ధర్మము మేరకు ఆ బ్రాహ్మణుని సత్కరించి సంతృప్తిని గావించిరి ఆ బ్రాహ్మణుడు "శ్రీ కృష్ణుడు ప్రతి కల్పముననూ గణేశుని రూపములో మీ కుమారుడుగ జన్మించును. అని ఆశీర్వదించి అంతార్థానమై రతి గృహమున ప్రవేశించి శిశురూపమున శివుని విర్యస్థలనమైన చోట పొరలాడి నవజాత శిశువువలె పండుకొని వుండెను. (బ్రహ్మ వైవర్త పురాణము" గణపతి ఖండము; అధ్యాయము 8; శ్లోకము - 84) అశరీరవాణి ఒకటి "ఓ పార్వతీ, కృష్ణపరమాత్మ శిశురూపమున నీ మందిరమున వున్నాడు" అని పలికింది (గణపతి ఖండము; అధ్యాయము 9: శ్లోకము 8 శివ పార్వతులిద్దరూ లోపలికి వెళ్ళి ఆనందముతో ఆ శిశువును ఎత్తుకొని ముద్దాడిరి ఆ శిశువే 'గణపతి' అయినాడు.

దేవాది దేవతలందరూ వచ్చి ఆ శిశువును చూచి అతడు సిద్ధిదాయకుడు అగ్రపూజార్హుడు అగునట్లు అనుకూల వతియగు భార్య లభించునట్లు, కవితాశక్తి, వివేచనా శక్తులు కలిగి వేదజ్ఞాన సంపన్నుడై, కృష్ణభక్తుడై, ధర్మపరిపాలకుడై విఘ్నరహితుడు, విఘ్ననాశకుడు అగుగాక అని ఆశీర్వదించిరి. (గణపతి ఖండము; అధ్యాయము 10 శ్లోకము 21-31

ఈ శివపుత్రుని దర్శనార్థమై అందరు దేవతలవలె శనైశ్చరుడూ వచ్చినాడు. కాని తలయెత్తి బిడ్డను చూడలేదు. ఎందుకు చూడలేదని పార్వతి ప్రశ్నించగా తాను కనులారా చూచిన వస్తువు నాశనమగునట్లు తనకు శాపమున్నదని వివరించాడు. శ్రీ కృష్ణాంశముతో జన్మించిన యీ శిశువు నిన్ను చూచి భయపడుట కల్ల అని పార్వతి అతనిని ఒత్తిడి చేయడంతో శనైశ్చరుడూ ఆ బిడ్డను చూచినాడు వెంటనే ఆ బిడ్డ తల కత్తరింపబడి క్రింద పడింది (-గణపతి ఖండము; అధ్యాయము-12; శ్లోకము - 6) ఈ విషాద సంఘటన ఫలితంగా పార్వతీదేవి కైలాసమందున్న ఇతర దేవతలందరూ

మూర్ఛితులైనారు. వెంటనే శ్రీహరి గరుడారూఢుడై వెడలి ఉత్తరదిశలో పుష్పభద్రా తీరమున రత్యాయాసముచే అలసిపోయి ఉత్తర శిరస్సు చేసి పండుకొన్న మగఏనుగు తలను ఖండించి తీసుకొనివచ్చి మృత శిశువు మొండమునకు తానే అతికించినాడు బ్రహ్మ ఆయువు నొసగినాడు. ఆబాలుడే విఘ్నేశ్వరుడు. సాధారణముగా శివపార్వతుల కుమారుడుగ చెప్పబడు విఘ్నేశ్వరుడు ఇచట విష్ణ్వంశ సంభూతుడుగ చెప్పబడుట గమనింపవలసియున్నది (- గణపతి ఖండము, అధ్యాయము - 2, శ్లోకము.20) తాను మొదట వినాయకుని పూజించి అతనికి సకల సిద్ధులను అనుగ్రహించుటయే గాక విఘ్నేశ, గణేశ, హేరంబ గజానన, లంబోధర, ఏకదంత, శూర్పకర్ణ, వినాయక అను ఎనిమిది పేర్లనుంచి ఆశీర్వదించినాడు. ( బ్ర. వై. పు. - గణపతి ఖండము; అధ్యాయము 13; శ్లోకము -6)

గణేశుడు తన తలను పుట్టకముందే కోల్పోయినట్లు చెప్పారు సింధూర అనేభూతం (ఎర్రగా ఉండాలి) గణేశుని తల్లి గర్భంలో ప్రవేశించి శిశువు తలను తినివేసింది శిశువు జన్మించగానే తన తలను తానే సంపాదించుకొనవలసిన అగత్యం ఏర్పడింది. గజాసురుడ్ని సంహరించి అతని తలను తెచ్చి తనకు తానే అతికించుకున్నట్లు స్కాందపురాణం చెబుతుంది. కాని వికృతంగా వుండే గజాసురుడి తలను ఎన్నుకోవటానికి కారణం స్కాంద పురాణంలో చెప్పలేదు.

స్కాంద పురాణ మందలి నాగర ఖండమున గణపతి పుట్టుకకు సంబంధించిన మరొక కథ వుంది. దానిలో గౌరిదేవి తన శరీరమును రుద్దుకొనగ వచ్చిన మురికి నుండి క్రీడావిలాసమున పురుషాకారములో ఏనుగు తల, నాలుగు చేతులు, లావుపాటి తొడలుగల బొమ్మను నిర్మించి "ప్రభూ ఇతనికి ప్రాణమిమ్ము" అని ప్రార్థించింది శివుడు సృష్టి సూక్తముతో అతనిని స్పృశించి జీవసూక్తముతో అతనికి ప్రాణం పోసినాడు తర్వాత

పార్వతిని సంబోధిస్తూ చతుర్థినాడు జీవసూక్తముతో సృష్టింపబడిన ఈ నీ కుమారుడు సకల గణాలకు అధ్యక్షుడగుగాక. చతుర్థినాడు ఇతనిని పూజించువారి విఘ్నము లన్నియు పరిహారమగుగాక అని వరమును ఇచ్చినాడు ఈ రీతిగా గౌరి పుత్రుడైన గజాననుడు గణపతి, విఘ్నేశ్వరుడూ అయినాడు.

స్కాంద పురాణ మందలి కౌమారికా ఖండమున మరొక కథ వున్నది దేవతలు తారకాసురుని బాధలను సహింపలేక శివ పార్వతుల శరణువేడిరి అపుడు శివుడు తన దేహము పైని మురికితో పురుషాకారము సృష్టించి ప్రాణము పోసినాడు శివుడు ఆ బిడ్డకు విఘ్నేశ్వరుడని నామకరణము చేసి "వేద బాహ్యమగు కర్మల నాచరించు వారికి యితడు దుఃఖము కల్పించుగాక ఇతని పూజ చేయకుండా ప్రారంభించు లౌకిక, వైదిక కర్మంతకు, విఘ్నములు కలుగునని, తారకాసురుని సంహరించు ద్ది పుత్రుడు అతవరించు వరకూ ఇతడే మీకు నాయకుడగుగాక' అని ఆశీర్వదించి దేవతలకు అతనిని అప్ప చెప్పినాడు.

ఏనుగు ముఖం కలిగిన రాక్షసి మాలిని వృత్తాంతం గజాసురుని కద పీటనిబట్టి గణేశునికి అటవిక జాతులతోను, రాక్షసులతోను సంబంధం తప్పక వుండి తీరాలి అ పిస్తుంది మరొక విశ్వసనీయమైన పురాణగాథ ఇలా చెబుతోంది. పూర్వము సోమనాథ అనే కొండ ప్రాంతంలో (శివుని నివాసము) శూద్రులు, హీనజాతి ప్రజల స్త్రీలతో సహా వచ్చి నివాసం ఏర్పరచుకొన్నారు. ఇందుసికి ఈ హీనజాతుల్ని, తెగల మనుష్యులువచ్చి శివుని నివాసస్థానాన్ని ఆక్రమించుకొనడం సహించలేదు. దేవతలు శివునితో మొరపెట్టుకొనగా శివుడు వారిని తరిమి వేసడానికి అంగీకరించలేదు అప్పుడు దేవతలు పార్వతిని సమీపించగా ఆమె తన శరీరం నుండి మలినమైన మట్టి వంచి ఒక మూర్తిని మలచి ఇతను విఘ్ననాయకుడని, గణాధిపతీ అనీ,

వివిధ గణాల ప్రజలు తండోప తండాలుగా వచ్చి జరిపే ఆక్రమణలను నిరోధించగలవాడనీ హామీ ఇచ్చింది ఈ కథలో గణపతి గణాలను అణచడానికి పార్వతి సృష్టించినట్లు అర్థం అవుతున్నది. ఇది నిజం కాకపోవచ్చు. మనవు చెప్పింది ఇందుకు భిన్నంగా వుంది గణపతి శూద్రులు కొలిచే దైవము గ ణ ప తి అనుయాయులలో స్త్రీ పురుషులు సమానత్వాన్ని అనుభవించేవారు ఈ ఆటవిక జాతుల హీనులచే ఆరాధింపబడే గణపతి వీరు జీవికకోసం వలసకు వెళ్ళే ప్రయత్నాలకు దేవతలని చెప్పబడే నాగరిక అగ్రవర్ణాలవారి తరఫున నిరోధిస్తాడని వూహించడం అసాధ్యం గణపతి తన ప్రజలు, తన స్త్రీల క్షేమానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తాడనీ ఆశించలేము.

బ్రహ్మవర ప్రసాదితుడయి గజాసురుడు ముల్లోకములను బాధించుచుండగా దేవతలు ఈశ్వరుని శరణువేడిరి. ఈశ్వరుడు గజాసురునిపై దండెత్తి యుద్ధము చేసి అతనిని సంహరించుటకు ముందు బ్రతుకుగాక మరొక వరమును కోరుకొమ్మనెను గజాసురుడు తన చర్మమును పరిధానముగ ధరించుమని, తరువాత జన్మమున తనను గణపతిగ చేయుమని శివుని వేడెను. శివుడు అందులకు అంగీకరించి అతనిని చంపి వాని చర్మమును పరిదానముగ ధరించి పార్వతికి చూపుటకై అతని శిరమును గొనివచ్చుచుండెను ఆ సమయమున పార్వతి నలుగుపిండితో ఒక బాలుని కల్పించి ప్రాణమొసగి వాకిటకడ కావలి యుంచి అభ్యంజన స్నానమాచరింపనేగెను దేవతలతో కలసి మందిరములోనికి వచ్చుచున్న శివుని ఆబాలుడు అడ్డుపెట్టెను. అంత దేవతలకు, ఆ బాలునకు యుద్ధము జరిగినది, తుదకు శివుడు పాశుపతాస్త్రముతో ఆ బాలుని తలను త్రుంచి దేవతలతో లోనికేగి పార్వతిని చేరెను. పార్వతి శివుని "మీరెట్లు లోనికి రాగలిగితిరి? ద్వారము వద్ద నున్న నా బాలుడేమయ్యెను. అని ప్రశ్నించిగా శివుడు జరిగిన వృత్తాంతము చెప్పెను. అది విని పార్వతి ఆగ్రహించెను.

హరిహర బ్రహ్మదేవులు పార్వతిని శాంతిపుమని ప్రార్థించిరి శివుడు పార్వతిని అనునయించి గజాసురుని శిరమును ఆబాలుని కంఠమున ఘటించి ప్రాణ ప్రతిష్ఠ చేసెను.

తన స్నానాగార ద్వారమువద్ద కాపలా వుంటున్న తన కుమారుని శిరస్సును కత్తిరించి అందుకు మారుగ ఏనుగు తలను అతికించిన ప్రసిద్ధ గాథ శివపురాణంలో వుంది ఎనిమిది అధ్యాయాలున్న ఈ కథ గణపతి పుట్టుకతో ప్రారంభమై వివాహం పుత్రప్రాప్తితో అంతమవుతున్నది. ఈపురాణ కదలోని రెండు అంశాలు గమనింపదగినవి బ్రహ్మవైవర్త పురాణంలో చెప్ప బడిన ఈ కదను ఇచ్చట పేర్కొంటూ "కల్ప బేదముతోపాటు గణపతి జననగాథ కూడ మారింది" అంటూ ఈ పురాణంలో పేర్కొన్నది. శ్వేత వరాహ కల్పమునకు చెందిన గణేశోత్పత్తి గాథ అని చెప్పబడింది

మరొక అంశం కేవలం ద్వారపాలన కోసమే గణపతి సృష్టింప బడలేదు. కైలాస మందలి సేవక వర్గమంతా శివాజ్ఞా విధేయముగా వుండి పార్వతి సేవలకు ఒక్కడూ లేడన్నభావాన్ని పార్వతి చెలికత్తెలు ఆమెకు కలిగిస్తారు తత్ఫలితమే గణపతి సృష్టి రాజాంత పురాలలో రేకెత్తు వైమన స్యాలు పరిణామాలు పరిహారాలను పోలిన ఈ కథ స్వారస్యంగా వుంది.

పార్వతికి జయా, విజయా అనువారు చెలికత్తెలు వారితో మాట్లాడుతూ వుండగా వారు 'శివునివద్ద అసంఖ్యాక గణాలువున్నా' మనవాడు అనదగిన వ్యక్తి ఒకడు కూడాలేడు వారందరూ శివుని ఆజ్ఞాపాలకులే కావున మన వాడూ మనకు విధేయుడూ అగువాని నొకని నీవేసృష్టింపుము ప్రేరేపించినారు అన్నిదినముల తర్వాత పార్వతి నందిని ద్వారపాలన చేయుటకు నియోగించి అభ్యంజనార్థము లోపలికి వెళ్ళినది. ఆసమయమున శివుడువచ్చి నందిని గద్దించి లోపలికి ప్రవేశించినాడు స్నానము చేస్తున్నవేళలో వచ్చిన శివుని చూచి పార్వతి సిగ్గుతో తలవంచుకొన్నది. ఇదివరకు తనచెలికత్తెలు పలికిన

మాటలు పార్వతికి జ్ఞప్తికి వచ్చినవి. తనవాడగు సేవకుడొకడుండినచో శివుడు అక్రమంగా లోపలికిరాను వీలుండేది కాదు అని భావించి తన దేహముపై నున్న మురికితో సర్వలక్షణ సంపన్నుడగు వానిని సృష్టించింది. అతనే వినాయకుడు నీవు నా కుమారుడవు నాకు వేరే సంతానములేదు. నా అనుజ్ఞ లేకుండా ఎవ్వరినీ లోనికి రానీయకు అని ద్వారమున కాపలా వుంచినది సుందరమగు అతని ఆకారమునకు ముగ్ధురాలై వాత్సల్యముచే ముద్దు పెట్టు కొని ఆశీర్వదించింది. అపుడు దేవతలందరూ చేరి గజాననునికి సేనాధి పత్యాన్ని అర్పించిరి. అంతటితో అతడు దేవ గణములకు నాయకుడైనాడు పార్వతి అతనికి అగ్రపూజ చెల్లునట్లుగా వరము ఇచ్చినది. త్రిమూర్తులు గూడ గణపతి పూజనీయుడని అనుగ్రహించాయి మానవులు మొదట గణపని పూజించి తరువాత తమను పూజించునట్లు ఆదేశించాలి.

క్రూరకర్ములగు రాక్షసులు యజ్ఞయాగాదులతోను, తపసుతోను త్రిమూర్తులను మెప్పించి, వరములను పొంది తమను బాధించకుండా ఉండుటకై ఇంద్రాది దేవతలందరూ సమావేశమై దేవతల కళ్యాణమును కుగాను, రాక్షసులు తలపెట్టు ధర్మకార్యాలకు విఘ్నము కల్గించునట్టి విఘ్నరాజును సృష్టించవలసినదిగా శివుని ప్రార్థించిరి. శివుడు వారి అభీష్ట మును పూర్తిచేయు ఉద్దేశ్యంతో గణేశుని రూపముతో పార్వతి శరీరమున ప్రవేశించినాడు తరువాత లోకమాతయగుపార్వతిత్రిశూల, పాశములకుధరిం చినగజవదనడగు కుమారునికి జన్మనిచ్చినట్లు లింగపురాణమున (అధ్యాయ ము104; శ్లో ము 2-24) చెప్పబడింది ఈ రీతిగా జన్మించిన గజముఖునకి శివుడు జాతకర్మాదులను గావించి అతని అవతార కారణాన్ని వివరించాడు త్రికాలంలో కూడా గణపతి పూజార్హుడని ఆశీర్వదించెను. అతనిని ఆరా ధింపకుండ ప్రారంభించునట్టి శ్రౌత, స్మార్త, కర్మలకు వివాహాది శుభకార్య ములకు విఘ్నములు వాటిల్లునట్లు విధించినాడు.

దుష్ప్రవృత్తుల తలపెట్టు పనులు కూడా సజ్జనులు ఆరాధించు

పనుల వలె సునాయాసంగా పూర్తి కావటం వలన మంచికి మన్నన లేక పోయింది అందువలన దుర్జనుల కార్యాలను విఘ్నము కలిగించు విఘ్న దేవత ఆవసరమని దేవతలు ఆలోచించి మహేశ్వరుని వద్దకు వెళ్ళి తమ మనోభీష్టాన్ని విన్నవించుకొన్నారు (-వరాహపురాణం; అధ్యాయము 7; శ్లోకం 3-32)

దేవతల మొరను ఆలకించిన శివుడు సంతోషముతో పార్వతి ముఖాన్ని అవలోకించెను. అప్పుడతనికి భూమి, నీరు, గాలి, తేజస్సులను ఆకార ములుండగ ఆ కా శ ం మాత్రం రూపరహితంగా వుండుట అసంగతంగా తోచింది అంతకుముందు పరబ్రహ్మ, పృధివ్యప్, తేజో వాయువులతో గణపతి అవతరించునని చెప్పినమాట జ్ఞప్తికి వచ్చి నవ్వినాడు. అపుడు పై నాలుగు అంశముల అమిత తేజోవంతుడూ, ప్రకాశవదనము కలవాడూ రెండవ రుద్రుడనివలె విరాజిల్లువాడూ ఆయినట్టి ఈ మారుడు మూర్తీభవించి నాడు పుట్టిన వెంటనే సకల దేవతలను ముగ్ధులుగ చేయునట్టి అతిలోక సుందరాకారుడగు కుమారుని పార్వతి రెప్పవాల్చకుండా చూచినది అదిగమ నించిన శివుడు కుపితుడై ఈ మారునికి ఏనుగుతల, బొజ్జకడుపు ఏర్పడునట్లు శపించినాడు. కాని అంతటితో అతని కోపము శాంతించక శరీరాన్ని విది లించగా అతని రోమ కూపాలనుండి స్వేద బిందువులు నేల రాలినవి తత్ఫలితముగా ఏనుగుతల, కానుగు, నీలము, కాటుక వర్ణముతో వివిధము లగు ఆయుధములను ధరించిన పెక్కురు వినాయకులు ఆవిర్భవించిరి. వారివలన భూమి దద్దరిల్లింది

అపుడు బ్రహ్మ విచ్చేసి పరమశివుని వదనమునుండి ఆవిర్భవించిన వినాయకుడు ఆ తరువాత పుట్టిన వినాయకులకు అ ధి ప తి గ చేయునట్లు సూచించినాడు శివుడు అందుకు సమ్మతించి గజముఖునికి పెక్కు ఆయు ధాలనూ, గణనాయక పదవినీ అగ్రపూజా గౌరవాన్నీ అనుగ్రహించి వినా యకునిగా పట్టాభిషేకము చేసినాడు.

కాలక్షేపానికై బొమ్మలతో ఆటలాడు కొంటున్న పార్వతి ఒకమారు సున్నిపిండితో ఏనుగు ముఖముగల పురుషాకృతి నొకదానిని చేసి కొంతసేపు దానితో ఆటలాడుకొని తరువాత గంగలోనికి విసిరివేసింది అచట అది అద్భుతాకారంలో పెరగసాగింది పార్వతి గంగ వానిని తమ కుమారునిగ భావించి అతనికి పూజచెల్లించినట్లు పద్మపురాణంలో చెప్పబడింది. (పద్మపురాణము అధ్యాయము 40 శ్లోకము 453-457)

అష్టాదశ పురాణాలలో కాని, ఉపపురాణలలో కాని, చేరని శివపారమ్యమును విస్తృతంగా వర్ణించు శివరహస్యములో కూడ గజముఖుని జన్మ వృత్తాంతమున్నది. ఈ వృత్తాంతము మేరకు పార్వతి తన వివాహానికి ముందే గణపతిని సృష్టించింది. (శివరహస్యము; 12-14; శ్లోకము77-81)

గణపతి పుట్టుకను గురించి పురాణాలలోనే కాక కొన్ని ఆగమాలలో కూడా వివరింపబడింది. కాని సుప్రబేదాగమములో తప్ప తక్కిన కథలన్నియు పురాణగాథలనే పోలి ఉన్నవి సుప్రబేదాగమములోని కథ మాత్రము ఆధునిక జీవ శాస్త్రజ్ఞులకు విస్మయం కలిగించేదిగ వుంది.

ఒకనాడు కైలాస పర్వత సానువులలో విహరించుచుండిన శివపార్వతులు రతిక్రీడలోనున్న గజమిధునమును చూచిరి పార్వతికి తాముకూడ ఆ రీతిగ క్రీడింపవలెనన్న కోరిక కలుగగా ఇరువురూ ఏనుగు రూపములను ధరించిరి తత్ఫలితముగా గజముఖుడు అవతరించినాడని సుప్రబేదాగమములో చెప్పబడినది.

పై పేర్కొన్న పురాణం ఉపపురాణాలే కాక గణపతిని గురించియే వ్రాసిన గణేశ పురాణము, ముద్గల పురాణములున్నవి. గణేశ పురాణము 17వ శతాబ్ది తరువాతనే వ్రాయబడినదని. పండితుల అభిప్రాయము గణేశ పురాణము రచింపబడిన తరువాతనే ముద్గల పురాణ రచన జరిగివుంటుంది

ఈ రెండు పురాణాలు గణేశ మహిమను చాటుటకే రచింపబడినవి. గణపతియే పరబ్రహ్మమని ఈ రెండు పురాణాల అన్వయం గౌతమ, విశ్వామిత్రాది మహర్షులందరూ గణపతి కృపవల్లనే బ్రహ్మ సాక్షాత్కారమును పొందిరి గణపతి పూజయే ప్రాపంచిక దుఃఖము లన్నిటికీ పరిహారమని ఈ మహర్షులు ఉపదేశించారు. ఇంద్ర, శివ, విష్ణు, పరశురామ స్కందాది దేవతలు కూడ గణపతిని పూజించి అతనిఅనుగ్రహము పొందిన తరువాతనే తమ కార్యములను నిరాటంకముగా నిర్వహింపగలిగినారు. ఈ విషయాన్ని పురాణాలు పేర్కొంటున్నవి ప్రళయాంతమున బాలగణపతి వటపత్రముపై తేలియాడుతూ ఉండెవని సృష్టికర్త అతనిని పూజించి సృష్టికార్యమును ప్రారంభించినట్లు వర్ణింపబడినది.

గణపతి ప్రతియుగమున లోక కళ్యాణార్థమై ఈ పురాణాలలోను, వివిధ పురాణాలలోను పేర్కొనబడిన మహత్కార్యము లన్నియూ గణపతికి అన్వయింపబడినవి పలుమార్లు పునరావృతమైన ఈ పురాణాలలోని కొన్ని కథలు హాస్యాస్పదంగా వున్నవి గణేశ, హేరంబ అను పదములందలి ప్రతి అక్షరానికీ అర్థ వివరణము చేయు ప్రయత్నము సాగినది. వక్రతుండ, ఏకదంత లంబోదర మొదలగు గణపతియొక్క ప్రతి పేరూ ఒక్కొక్క రాక్షసుని నిగ్రహించుటకుగాను అవతరించిన పేరుగ వర్ణింపబడినది.

గణపతి లీలలకు అవతార వర్ణనలకే అంకితమైన ఈ రెండు పురాణాలలో తప్ప తక్కిన పురాణాలలో గణపతి జన్మ వృత్తాంతమును పరిశీలించినపుడు వ్యక్తమయ్యే ముఖ్యాంశాలు.

పార్వతి స్నానార్థము ఉపయోగించే నలుగుపిండిచే సృష్టింపబడినవాడు గణపతి. శివుడు అతనికి గణాధిపత్యమును విఘ్నకారకము మరియు విఘ్న నివారకము చేయునట్టి శక్తులనిచ్చి అగ్రపూజ చెల్లునట్లుగ విధించినాడు. గణపతి గజముఖుడు గనే జన్మించినట్లు కొన్నిపురాణాలు, మొదట

శిరస్సును పోగొట్టుకొన్న తరువాత గజముఖము అతికింపబడినట్లు కొన్ని కథలున్నవి, కల్పాంతరము తరువాత గణపతి జన్మకథ మారుతూ వచ్చినట్లు చెప్పబడినది. (శివపురాణము అధ్యాయము 13; 12)

గణపతికి ఏనుగు తలను అతికించిన వైనము, అతడు ఏకదంతుడు కావటమూ సామాన్య భక్తుడినేకాక పౌరాణికులనూ పీడించిన సమస్య. పురాణాలలో వివిధములైన కారణములు కానవస్తున్నవి.

స్కాంద, లింగ, పద్మపురాణాలలోను, శివ రహస్యములోను గణపతి గజముఖుడుగనే జన్మించినట్లు చెప్పబడినది శివపురాణము వరాహ మరియు బ్రహ్మవైవర్త పురాణాలలో మాత్రము పురుషాకారమున పెట్టిన గణపతి యొక్క అసలు శిరస్సును ఖండించిన శివుడు ఏనుగుతలను అతికించినట్లు చెప్పబడినది.

బ్రహ్మవైవర్త పురాణాంలో కశ్యపుని శాపకారణంగా గణపతి తల వృక్కలయినట్లు మరొక కథ వుంది. సుమాలి, మాలి అను శివభక్తులను సూర్యుడు దండించిన కారణంగా కుపితుడైన శివుడు తన శూలాయుధంతో సూర్యుణ్ణి కొట్టగా అతడు మూర్ఛిల్లినాడు. సూర్యుని తండ్రియగు కశ్యపుడు ఈ వార్తవిని "నీ కుమారుని శిరస్సుగూడ భిన్నమగుగాక" అని శపించి నాడు. (శివపురాణము ; అధ్యాయము 18; శ్లో 9-11)

పార్వతి స్నానమందిర ద్వారమువద్ద శివుని అడ్డగించిన కారణంగా గణపతి తల ఖండింపబడిన కథ ప్రసిద్ధమైనదే. గణపతికి ఒకతల కావలసి వచ్చినపుడు గజాసురుని శిరమును అతికించిన కథ స్కాంద పురాణములో వుంది గణపతి-గజవదనుడైనాడు కానీ తలలేని లేదా ఖండిత శిరస్కుడైన గణపతికి ఏనుగుతలనే ఏందుకు అతికించినారు ? ఇంతకంటె అందము, ఆకర్షణ గల మరే జంతువు తల లభించక పోయిందా ? అని నారదుడు

నారాయణమహర్షిని ప్రశ్నించినాడట. నిజంగా ఔత్సుక్యమైన ప్రశ్నే ఇది.

నారదునిపై సందేహమునకు నారాయణమహర్షి ఈ విధంగా అన్నట్లు శివపురాణంలో కలదు. పద్మ కల్పములో ఒకమారు మహేంద్రుడు రంభతో కూడ పుష్పభద్రా తీరమున రతికేళి సాగించుచుండెను. అపుడు వైకుంఠ మునుండి కైలాసమునకు వెళ్ళుచుండిన దూర్వాస మహర్షి ఆ దారినే వచ్చాడు. దేవేంద్రుడు నమస్కరింపగా దూర్వాసుడు శ్రీ మహావిష్ణువుచే ఇవ్వ బడిన పారిజాత పుష్పమును దేవేంద్రునికి ఇచ్చాడు. దురహంకారముతో దేవేంద్రుడు పారిజాతాన్ని ఐరావతం యొక్క తలపైకి విసిరినాడు. వెంటనే ఐరావతం ఇంద్రుని వదలి స్వేచ్ఛగా అరణ్యములోకి వెళ్ళి అడ ఏనుగుతో సుఖంగా సంసారం సాగించింది. గణపతికి శిరమొకటి కావలసినపుడు విష్ణువు ఆ ఏనుగుతలనే ఖండించి తెచ్చినాడు. (శివపురాణము అధ్యాయ 20 శ్లోకము 52-62)

గణపతికి గజవదనమేమో వచ్చింది కాని ఆ మదపుటేనుగు ఉన్న రెండు దంతాలు అట్లే వుండలేదెందుకు? ఆ రెండింటిలో ఒకటి విరిగి "ఏకదంతుడు" ఎందుకైనాడు? ఈ పశ్నకు కూడా పురాణాలలో సమాధాన మున్నది.

కార్తవీర్యార్జునుని సంహరించిన పరశురాముడు శివ దర్శనాను రక్తుడై కైలాసమునకు వచ్చినపుడు శివుడు పార్వతితో ఏకాంతమున వుండి నాడు అచ్చటకే వెళ్ళదలచిన పరశురాముని గణపతి అడ్డగించి కొద్దిసేపు వేచియుండునట్లు సూచించినాడు. అద్దరిమధ్యా వాగ్వాదం చెలరేగింది. అపుడు పరశురాముడు తన పరశువును గణపతిపై ప్రయోగిస్తాడు. తన తండ్రి పరశురామునికి ప్రసాదించిన ఆ ఆయుధాన్ని అడ్డగించుట అసమంజ సమని భావించిన గణపతి నెమ్మదిగా నిల్చుంటాడు ఆ గొడ్డలి గణపతి యొక్క ఒకదంతాన్ని భగ్నంచేస్తుంది (బ్రహ్మాండపురాణముఅధ్యా 41, 42)

షణ్ముఖుడు స్త్రీ పురుష లక్షణ శాస్త్ర మొకదానిని రచించును. ఆ గ్రంథమున పేర్కొన్న లక్షణాలేవీ తనలో లేవట్లు గమనించిన గణపతి ఆ గ్రంథ రచనకు విఘ్నము కలిగిస్తాడు. షణ్ముఖుడు కుపితుడై గణపతి దంతాన్ని భగ్నం కావిస్తాడు. (భవిష్య పురాణము ; అధ్యాయము - 22)

భాద్రపద శుద్ధ చతుర్థినాడు లంబోదరుడగు గణపతి మూషిక వాహనుడై వెళ్ళుతున్నప్పుడు చంద్రుడు అతనిని చూచి నవ్వినాడు. గణపతి చంద్రుని శిక్షించుటకై తన దంత మొకదానిని అతనిపైకి విసిరి వేసినట్లు మరొక కద వ్యాప్తిలో ఉంది.

విఘ్నేశ్వర విగ్రహ కల్పనలోని భావన, వినాయకుని పూజించుట యందలి పరమార్థము, సామాన్య జనులకు కూడ ఉత్సాహము కలిగించునట్లు ఈ విషయము లెట్లు సుబోధకములు చేయబడినవి భాద్రపద శుద్ధ చతుర్థినాడేల ఈ వ్రతము చేయుటయో మొదలగు సంగతులను క్రింద వివరణ ద్వారా తెలుసుకోవచ్చు.

బ్రహ్మచర్యమును పరమ ధర్మము యొక్క ఉత్కృష్టతను ఆ బాల గోపాల క్షితిపాలురగు సర్వ జనులకు బోధించుటకై ఒక పెద్ద దేవునిగా విఘ్నేశ్వరుని పెద్దలు సృష్టించి పూజించుచు వచ్చిరి. ఈ దేవుని రూపము గుణములు, వైఖరి మొదలగు వాని కన్నిటికిని అంతరార్థము కలదని నమ్మకము. తత్సంబంధమగు పురాణగాథలు అటువంటివేనని తలంపు. అట్టి అభిప్రాయంతో ఈ క్రింది విషయమును సమకూర్చవచ్చును.

హైందవ సంప్రదాయములో బ్రహ్మ చర్యమునకు గొప్ప స్థానము ఈయబడినది జీవిత కాలమును నాలుగు భాగములుగ చేసి మొదట భాగములో బ్రహ్మచర్య మవలంభించుచు గురుకుల వాసముచేసి విద్యాభ్యాసము చేయవలెను.

"ఆయువు మొదలి నా- లవు పాలు గురుపాల
దాసుని యట్ల సంతతము బనులు
ప్రీతిసేయుచు గుడిచిన - పిదప గుడిచి
శయ్య చెందని నాతని - చరణయుగము
కరయుగంబున నొత్తుచు - గలిత నిద్రు
డైన నిద్రించు బ్రహ్మచ - ర్యావ్రతుండు"

—భారతము; శాంతిపర్వము ; 5-136

"రసగంధ ప్రముఖంబుల
దెసవేడుక లేక గురుమ - తికి వచ్చిన య
ట్టి సమయముల దగవేదా
భ్యసనంబులు సేయుచుండు – నాతడు నియతిన్" 5 - 137

రెండవ జీవిత భాగమందు గృహస్థాశ్రమములో సత్సంతానమును గని లోకులకు నిరంతరము సేవ చేయుచుండవలెను. గృహస్థుగా ఉండి కూడ బ్రహ్మచర్య ముచితరీతి నవలంబింప వలెనని శాసింపబడినది.

"వనితల సంగతి మానుట
చనునొక్క విధంబు బ్రహ్మ చర్యంబగుచున్
తన సతితో ఋతువేళల
జనవున మెలగుటయు బ్రహ్మచర్యంబె సుమీ"

—వావిలి కొలను రామాయణము - ఉలూచి అర్జున సంవాదము.

ధర్మ మార్గంబున సంతతి యుపార్జింప
సమాన్వయంబున వివాహంబు వడసి
మనస్సు తమకంబు లేకాత్మయందు

బూని ఋతుకాలమందున గాని తిధులు
పరిహరించియథోచిత భంగి గేలి
సలుపువాడు సదా బ్రహ్మచారి యంద్రు.

—అనంతా మాత్యుని బోజరాజీయము.

మూడవ జీవిత భాగమందు వాన ప్రస్థము సలుపుచు కందమూల ఫలాదుల చేత బిక్షుపూజ చేయుచు, పరిశిష్టములు భుజించి బ్రహ్మచర్యముతో తపము చేయవలెను.

"బ్రహ్మచర్య సమేత తపంబు విపుల
కాననమున వానప్రస్థ - గణము పొంత
నిలిచి చేయుచు బర్హశా-లలకు నుచిత
కాలమున జనియెత్తి భి-క్షలు భుజించి"

—భారతము; శాంతిపర్వము; 5-132

"నుతియు నమస్కృతియు లే
క తిరిగి శుభమశుభ మనవ-గం బొంపక గో
ష్ఠి తెరువు సొరకుండుట సు
వ్రతమధి యధ్యాత్మ విద్య-ప్రచురము జేయున్"

— భారతము శాంతిపర్వము 5-133

తుది యాశ్రమమగు సన్యాసమందును తీవ్రముగా బ్రహ్మచర్యమును సలుపుచు కర్మత్యాగియై పరమధర్మమగు అహింసామార్గమున వర్తించుచు శాంతాత్ముడు కావలెను. అనుచు బ్రహ్మచర్య వర్తనము బ్రహ్మవిద్యా ప్రాప్తికి ముఖ్యకారణమని వేదవ్యాసుడు శుకున కుపదేశించెను.

మరియు అనుశాసనిక పర్వమందు ప్రథమాశ్వాసములోని 285 వ పద్యంలో లక్ష్మి ఎట్టి జనులయందు వసించునో భీష్ముడు ధర్మరాజునకు

చెప్పుచు బ్రహ్మచర్య మవలంభించు వారిని పేర్కొను. "సత్కర్మంబుల కయ్యేడి ఫలంబులను" గురించి చెప్పుచు "బ్రహ్మచర్యమునకు బరమాయు వుపవాసములకు చిత్తశుద్ధి" - 14 ఫలములని చెప్పను. సత్యవ్రతుడును బ్రహ్మచర్యనిష్ఠా గరిష్టుడునైన బీష్ముడు స్వచ్ఛంద మరణము గలవాడైనట్లు చెప్పబడినది. అంపశయ్యపై నుండి ఉత్తరాయణ పుణ్యకాలము వచ్చిన తరువాత ఆసువులను త్యజింప బూనియున్న బీష్ముని వద్దకు శ్రీ కృష్ణుడు రాగా ప్రాణ త్యాగము చేయుటకాతని యనుజ్ఞ యడుగును. అప్పుడు "బంటువోలే గాంగేయు మృత్యువు నీ వశమున నిలిచె నిర్భయముగ" యని శ్రీ కృష్ణుడు గడించును బ్రహ్మ చర్యము వలన దేహారోగ్యము, వీర్యవృది, బుద్ధిబలమెగాక మనశ్శాంతి, చిత్తశుద్ధి, ప్రసన్నత, సత్తిగుణ సంపన్నత, ఆధ్యాత్మ విద్య ఇవన్ని యును ప్రాప్తించును అందుచేతనెబిష్మునివాడు అఖండ ప్రతిబాశాలి, సకలదర్మ విదుడు, మహాశక్తుడు, ఆత్మవిద్యా సంపన్నుడునై వెలుగొందెను ఇట్లే హనుమంతుడు మహా బలశాలి మహా పరాక్రమ వంతుడు. రామ భక్తాగ్ర గణ్యుడుగా పురాణములు చెప్పుచున్నవి ఈ వాయు నందనుడు బ్రహ్మచారి, చిరంజీవి యనియు చెప్పబడినది.

ఇట్టి కారణముల వలన బ్రహ్మచర్య ధర్మమునకు గొప్పస్థానము కల్పింప బడుటలో ఆశ్చర్యమేమియును లేదు ఈ కారణముననే బ్రహ్మ చర్య ధర్మమును దేవతగా, విఘ్నేశ్వరునిగా రూపకల్పన చేసి బ్రహ్మచారిణే నమః, బ్రహ్మ రూపిణే నమః బ్రహ్మ విద్యా విధాన భువే నమః అని పూజించుచున్నాము.

"యం బ్రహ్మ వేదాంత విదోవదంతి
పరే ప్రధానం పురుషం తథాన్యే
విశ్వోద్గతేః కారణ మీశ్వరంవా
తస్మైనమో విఘ్న వినాయకాయ" అని స్తుతించుచున్నాము.

బ్రహ్మచర్యము వలన సత్త్వగుణము ప్రధానముగ లభించును. సత్త్వ

గుణమును తెలియజేసే రంగు తెలుపు బీష్ములవారు తెల్లటి వస్త్రములు ధరించినట్లు కలదు. బ్రహ్మచారియగు విఘ్నేశ్వరుడు శుక్లాంబర ధరుడు, శశివర్ణుడు, మరియు సత్త్వ సంపన్నునికి ప్రసన్నత సహజ గుణము అందువలననే వినాయకుని గురించి క్రింది ధ్యాన శ్లోకము చెప్పబడినది

"శుక్లాంబరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజం
ప్రసన్న వదనం ధ్యాయేత్ సర్వ విఘ్నో పశాంతయే"

ఇక విఘ్న వినాయకాయ, విఘ్నేశ్వర, విఘ్నరాజ, విఘ్నహంత అను నామములేల కలిగినవవి పరిశీలింతము "ఆదౌ పూజ్యో గణాధిప" యని ప్రతి కార్యమునకు ముందు విఘ్నేశ్వర పూజ చేయుచున్నాము.

"విద్యారంభే వివాహే చ ప్రవేశే నిర్గమే తథా
సంగ్రామే సర్వకార్యేషు విఘ్నస్తస్య నజాయతే
అభీప్సితార్థ సిధ్యర్థం పూజితో యస్సు దైవపి
సర్వ విఘ్నచ్ఛిదే తస్మై శ్రీ గణాధి పతయేనమః"

అనుట కూడ ఈ విషయమునే స్పష్టపరచు చున్నది ఏ కార్యము తలపెట్టినను మంచిరోజున విఘ్నేశ్వరునికి మీదుకట్టుట, కార్యము పూర్తి కాగనే పండుగ చేసుకొని విఘ్నేశ్వరుని కుంప్రాళ్ళు పోసి మీదును విప్పుట పెద్దలు యాచారము. వివాహాది కార్యములకు దీక్ష, పదుగురి సహాయము అవసరము. నేటి నాగరికుల యందీ యాచారము కనిపించుట లేదుగాని 30, 40 సంవత్సరముల క్రిందట ఈ యాచారము సర్వత్ర పాటింపబడు చుండెను. కార్య దీక్ష పూనుటకు తగిన శక్తిసంపన్నత కలుగుటకు ఇంటి లోని వారందరూ పూనుకొనవలెను. అందుకై సాంసారిక నిత్య వ్యవహారాదులకు మీదు కట్టవలెను. బ్రహ్మచర్య దీక్ష పూనవలెను తలపెట్టిన కార్యమందే ఇంటవారు అందరూ నిమగ్నులై రాత్రింబవళ్ళు కష్టించి పనిచేసినచో

నిర్విఘ్నముగా కార్యము కొనసాగును వివాహ కార్యానంతరము పదునారు రోజుల పండుగను జరుపుకొని విఘ్నేశ్వరునికి ఉండ్రాళ్ళు పోసి మీదు తీసి వేయుదురు. తరువాత సాధారణ జీవితమును యథాప్రకారము నడుపుకొందురు. మీదుకట్టుట యనగా కట్టి పెట్టుట ఉపయోగము లేకుండా నుంచుట "చేయి మీదు కట్టితివా" అనుట కలదు. సాధారణముగ ఉపయోగించు దాని నుపయోగింప కుండుట తటస్థించి నప్పుడిట్టి ప్రశ్న పుట్టుచుండును. సంసార క్రియా కలాపము కట్టిపెట్టి కార్యదీక్ష పూనుట చేతనే మీదు కట్టుటయను నాచారము కలిగినది. బ్రహ్మచర్యము వలన నిర్విఘ్నముగా కార్యసిద్ధి కలుగునని దీని సారాంశము మరియు విద్యాభ్యాసమును చేయువారు బ్రహ్మచారులై ఉండవలెను సంగ్రామమునకు పోవువారు అట్టి దీక్ష పూనవలయునని వేరే చెప్పనవసరము లేదు.

విఘ్నేశ్వరుడు గణాధిపతి ప్రథమ గణములకు, యక్ష గణములకు దేవతల యొక్క సర్వకార్యములు ఎవని ద్వారా నడుచునో ఆ గణముల కందరకు ఈత డధిపతి అనగా సర్వ శక్తులు ఈతని యాధీనములో పని చేయును బ్రహ్మ చర్యావలంబనునికి సర్వశక్తి సామర్థ్యములు ఉండునని దీనిని బట్టి మనము గ్రహింపవలెను. అట్లు శక్తి మంతుడు కాని దుర్బలునకు నిరుత్సాహము, భయము పిరికితనము మొదలగు దుష్టశక్తులు భూత, భేత పిశాచములవలె కార్యమందు అడ్డుతగిలి విఘ్న మొనరించును సత్వ సంపన్నుడగు వానికి అట్టి భయముండదు ఇదే "గ ణా ధి ప తి" యొక్క అంతరార్థము.

"తుండము నేకదంతమును తోరపు బొజ్జను వామహస్తమున్
మెండుగ మ్రోయు గజ్జెలును మెల్లని చూపులు మందహాసమున్
కొండక గుజ్జు రూపమున కోరిన విద్యలకొల్ల నొజ్జవై
యుండెడి పార్వతీ తనయ యోయి గణాధిప నీకు మ్రొక్కెదన్

అను పద్యము సాధారణముగ రాని వారుండరు. ఇందు కోరిన విద్యల నెల్ల వినాయకుడు ప్రసాదించునని చెప్పియున్నది బ్రహ్మచర్య ధర్మము నవలంభించిన వారికి కోరిన విద్యలెల్లను సులభముగ నలవడునని ఇదివరలో చెప్పిన విషయమునే తిరిగి ఇది స్ఫుటమొనరించు చున్నది. అట్టివానికి చురుకైనబుద్ధి గొప్ప మేధ ఉండును గదా దీనికి గుర్తుగా ఏనుగుతల (పెద్దతల) విఘ్నేశ్వరునికి అమర్చబడినది గజాననుడగుటచేత తొండ ముండుట స్వభావమే ఈ తుండము "ప్రణవ స్వరూప వక్రతుండం" అని వర్ణింపబడినది నాగరలిపిలో ఓం అను అక్షరమును అడ్డముగా త్రిప్పి చూచినచో కుంభ స్థలములు గల ఏనుగు తల నుండి వ్రేలాడు వక్ర తుండము గోచరించును. ఓంకారము నుండి సర్వ శబ్దములు, అక్షరములు పుట్టినవని నాదోత్పత్తి క్రమములో చెప్పబడియున్నది. అందుచేత విఘ్నే శ్వరుడు అక్షర స్వరూపుడు, వాగధిపతి, "పరాది చత్వారి వాగాత్మకం"అని వర్ణింపబడినాడు. పర, పశ్యన్తి మధ్యమ, వైఖరి యనునవి వాక్కుయొక్క స్వరూప భాగములు.

విఘ్నేశ్వరుడతి మేధావి యను విషయమును వెల్లడించుటకై పురా ణముల యందు కదలు చెప్పబడినవి. వ్యాసుడు మహాభారత రచన కుపక్ర మించుటకు ముందు తానుచెప్పినది. అర్థము చేసుకొని చురుకుగా వ్రాయ గల లేఖకుడు కావలెననగా ఆ పనికి విఘ్నేశ్వరుడు నియమితుడైనాడట. చెప్పువానికంటె తొందరగా వ్రాయుచు వినాయకుడు వ్యాసుని తొందర పెట్ట సాగెనట కొంత ఆలోచనపైనగాని యర్థము కానట్టి క్లిష్టమైన శ్లోకములను వ్యాసుడు మధ్య మధ్య చెప్పి ఆ తొందరను తొలగించు చున్నాడట. అవే భారత మందలి వ్యాస ఘట్టములు.

విఘ్నేశ్వరుడు శుద్ధ బ్రహ్మచారి కనుకనే "విఘ్నేశ్వరుని పెండ్లికి వేయి విఘ్నములు"ను నానుడి పుట్టినది. అతడి పెండ్లి కన్నియు విఘ్నములే కనుక ఎన్నటికీ వివాహము పొసగదు వివాహమైనచో బ్రహ్మ చర్యమునకు

పపాత మేర్పడును కదా ! అయినను విఘ్నేశ్వరుని పెండ్లి గురించి ఒక చమత్కారమగు కథ యున్నది. దానిలో గణపతి దేవుని బుద్ధి సూక్ష్మత సూచింపబడినది.

ఒకనాడు తన తనయులగు విఘ్నేశ్వరుని, కుమారస్వామిని పార్వతీ దేవి పిలిచి "నా వద్ద సిద్ధి, బుద్ధి" అను చక్కని కన్యలున్నారు. ఏడు పర్యాయములు భూ ప్రదక్షిణము చేసి మీలో ముందుగా ఎవరు వత్తురో వారికిచ్చి పెండ్లి చేసెదను'అనెను. అంతట వారిద్దరు వారి వాహనములగు మూషికమును నెమలిని ఎక్కి బయలుదేరిరి, ఎలుకనెక్కి తాని కార్యమును మయూర వాహనునితో పోటిచేసి గెలుచుట యసంభవమని ఆలోచించి విఘ్నేశ్వరుడు తిరిగి వచ్చి మాతృదేవతయగు పార్వతి కేడుసార్లు ప్రదక్షిణ మొనర్చి నమస్కరించి "అమ్మా భూదేవతకంటె మహత్తరనుగు మాతృదేవతవు నీవు భూ ప్రదక్షిణ ఫలము తప్పక నాకు లభించనవి నాకు కన్యలనిచ్చి వివాహము చేయుము" అనెను.. ఆమె అతని బుద్ధి సూక్ష్మతను మెచ్చి సిద్ధి బుద్ధుల నిచ్చి వివాహ మొనర్చెనట, దీని భావ మిట్లు యుండవచ్చును. బ్రహ్మచారికి కార్యసిద్ధి, సూక్ష్మబుద్ధి భార్యలవంటివి. వాని కతడు భర్త అని అతని అను వర్తనలో నుండును అని సూచన. ఈ కథ ఇంకను పొడిగింపబడినది ఆ బద్ధము భార్యల వలన - క్షేముడు, లాభుడు యను కుమారులు కలిగిరట అనగా కార్యసిద్ధి వలన క్షేమము, సూక్ష్మబుద్ధి వలన లాభము ప్రాప్తించు నని తాత్పర్యము

స్థూల కాయుడగు "బొజ్జగణపయ్య' చిన్న ఎలుకపైవ స్వారీచేయుట చిత్రముగా తోపకమానదు విఘ్నేశ్వరుని ఆకారమంతయు నవ్వు పుట్టించు నట్టిదే, ఏనుగుతల, శూర్పకర్ణములు, తుండము, గుజ్జురూపు, కాళ్ళకు గజ్జెలు, లంబోదరము హాస్యరస స్ఫురణకములు, బాగుగా బోజనము చేయగల స్థూలకాయులు చిదానందముతో హాస్యరస ప్రియులై యుండుట లోకములో తరచు చూచు చుందుము, అందుచేత వినాయకునికా

రూపకల్పన సమంజసముగానే యున్నది. హాస్యరస ప్రియుడగు విఘ్నేశ్వరునికి చిన్ననాటి నుండియు కొంటె చేష్టలుండెనను భావమును కవులు వర్ణించినారు క్రింది పద్యమును ఉదాహరణ తీసుకొనవచ్చును.

"తనయుని యొక్క యెత్తుననె దక్షిణ యున్నిటలాక్షుడున్ మదం
బున చెక్కులం గొనుచు ముద్దుగొనంగ నొకింత నెమ్మొగం
బనువుగ వెన్కకుం దిగిచి యత్న విహీన పరస్పరాస్య చుం
బనములు తల్లి దండ్రులకు బన్నిన గూర్పు గజాస్యు గొల్చెదన్"

"తోరపు బొజ్జను వామహస్తము" – బ్రహ్మచారికి జఠరాగ్ని ప్రజ్వరిల్లి యుండును. పుష్కలముగా భోజనము చేయగలడు. భోజనాంతరము తోరపు బొజ్జను వామహస్తముతో నివురుకొని ఆనందించును. అతని భోజన ప్రియత్వమును తెలుపుటకై కుడిచేతి యందు ఒక కుడుము ఉంచబడి యుండును. స్థూల శరీరమునకు తోడు గుజ్జు రూపము కూడ ఏర్పాపబడినది. ఇవి చాలక కాళ్ళకు "మెండుగ మ్రోయు గజ్జెలు" ఉన్నవి దేహదార్ఢ్యము, జీవచైతన్యము సమృద్ధిగా గల బ్రహ్మచారి ఆనంద తాండవమాడగలడని దీని సూచన. ఈ యానంద తాండవము చేయు స్వరూపమునే శ్రీ త్యాగరాజస్వామి గానము చేసియున్నారు

శ్రీ గణపతిని సేవింపరారే శ్రిత మానవులారా ॥శ్రీ॥
వాగాధిపత సుపూజల జేకొని బాగనటింపుచు వెడలిన ॥శ్రీ॥
పనస నారికేళాది జంబూ ఫలము లారగించి
ఘన తరంబునను మహిపై పదములు ఘల్లు ఘల్లన నుంచి
అనయము శివుని చరణ యుగములు హృదయంబున నుంచి
వినయమున త్యాగరాజ వినుతుని
వివిధ గతుల ధళంగుమని వెడలిన ॥శ్రీ॥

పరమేశ్వరునిపై భక్తి పారవశ్యముతో కాలిగజ్జెలు ఘల్లు ఘల్లుమని మ్రోగుచుండగా వివిద నాట్యగతులలో ధళంగు, ధిత్తళంగుమని ఆనంద తాండవ నృత్యమును చేయుచు వచ్చుచున్నాడట.

ఇట్లు వినాయకుని రూపకల్పనా విశేషము లన్నియును తేట తెల్లముగా "తుండము నేక దంతమున" అను ఒక చిన్న పద్యంలో వివరింపబడినవి. పిల్లలకు పెద్దలకుకూడ ఆనందజనకమై సుబోధక మగునట్లు నిగూఢమగు భావములతో ఈ పద్యము వ్రాయబడినది. ఉన్నతములైన ఆధ్యాత్మిక భావములను సమన్వయించి చెప్పుట, చూపుటయే పద్యమందలి ప్రతిమా శిల్పమందలి నేర్పు. ఇట్లే హైందవ శిల్ప సంతతను నిగూఢత్వము సౌలభ్యము కూడగోచరించును దర్శన మాత్రముననే సామాన్యులనాకర్షింపుము భావించిన కొలది గూఢములగు విషయములను భోధించునటి స్వరూపములతో శిల్పకళ నిండియుండును

వినాయక వ్రతము హిందూ దేశ సంతతను ముఖ్యముగా వింధ్యకు దక్షిణ భాగమందు అబాలగోపాల మాచరింతురు. హైందవ విజ్ఞానము ప్రాకిన తూర్పు ఆసియా భాగములయందు చైనా, జపాన్ మొదలగు దేశములందు విఘ్నేశ్వరుడు దేవతగా ఏర్పడినాడు.

బ్రహ్మ చర్య దీక్ష సర్వజనులకు, సర్వదేశముల యందు, సర్వ కాలముల యందు, సర్వకార్య సిద్ధికొరకు, ప్రజానీకము యొక్క క్షేమ, లాభములకై అత్యంతా వలంబనీయమగు పరమ ధర్మము.

పుక్కిట పురాణాలే కావచ్చుగాక, మనవాళ్ళు వేరు వేరు సందర్భాలలో వినాయకుడికి ఆపాదించిన భిన్నగాథలు, స్వభావవైచిత్రి జనరంజకమైవినాయకుడిని ఆ బాలగోపాలానికీ చిన్ని కృష్ణుడి తర్వాత అంతట ప్రీతిపాత్రుడైన దేముడ్ని చేశాయి. తెలుగు వాళ్ళకు బాగా నచ్చే ఆకారం సరే — ప్రవర్తన రీత్యా కూడా అస్తవ్యస్తంగా అతి సహజంగా చిలిపిగా భాసించే వినాయకుడిని అందరూ ఇష్టపడుదురు.

# కాణిపాకం
# క్షేత్రమహాత్మ్య వివరణ

చిత్తూరు జిల్లాలోని కాణిపాకం గ్రామమునందు శ్రీ వరదరాజస్వామి ఆలయమునకు సమీపమున శ్రీ వరసిద్ధి వినాయక దేవాలయము కలదు. ఆ గ్రామములోని మిగిలిన రెండు ఆలయాలకు లేని పుష్కరిణి ఈ ఆలయానికి కలదు. ఆలయమునకు చక్కని ప్రాకారము కలదు. ఆలయ ప్రాంగణమున అడుగుపెట్టగానే ఎదురుగా అలంకార కళ్యాణమండపము, దానిపై భాగాన వినాయకుడు కనబడును. ఈ ఆలయానికి 45 అడుగులు ఎత్తుగల గోపురము కలదు. గోపురమున వినాయకుని ప్రతిమతోపాటు అనేక శిల్పములు కలవు.

గోపురమును దాటి లోపలికి వెళ్ళగానే ఎదురుగా ధ్వజ స్తంభము కలదు. ధ్వజ స్తంభానికి క్రింది భాగమున తూర్పున మూషికముపై వినాయకుడు, దక్షిణమున సుబ్రమణ్యస్వామి కలరు పశ్చిమమున శివశూలము కలదు. ఉత్తరమున వృషభారూఢ శివుడు కలడు. ముఖమండపము 28 అడుగుల పొడవు, అంతే వెడల్పు కల సమ చతురస్రము ఇందు 12 స్తంభములు కలవు. ఈ స్తంభములపై చెక్కబడిన అనేక శిల్పములలో వినాయక మూర్తులు, కోదండరాముడు ఆంజనేయుడు, శివలింగార్చనలు ఇత్యాదులు కనబడును. మండపము పైన పరచిన రాళ్ళపై నాగములు, మత్స్యములు చెక్కబడినవి.

ముఖమండప మందే అర్థమండప ద్వారమునకు ఉత్తర భాగమున కాల భైరవుని విగ్రహము, దక్షిణ భాగమున శ్రీ మహా విష్ణువు విగ్రహమును కలవు. ఈ విగ్రహముల స్థానములు ద్వారపాలకులవి శ్రీ కాలభైరవుడు వినాయక దేవాలయమునకు ద్వారపాలకులుగ నియమింపఁ బడుట విశేషము. ఇక ఆలయమందలి దేవుని చరిత్రను తెలుసుకొందము.

పూర్వ మీ గ్రామమున పుట్టుమూగి, పుట్టుగ్రుడ్డి పుట్టు చెవిటి యగు ముగ్వురు సహోదరులు ఒక కాణిమేర భూమిని సాగుచేసికొనుచు జీవించు చుండెడివారు. ఆ భూమిలో గల ఒక ఏతము బావి వారి వ్యవసాయమునకు జలధారముగ నుండెడిది. ఒక సంవత్సరము మహాక్షామ మేర్పడి బావిలో గల నీరు అడుగంటినది. ఉన్న కొద్ది నీటిని సేద్యమున కుపయోగించు కొనుచు ఒకనాడు వారలో నొకరు ఏతముపై నుండి గడ వేయుచుండగా, ఇంకొకరు బావిఅడుగున నిలబడి ఏతము కుండను నీటితో నింపుతు ఏతము సాగించు చుండ ఉన్న నీరయి పోయింది. పైన ఉన్న ఇసుకను కొంతతీసిన నీటిఊట అధికము కాగలదని తలచి బావిలో నున్న వ్యక్తి చేతి పారతో ఇసుకను తీసివేయుచుండగా ఒకసారి అతను వేసిన పాఱ ఇసుకలో నిక్షిప్తమైయున్న రాతికి తగిలి రక్తము చిందినది తత్ క్షణమే అతనికి, ఏతముపై నున్న వ్యక్తికి మఱొకనికి వారి వారి అంగవైకల్యములు తొలగిపోయినవి. గ్రుడ్డివాడు చూడగల్గెగా మూగవాడు మాట్లాడ గల్గెను. చెవిటివాడు వినగల్గెను. ఈ హఠాత్పరిణామమునకు వారు ఆశ్చర్య పడుచుండిరి. వారిని జూచి ఇరుగు పొరుగు జనము విస్మయము చెంది వారిని జేరిజరిగిన వృత్తాంతమును విని బావిలోనికిదిగి సావధానముగా పరీక్షి లించగా ఆ రాయి కేవలము రాయి కాదని అది వినాయకుని మూర్తి అని తెలినది. స్వామి శిరమునుండి కారిన రక్తము మడుగైనది. స్వామి రక్తపు మరకలతో వారు ఇరుగు పొరుగు గ్రామములకు వెళ్ళి యీ వృత్తాంతమును తెల్పగా తండోప తండములుగ ప్రజలు విచ్చేసి తమ తమ కోర్కెల తీర్చుటకై స్వయంముగా అవతరించిన స్వామికి వారు నారికేళములు సమర్పించి

కర్పూర హారతులొసగి మోదకముల నారగింపుగ పెట్టి తమ తమ భక్తి ప్రపత్తుల జూపించిరి. ఆనాడు వారు సమర్పించిన టెంకాయల నీళ్ళ కాణి మేర భూమిపై పారినవి. అప్పటి నుండి ఈ గ్రామ నామము కాణి పారకమై ఉచ్చారణ వేగమున క్రమముగ కాణిపాకమైనది.

అక్కడ వెలసిన స్వామి ఆవిర్భావమును గురించి గ్రామ పెద్దలు చెప్పెడి వృత్తాంత మిది. దీనికి నిదర్శనముగ అప్పటికిని స్వామి తలవెనుక భాగమున పారవేటుకు పగిలిన గుర్తు కలదు.

ఆవిర్భావము తోడనే పుట్టు మూగికి మాటలను, పుట్టు గుడ్డికి చూపును, పుట్టు చెవిటికి శబ్దజ్ఞానమును ప్రసాదించిన స్వామి మహాత్మ్య మద్భుతము, భక్తుల మనో రథములను సిద్ధింపజేసి, కోరిన వరముల నొసగి వరసిద్ధి వినాయకుడిని ప్రసిద్ధి వహించెను. సత్యమును, ధర్మమును నిల బెట్టుటకై స్వామి వెలసినట్లున్నది.

ఇతర దేవాలయములలో సాధారణముగ జరుగని ప్రమాణములు ఈ ఆలయమున విరివిగ జరుగుచున్నవి కోర్టులకు వెళ్ళినవారును, కొందరు ఈ దేవాలయమున ప్రమాణము చేసి సత్యాసత్య నిర్ణయమును ఈ స్వామికే వదలి కోర్టుల నుంచి ఉప సంహరించుకొనిరి. ఈ ఆలయమున జరుగు ప్రమాణముక బెంత విలువయున్నది. రోగపీడితులు, సంతానము లేని వారు ఈ ఆలయమునకు ప్రదక్షిణములు చేసి, స్వామి నర్చించి సఫల మనోరథులై సుఖజీవితమును గడుపుచున్నారు.

# 3

# నండూరి బాపయ్య జీవిత విశేషాలు

విఘ్నేశ్వర చరిత్రమను పేరుగల రెండాశ్వాసముల ప్రబంధమును రచించినది నండూరి బాపయ అనుకవి. ఇతను క్రీ.శ. 19వ శతాబ్ద పూర్వార్థమున ప్రోలు నాటిలో నివసించిన నియోగి బ్రహ్మణుడు. శ్రీ వత్సగోత్రుడు తండ్రి వెంకమంత్రి తల్లి బుచ్చిమాంబ, ఇతని ముత్తాత వెంటూరి సోమేశ్వరుని భక్తుడగుట చేత, బాపయ తన ప్రబంధమును ఆ సోమేశ్వరునకే అంకిత మొనర్చుట చేత వీరి నివాసము వెంటూరుగాని, ఆ పరిసర ప్రాంతముగాని కావలయును. బాపయ తన ముత్తాతను లోకాతీత విశద విఖ్యాత యశస్కుడు''గా పేర్కొనెను ఆయన పేరు నండూరి కామరాజు. ఇతనిని ఏనుగు లక్ష్మణకవి తన జాహ్నవీ మహాత్మ్యములో పేర్కొనినాడు. ఈ కామరాజు లక్ష్మణకవిని ప్రోత్సహించి జాహ్నవీ మహాత్మ్యమును వ్రాయించి వెంటూరి సోమేశ్వరునకే అంకిత మిప్పించినాడు. "నండూరి కామరాజు గారు ఆ రోజులలో కాకినాడ శలపాక మహాళ్ళకు స్థలపతిగా ఉండేవాడు. చాలామందికి పోషకుడు'' అని శ్రీ ఆరుద్రగారు వ్రాసిరి (-సమగ్రాంధ్ర సాహిత్యము; 12వ సంపుటము)

కామరాజు కుమారుడు బాపయ ఇతను "భూసుర నివహ బంధు వ్రాత పరిపోషకుడు" ఇతని కుమారుడు వెంకమంత్రి 'సేతు కాశీతల మధ్య భూవిభుసభా పూజ్యుండు' వీరిరువురు కృతులు రచించినట్లుగాని, కవులను ప్రోత్సహించినట్లుగాని కనబడదు. వెంకమంత్రి తన కుమారునకు 'బాపయ' అని తండ్రి పేరునే పెట్టెను.

బాపయ "శ్రీ మద్దక్షిణామూర్తి వరప్రసాద లబ్ధ కవితా మాధురీ ధురీణుడు'' ఇతను రచించిన కృతులు రెండు ఇవి శ్రీరామ చరిత్రము విఘ్నేశ్వర చరిత్రము శ్రీ విఘ్నేస్వర చరిత్ర రచనా కాలము క్రీ శ 1816 ఈ విషయమును బాపయ విఘ్నేశ్వర చరిత్రమున తెలి...కు రెండవ కృతి రచనా కాలమును కూడ దానియందు తెలిపి యుండవచ్చును. కానీ శ్రీరామ చరిత్రమునకు శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయు ప్రాచ్య

పరిశోధనాలయమున గల ఏకైక తాళపత్రప్రతి అసంపూర్ణ మగుటచే దాని రచనాకాలము తెలియకున్నది. ఈ రెండు కృతులందును. సమానములగు పద్యము లనేకము గలవు. ఏ కృతి మొదటిదో రెండింటను తెలుపలేదు. కాని శ్రీరామ చరిత్రమున పేర్కొనని పినతండ్రి కొడుకును విఘ్నేశ్వర చరిత్రమున పేర్కొనుట గమనించిన విఘ్నేశ్వర చరిత్ర అర్వాచీన రచన యని భావించవచ్చును.

అంతేగాక విఘ్నేశ్వర చరిత్ర కావ్యమున గల చక్రబంధము అరవ వలయమున 'రామిస్వామికృతం' పదముకూర్పబడినది ఈపదము బాపయ రచించిన ఆ పేరుగల వేరొక రచనను గురించి కాక, శ్రీరామ చరిత్రను గురించియే ప్రయోగింప బడినచో శ్రీరామ చరిత్రమే బాపయ ప్రథమ చర యని స్పష్టమగును.

పూర్వాంధ్ర కవిస్తుతి విఘ్నేశ్వర చరిత్రమున కవిత్రయమునకే పరిమితము చేయుబడినది. శ్రీ రామ చరిత్రమున కవిత్రయముతో పాటు పోతన, బాస్కరుడు, శ్రీనాధుడు, సూరన, వేములవాడ భీమకవి, ఏనుగు లక్ష్మణకవి, కూచిమంచి జగ్గకవి, జగ్గకవి కూడ నుతించబడిరి.

బాపయ ఎడవల్లి లక్ష్మణుని తన గురువుగా పేర్కొనెను. ఈ ఎడవల్లి లక్ష్మణుని గురించి బాపయ వ్రాసిన దానికన్న విశేషములు తెలియవు. శివ రహస్య ఖండమును రచించిన కోడూరి వేంకటాచల కవికి విద్యా గురు వయిన ఎడవల్లి వేంకటకవికి, ఇతనికి సంబధము కలదేమో ! బాపయకు దామరాజు వేంకట ప్రధాని 'ప్రాణ సమానాప్తుడు'

విఘ్నేశ్వర చరిత్ర కృతికర్త వెంటూరి సోమేశ్వరుడు ఈ సోమేశ్వరుడు స్వప్నమున సాక్షాత్కరించి విఘ్నేశ్వర చరిత్రను తనకు అంకితమిమ్మని కోరినటుల కవి చెప్పుకొనెను.

వెంటూరు అను గ్రామము తూర్పుగోదావరి జిల్లా రామచంద్ర పురమునకు స మీ ప ము న కలదు. ఇచ్చట సోమేశ్వరాలయము అష్ట సోమేశ్వరాలయములలో ఒకటి దాక్షారామమున గల భీమేశ్వరాలయమునకు ఎనిమిది దిక్కులలోను ఈ సోమేశ్వరాలయములు కలవు. వీటి చరిత్రకు సంబంధించిన రెండుకథలను శ్రీయుతులు డా॥ వడ్లమూడి గోపాలకృష్ణయ్య గారు దహరించిరి అవి

సూర్యుడు దాక్షారామ భీమేశ్వరుని ప్రతిష్ఠించి ప్రథమార్చన చేస్తున్నాడు ఈ సూర్యుని తీక్షణతకు దేవతలు ఋషులు భయపడి స్వామిని సేవించలేక చంద్రుడిని ప్రార్థించారు అప్పుడు చంద్రుడు స్వామికి అష్ట దిక్కులలోను శాంతిలింగాలను ప్రతిష్టించి చల్లపరిచాడు ఈ అష్టక్షేత్రాలు చంద్ర ప్రతిష్ఠితాలవ్వడంవల్ల సోమేశ్వరాలని పేరువచ్చింది. తూర్పున 'తనుమళ్ళ' దక్షిణాన 'కోటిపల్లి' – పశ్చిమాన 'సోమేశ్వరం' – ఉత్తరాన 'వెళ్ళ' - మూలలలో వెంటూరు - 'దంగేరు' - 'సంపర' – 'భీమేశ్వరం' స్థలాలలో సోమేశ్వరాలాయాలు నిర్మితాలయ్యాయి వీటిని అష్టసోమేశ్వరాలంటారు

పై కథకు భిన్నంగా అష్ట సోమేశ్వరాల గురించి మరొక కథ కూడా ప్రచారంలో. అది యిది.

దాక్షారామ భీమేశ్వరుడు తేజోమయమైన లింగమవడం చేత సప్త మహర్షులు కూడ దానిని సమీపించడానికి భయపడి ఆస్వామి నభిషేకా-దులతో అర్చించడానికి గోదావరీ ఉదకం తేవాలని వెళ్ళారు వారు ఉదకంతో తిరిగి వచ్చేసరికి దైవ ముహూర్తం దాటిపోయి రాక్షస ముహూర్తం వస్తుందనీ అవిధంగా జరిగితే స్వామిని అర్చించడానికి రాక్షసులే అర్హులవుతారు గాని దేవతలు అర్హులుగారని ఆలోచించి దైవ ముహూర్తం మించకముందే సూర్యుడు కైలాసానికి వెళ్ళి మహేశ్వరుణ్ణి దాక్షారామానికి తోడు తెచ్చి స్వామి సన్నిధానంలో భీమేశ్వరుణ్ణి తానే ప్రథమంగా అర్చించాడు

అనంతరం జరిగిన విషయాన్ని సప్త మహర్షులు సూర్యుని వల్ల తెలుసుకొన్నారు అయితే సప్తర్షులు తాముస్వామిని అర్చించు దామని ప్రయత్నించి స్వామి తేజస్సు దుస్సహంగా ఉండడం వలన తమకార్యం నిర్వర్తించలేక పోయారు. "స్వామిని శాంతింప చేసి" తాము అర్చించే అవకాశం కల్పించ వలసినదిగా సప్తర్షులు సూర్యుని ప్రార్థించారు, అపుడు సూర్యుడు చంద్రుణ్ణి పిలిచి స్వామికి అష్టదిక్కులలోనూ శాంతి లింగాలను స్థాపించ వలసినదిగా చెప్పాడు. కాగా చంద్ర నిర్మితాలై ఈ సోమేశ్వరాలయాలు వెలిశాయి.

—ఆరాధన పత్రిక; మే – 1972.

# 4

# నండూరి బాపయ విఘ్నేశ్వర చరిత్ర - రచనావిశేషాలు

# శైలి

శైలి అను తెలుగుపదము 'Style' అను ఆంగ్ల పదమునకు సమానార్థకముగా వాడబడుచున్నది. ఒక కవి తన మనోగత భావములను వెలువరించు విధమును ఆ కవి శైలిగా చెప్పవచ్చును. 'Style' అనే పదము 'Stylus' అనే పదము నుండి పుట్టి ఉండాలి. Stylus అనేది ప్రాచీన రోమన్ దేశీయులు మైనపు బట్టలమీద రాసేదానికి ఉపయోగించే వాడి మొనగల అనుప గంటంలాంటి సాధనానికి పేరు ఉర్దూ పారశీక భాషలలో కలాం అంటే కవిత అని అర్థమట తెలుగులో రాసేదానికి ఉపయోగించే సాధనం కలం శబ్దసామ్యం కల Style, శైలి అనే పదాలు సమానార్థక పదాలే కానీ వీటికి జన్య జనక సంబంధం లేదు, శైలి కావ్యమునందలి ఏదో ఒక అంశమునకు చెందినది గాక సర్వాంశములకు సంబంధించినదిగా భావింపవచ్చును.

శైలి అనునది శీల ధాతు నిష్పన్నమని చెప్పుమా డా। పాటిబండ మాధవ శర్మగారు శీల ధాతు నిష్పన్నము లయిన శీలము శైలి, శిల్పము తరతమ భావమున నేకార్థములే అనంత జన్మాభ్యాస సంస్కారము శీలము శీలమే స్వార్థమున శైలియగును. ఇహ జన్మాభ్యాస సంస్కారము శిల్పము మహర్షులయందు శీలమైనది మహాకవులయందు శిల్పమగు చున్నది. అప్రయత్నఫలసిద్ధి శీల మూలకము. సప్రయత్న ఫలసిద్ధి శిల్పమూలకము అని నిర్వచించిరి. శీలమే స్వార్థమున శైలియగుటచే కవి వ్యక్తిత్వము లేక చిత్త సంస్కారము శైలి యగును..

— ఆంధ్రమహా భారతము - ఛందఃశిల్పము : పుట - 6

మన ప్రాచీనాలంకారికు లెవ్వరును శైలి శబ్దమును ప్రయోగించలేదు రీతి శయ్య మొదలగు పదములను పేర్కొనిరి. శైలి ఒక రీతిని

గూర్చి తెలుపును. ఒకడు 'Style'గా నడుచు చున్నాడనుమాట వాని యొక్క నడకలో ఉన్నరీతిని గూర్చి తెలుపుచున్నది. శ్రీనాథుడు చెప్పిన "నిజము నా కవిత్వంబు కర్ణాట భాష" అను వాక్యములలో కర్ణాట భాష అనగా కర్ణాట శైలి అని పింగళి లక్ష్మీకాంతం గారు అర్థము చెప్పిరి.

— ఆంధ్ర సాహిత్య చరిత్ర : పుటలు 54-55

పై మాటలను బట్టి శైలి కవి వ్యక్తిత్వ సంబంధి అనియు కావ్యము నందలి సర్వ విషయములకు సంబంధించిన దనియు తెలియుచున్నది. కవి తన మనస్సు ననుసరించియే కదను నిర్వహించును. అలంకారములను ప్రయోగించును ఊహ చేయును పద్యరచన, సమాసఘటన మొదలైనవి కూడా అట్లే

ఏదైనా ఒక కావ్యమునందు రెండు లక్షణములు ప్రధానముగా కనబడును అందు ఒకటి శబ్దము, రెండవది యర్థము. అర్థమును విభజించి అనేకమంది చెప్పారు శబ్దమును గురించి చాలా తక్కువ చెప్పబడింది శైలి, పాకము రీతి ఈ మూడు మాటలతో శబ్దమును గూర్చి సూచింపబడినది, ఔచిత్యము, ధ్వని వక్రోక్తి అలంకారములను గూర్చి వివరంగా చెప్పబడినది రసములు వానిలో మిశ్రములు, అమిశ్రములు వీనిని గూర్చి కూడ స్థూలముగ చెప్పబడినవి.

శబ్దములు లేకుండా వాక్యము లేదు అన్వయము లేకుండ వాక్యము లేదు. ఈ అన్వయము ప్రాథకవులలో కొన్ని చోట్ల నధ్యాహారము చేసుకొన్న గాని కుదరదు. మహాకవుల కావ్యముల యొక్క సూక్ష్మ పరిశీలన మవసరము. శబ్దములు ఒకటి మొదలు ఆరు ఏడు, ఎనిమిది అక్షరముల వరకు కూడిక కలిగినవి ఉన్నవి ఆ శబ్దములను కవి సృష్టించలేదు. కొన్ని శబ్దములు వ్యాకరణ సూత్రముల వలన ఏర్పడుచున్నవి. ఎట్లయినను ఆ శబ్దములను మనము ఉచ్చరించు చున్నాము.

శైలి పదానికి నిఘంటువులు చెప్పిన అర్థాలివి.

1. ''Manner of acting or living practice''
(A Sanskrit-English Dictionary, M. Momier williams)
2. 'Method'
(Hindi - English Dictionary ; Edby Mahendra-) chaturvedi & Bholanath Tawar.
3. సంకేతం, పరిభాష, శాస్త్రీయ వ్యవహారం (ఆంధ్రదీపిక)

మన ప్రాచీనులలో శైలి అనే పదాన్ని ప్రయోగించిన వారు మను స్మృతి వ్యాఖ్యానం చేసిన కుల్లూక భట్టు "ప్రాయేణా చార్యాణా మియం శైలీయుతా వ్యభిప్రాయ మపి పరోపదేశ మివ వర్ణయంతి" (-1వ అధ్యాయము; 4వ శ్లోకము) ఈ శైలి అనే పదాన్ని ఇంతకన్నా పూర్వం వాడినప్పటికీ అది ఇప్పటి ఆధునిక కవి విమర్శకుల శైలి అను అర్థంలో వాడినట్లు కనబడదు.

శ్రీనాధుడు తన రచనయైన శృంగార నైషధ కావ్యంలో "ఒప్పిదపు శైలి పఠింతురు ప్రౌఢ భామినుల్" అని శైలి పదాన్ని ప్రయోగించారు. ఒప్పిదపు శైలి అనే పదానికి వేదం వేంకట్రాయ శాస్త్రిగారు మనోహర ప్రకారమని అర్థం చెప్పారు. పైన పేర్కొన్నటువంటి విషయమును బట్టి శైలి అంటే ప్రకారం, విధానం, రీతి అని చెప్పవచ్చు.

# శైలి నిర్వచనం

శైలి అనే పదాన్ని కవులు, వ్యాఖ్యాతలు అరుదుగా ఉపయోగించారేతప్ప ఆలంకారికు లెవ్వరూ నిర్వచించలేదు.' కావ్యత్వసిద్ధి హేతుకమైన విశిష్ట శబ్దవిన్యాసం శైలి' అనిచెప్పవచ్చు కావ్యత్వసిద్ధి అంటె హేతుకమైన సౌందర్యము అని డా॥ టి. కోటీశ్వరరావుగారి అభిప్రాయము.

ఒక భాషా వ్యవహారంలో ప్రతి వ్యక్తికీ వర్ణక్రమం, పదజాలం, వ్యాకరణం ఈ మూడు అంశాలూ ఒకే రకమైన పద్ధతిలో అవగత మవుతాయన్నది నిజమే. అయినా వ్యక్తికీ, వ్యక్తికీ మధ్య అవి అన్నీ ప్రత్యేకమైన ఉపయోగ ప్రాచుర్యానికి (Fxequency of use) లోబడి ప్రవర్తిస్తాయన్నది మనం గుర్తించవలసి ఉంటుంది.

శ్రుతి సుభగత కలిగిన నాదవంతమైన వర్ణాలను ఎన్నిక చేసుకునే వ్యక్తి శ్వాసాక్షరాలనూ, మహాప్రాణాలనూ తనకు తెలియకుండానే పరిహరించడం జరుగుతుంది అలాగా ఆటువంటి వర్ణాలతో కూర్చబడిన పదాలను గ్రహించక పోవడం జరుగుతుంది అదేవిధంగా చిన్న వాక్యాలను కూర్చటం అలవాటయిన వ్యక్తి తన రచనల మొత్తంలో పెద్ద వాక్యాలు రాయకుండా జాగ్రత్త పడడం జరుగుతుంది. ఇదే ఒక రచయితకూ, మరో రచయితకూ మధ్య ప్రత్యేకతను నిలబెట్టేనియతి ఈ నియతి ఇద్దరు రచయితల మధ్యనయినా ఇంచు మించు ఒకే రకంగా కనిపిస్తే వారిద్దరి శైలీ ఒకటే అని నిర్ణయించడానికి వీలుంటుంది

శైలీ విషయంలో ఈ రకంగా కవులు చేసుకునే ఎంపిక (Choice) అలా ఉండగా, దీనికంటె భిన్నంగా కవియొక్క ఎంపికతో ప్రమేయం లేని ఘటన (Chance)కు కూడా అతని శైలి నిర్మాణంలో కొంత ప్రాధాన్యం

ఉంది కవి తన కవితా వాహికగా గ్రహించే ఛందో వైవిధ్యాన్ని బట్టి ఈ ఘటన ఏర్పడుతుంది. ఉదాహరణకు ఉత్పలమాల రాయవలసి వస్తే పాదం మొదటి నాలుగక్షరాలలో మొదటిదీ, నాలుగవదీ గురువులు కాక తప్పదు అదే చంపకమాల అయితే నాలుగూ లఘువులు కావలసిందే. ఘటన అంటే ఇటువంటి అవసర పరిస్థితి కాబట్టి ఒక కవి శైలిని నిర్ణయించేటప్పుడు అతని ఎంపికతోపాటు ఘటనను కూడా ముఖ్యంగా గుర్తిస్తేనే కాని న్యాయం చేకూరినట్లు కాదు. పై మాటలను బట్టి శైలి కవి వ్యక్తిత్వ సంబంధి అనియు కావ్యమునందలి సర్వ విషయములకు సంబంధించిన దనియు తెలియుచున్నది.

విఘ్నేశ్వర చరిత్రము ప్రబంధము కనుక కథా కథన దృష్టి ప్రధానముగా గల పురాణశైలిగాని, లౌకికోక్తులను పరిహాస మొనర్చు లౌకికశైలి గాని ఇందుండుటకు వీలులేదు. డా॥ జి వి సుబ్రహ్మణ్యంగారు "ఆంగ్ల సాహిత్యశైలీ వర్గీకరణలోని ' Florid style ' శబ్దార్థాలంకార సహితమగు ఆడంబర శైలియగుటచే ప్రబంధముల యందిట్టి శైలి యుండునని" నిర్ణయించిరి.

— ప్రథమాంధ్ర మహా పురాణము : పుట–384.

ప్రక్రియా వైవిధ్యము బట్టి రసానుకూలముగా ఈ శైలి మారుచుండును. పౌరాణికము, ప్రాబంధికము, నాటకీయము, దేశీయము అని శైలి వివిధములై యుండును.

# ఇతి వృత్త నిర్వాహణ - కథాకథనం

బ్రహ్మ సృష్టికి ప్రతి సృష్టి చేయగలవాడు కళాకారుడు బ్రహ్మ సృజించిన ప్రకృతిలోనైన వంకలుండు నేమోగాని ఉత్తమకళాకారుని సృష్టిలో మాత్రము ఏ లోపమును ఉండరాదు. అంతేకాదు బ్రహ్మ సృష్టి కాల నియతికి లొంబడినది కళాకారుని సృష్టి శాస్వతమైనది. ఎనాడో కనుమరుగై పోయిన శ్రీరామ కృష్ణాదుల దివ్య సౌందర్యమును మన కన్నులకు తోచునట్లు చేయువాడు కళాకారుడు. ఒకవేళ శ్రీరాముడే మన కన్నుల యెదుట దోచినను మన కళాకారులు చిత్రించిన రూపురేఖలు అతనియందు కానరాకున్నచో అతని యాథార్థ్యమును మనము సందేహింతుము. అంతగా కళాకారుడు మన హృదయమును చూరగొనును. శిల్పి, చిత్రకారుడు బాహ్య రూపమును సహజ సుందరముగ సృష్టింతురు రవివర్మ వంటి ఉత్తమ చిత్రకారుడు తన చిత్రములలోని పాత్రల మనోగత భావములు గూడ సువ్యక్తము లగునట్లు చిత్రింపగలడు అజంతా, ఎల్లోరా మున్నగు చోట్ల గల చిత్రములు. శిల్పములు కూడ ఇటువంటివే.

ఉత్తమ కవి రసవంతములగు పదముల కూర్పుతో విశిష్ట భావములతో రమ్యములగు అలంకారములతో ఆయా పాత్రల మనస్తత్వములను బావములను చక్కగా వర్ణించుచు వాని బాహ్య సౌందర్యమును కూడ కన్నులకు కట్టినట్లు వర్ణించును.. కావ్యములు ఆయా పాత్రల విశిష్ట గుణములకు, స్వరూపములకు శాస్వతత్వమును కల్పించుటతో బాటు వానినాదర్శముగ గొని మనకై మనము మన ప్రవర్తనల భావనల దిద్దుకొనగలుగు నంతగా మనమీద తమ ప్రభావమును ప్రసరింప జేయును శ్రీ కృష్ణ దేవరాయల పేరు విన్నంతనే అతని యెడ మనకు అపర భావము కలుగుటకు కారణము అల్లసాని పెద్దన, నంది తిమ్మన మున్నగు కవీశ్వరులన్నచో అతిశయోక్తి కాదు కదా!

బ్రహ్మ సృష్టిలో బీజ ప్రాయముగ ఆయా చేతనుల హృదయ ములందు వాసనా బలమున అంతర్గతములై యున్న దివ్య భావనలకు దోహదము కల్గించి వికాసము గూర్చి ప్రకాశింపజేయగలవాడు కళాకారుడు కావుననే లోకులకు దివ్య పథమును ప్రదర్శింపదలచి బ్రహ్మ స్వయముగను తన మానస పుత్రుడైన నారదుని మూలమునను, వాల్మీకి, వ్యాసులను ప్రోత్సహించి వారిచే ఇతిహాస పురాణములను వెలయింప చేసెను.

కారణ జన్ముడైన త్యాగరాజును నారదాను గ్రహ లబ్ధమైన సంగీత జ్ఞానముతో పండిత పామరజన హృదయా కర్షకములైన గేయములలో ఇతి హాస పురాణములలోని సారత మాంశములను పాను భవమైన భగవదను భవానందంతో మేళవించి లోకులకు అందింపదలచెను. కావున తన రచన లలో వినాయక, శ్రీకృష్ణ సౌందర్య గుణ మహిమాదులను సహజ సుందర ముగ అభివర్ణించుచు అతని అనుగ్రహ భాగ్యమునకు నోచుకున్న వినాయ కాది పాత్రలను అనన్య ప్రతిభా విశేషములతో చిత్రించెను.

విఘ్నేశ్వర చరిత్ర కావ్యంలోని నండూరి బాపయ రచనా విధానాన్ని క్రింది విధంగా పరిశీలించవచ్చు నండూరి బాపయ కూడ పూర్వీకుల వలె తన కావ్యంలో పూర్వ కవుల రచనా విధానాన్నే పాటించినట్లు తెలియు చున్నది. ఇష్ట దేవతా ప్రార్థనలో నండూరి బాపయ తన మొట్ట మొదటి పద్యంలో కావ్య కృతి కర్తయైన వెంటూరి సోమేశ్వరుని కొనియాడారు.

"శ్రీ నగజా కుచ స్తబక చిత్రిత కుంకుమ పంక సమ్మిళ
త్పీన విశాల వక్షుని సుధీ జనరక్షుని సేవ కాముకం
పానిధి నారదాది సురమౌని మనోంబుజ మత్త బంభరున్
మానస వీధి గొల్తు నసమానుని వెంటూరి సోమనాథువిన్"

— విఘ్నేశ్వర చరిత్రము : 1-1

అని తన కావ్య కృతి కర్తయైన వెంటూరి సోమేశ్వరుని మాత్రమే కొనియాడారు.

రెండవ పద్యంలో పార్వతిని కొనియాడారు. ఇందులకు కారణం లేక పోలేదు. కావ్యము విఘ్నేశ్వరునికి సంబంధించినది కావున అతని (విఘ్నేశ్వరుని) తల్లియైన పార్వతిని కొనియాడుట సహజమని భావించి రెండవస్థానం కల్పించవచ్చు. మరియు ఈ విధంగా రెండవ పద్యంలోనే పేర్కొనుట అతని దేవతాప్రార్థనకు కూడా సుముఖుడై రచించి ఉండవచ్చు ఇతను పార్వతిని "వసుధాధర రాజకుమారి గౌరి శాంకరికరి వక్త్రుతల్లి" అని గొప్పగా చెప్పాడు. ఇటువంటి సుగుణ రాశియైన పార్వతి తల్లి మాకు శుభోన్నతులు కలిగింప చేస్తుంది అని చెప్పుకొన్నాడు.

తన రచనలో మూడవ పద్యంలో శ్రీ కృష్ణుని కొనియాడెను. శ్రీ కృష్ణుని నల్లని దేవుడని సంభోధించి రచనా గావించెను. ఆ నల్లనిదేవుడు గూడ ఎటువంటి వాడో చెపుతూ వేడుకతో స్నేహితులతో కూడి బృంద యన్వనమున ఆవుల కాచుకొను నల్లని దేవుడు మాకు సహాయపడతాడని కొనియాడారు.

క్రింది పద్యంలో తన పూర్వులంపరినీ కూడ ఇష్టదేవతా ప్రార్థన తర్వాత కొనియాడినట్లు తెలియును.

"ప్రాచేతసుని పాద పద్మములకు మ్రొక్కి
వ్యాస భట్టారకు నభి నుతించి
జయదేవునకు నమస్కారంబు గావించి
కాళీదాసునకును గేలు మోడ్చి
దండ ప్రణామముల్ దండికి ఘటించి
భవభూతి నెంతయు బ్రస్తుతించి
శ్రీ హర్షు కవితా విశేషంబు గొనియాడి
చోరున కెలిమి జోహారొనర్చి

భారవిని సన్నుతించి మయూరు దలచి
బాణునకు మ్రొక్కులిడి శివభద్రు బొగడి
మదిని భోజుని దలపోసి మాఘు నెఱిగి
మఱియు గీర్వాణ కవుల నెమ్మది భజించి''
— విఘ్నేశ్వర చరిత్రము ; 1-8

అని పై పద్యంలో తనకన్నా పూర్వీకులైన ప్రాచేతసుని (వాల్మీకి) పాద పద్మములకు మొక్కి అనియు, వ్యాస మహర్షిని, జయదేవుని, కాళిదాసునకును, దండిని, భవభూతిని, శ్రీ హర్షుని, భారవిని, మయూరుని బాణుడిని, శివభద్రుని, భోజుని, మాఘుని మఱియు గీర్వాణ కవులను ప్రస్తుతించాడు.

తరువాత పద్యంలో తెలుగు భారతమును అనువదించిన కవిత్రయమును కూడా కొనియాడారు తర్వాత పద్యంలో తన గురువైన శ్రీ యడవల్లి లక్ష్మణ సమాఖ్యాన్ గొల్తున్ అని తనగురువును కూడా కొనియాడినట్లు రచించాడు.

పై విధముగా బాపయ తన కావ్యంలో యిష్ట దేవతా ప్రార్థనంబును పురాతన మహాకవి వర్ణంబును, గురు వందనంబునుం, కుకవి నిందనంబును గావించి విఘ్నేశ్వర చరిత్రంబను ప్రఖ్యకథా విధానంబు సుకవి జనానుగ్రహంబున నానేర్చిన తెఱంగున సకల జన మనో రంజనంబుగా ప్రబంధం బొనరింప అని పేర్కొన్నాడు ఆ సమయంలో తనకు వెంటూరి సోమలింగం స్వప్నమున సాక్షాత్కరించి అతనిని చూచి వారియొక్క వంశమును కొనియాడినట్లు పేర్కొన్నాడు

నీ తాత తండ్రి లోకతీత విశద విఖ్యాత యశస్కుండు కామరాజు
నీ తాత భూసుర నిహ బంధు వ్రాత పరిపోషకుండు బాప ప్రధాని

నీ తండ్రి సేతుకాశీతల మధ్య భూ
　　　　విభు సభా పూజ్యుండు వెంకమంత్రి
నీ తల్లి భువన వర్ణిత దాన ధర్మ ప్ర
　　　　ఖ్యాత గుణాలంబ బుచ్చమాంబ
నీ వనేక భవార్జిత నిశ్చలాస్మ
దీయ పదభక్తి సంజాత దివ్య సుకృత
వాసనా వాసితుడవు శ్రీ వత్సగోత్ర
పావనుడ వెన్న నండూరి బాపమంత్రి"

— విఘ్నేశ్వర చరిత్రము : 1 - 16

అని తన వంశాన్ని కొనియాడినట్లు రచించాడు.

ఈ విధంగా స్వప్నమున సాక్షాత్కరించిన వెంటూరి సోమేశ్వరుడు వారి వంశమును పొగిడిన తర్వాత నీవు రచించుట్టి విఘ్నేశ్వర చరిత్ర మా కంకితముగా చేసినయెడల నీకు అభీష్టితార్థసిద్ధియు, భువన విదిత విఖ్యాతి కలుగునని పలికి ఆ పరమేశ్వరుండు మరుగుపడిన తర్వాత మేల్కాంచి పరమేశ్వరుని చూడగలిగితిని అంతకంటె శుభము కలుగునది వేరొకటి యుండదని ఊహించుకొన్నట్లు రచనా గావించాడు.

మరియు అల్ప విద్యా సమేతుడనైన నాయొక్క వచన రచనలు వేదాంతములతో కూడుకొన్న వర్ణనీయ చరితుడగు శంకరుని కటాక్షంబు కలుగుట అనునది ఇనుముపై పరుసము ప్రయోగించినట్లు కాదు కదా అని ఊహించుకొని పరమానందమును పొంది రచన గావించాడు. ఎక్కడ పరుసమును తగిలిన ఇనుము కూడ విలువైన లోహముగా మారుతుందని ఊహించుకొని తను అల్ప విద్యా సమేతుడనైనను తనయొక్క ఇష్టదేవత అనుగ్రహము లభించుట వలన ఆతడు ఉత్తమమైన రచన చేయగలనని భావించుకొని పరమానంద భరితుడై తన కావ్యంలో ఇష్టదేవతా ప్రార్థన, పూర్వ కవి స్తుతితో పాటు షష్ఠ్యంతములను కూడా రచించెను.

ఇష్టదేవతా ప్రార్థనతో పాటు పురాతన మహాకవి వర్ణంబును, గురు వందనంబును, కుకవి నిందనంబును గావించి విఘ్నేశ్వర చరిత్రను రచించుటకు పూనుకొన్నాడు. పేరునకిది విఘ్నేశ్వర చరిత్రయే కానీ ఇందు ప్రబంధ లక్షణాలతో కూడు కొన్నట్లు రచనా పద్ధతిని పాటించడం విశేషం. ఇది క్షేత్ర మహత్మ్య కావ్యముగా పరిగణించ వలసియున్నది ప్రబంధ లక్షణాలు కూడా ఉండడం వల్లను, కవి తన రచనలో ప్రబంధంబు అని పేర్కొనుట వల్లనూ దీనిని ప్రబంధ కావ్యముగా పరిగణించవచ్చు బాపయ తన రచనలో షష్ఠ్యంతములను పేర్కొన్న తర్వాత విఘ్నేశ్వర చరిత్ర కథారంభమును తెలుపుతూ మొదట నైమిశారణ్య వర్ణనము గావించాడు.

నైమిశారణ్య వనంలో శౌనకుండను మునీంద్రుడు మొదలగు వారు అత్యంత శ్రద్ధతో ద్వాదశాబ్ద సత్రయాగం చేసినట్లును, అచ్చటికి విచ్చేసిన సూతుణ్ణి శౌనకాది మహామునులు పూజించి ఆతనిని ప్రసన్నుని చేసి అతనికి అర్ఘ్యపాద్య విధలొసగి మరియు అనేక విధముల ప్రార్థించి ఆతని వలన నిఖిల పురాణ కథా విధానంబులం ప్రవర్తిల్లుచు ఒక్కనాడు ఆమహానుభావునకు శౌనకాది మహామునులు ఇట్లనిరి అని రచించి మొదటగా విఘ్నేశ్వర చరిత్ర కథా వృత్తాంతమును తెలుపుతూ "శౌనకాదులు సూతుని గణేశ్వర వృత్తాంత మడుగుట" అను కథాంశముతో తన కావ్యములో కథారంభము గావించాడు. తరువాత శివుడు గజాసురుని సంహరించిన విధానము తెలుపబడింది ఇక్కడ గజాసురుని సంహరించిన విధానము స్కాంద పురాణంలో వలె రచించాడు. స్కాంద పురాణంలో గజాసురుడు తన చర్మమును పరిధానంగా ధరింపుమని శివుని కోరినట్లు మరియు వేరొక జన్మలో తనను గణపతిగ చేయుమన్నట్లును కలదు. స్కాంద పురాణంలో వలె గజాసురుని శిరమును ఖండించి అతని తలను గిరవర నందనుకు చూపుటకై వెడలినట్లు రచించాడు ఈ ఘట్టమును బాపయ క్రింది విధంగా పురాణ పద్ధతిలో వర్ణనాత్మకంగా రచించాడు.

"ఇవ్విధంబున సకల లోకంబులకు సంతోషంబుగ గజాసురుండు తెగిన సర్వగీర్వాణులు శర్వుం బ్రశంసించి రంత కాంతకుండు గజాసురుని యజినం బొలిచి సుగంధ బంధురంబును నిగనిగ జిగా జిగియును దగునట్లుగా నొనరించి పరిధానంబుగా ధరియించె. నాటినుండి శంకరుండు కృత్తి వాసుండన జగంబుల పొగడ నెగడె, నవ్విధంబున గజాసురుం దునిమి తదీయ శిరంబు గిరివర నందనకుం జూపు కొఱకు శూలంబునం గీలించి సకల జగజ్జేగీయమానుండై దేవ వాహినీ పరివృతుండై మరలి పరమానందంబున గజశంకరుడు కైలాసంబునకుం జనుదెంచు చుండె నంత నిట గౌరీ మహాదేవి యభ్యంజన స్నానం బొనర్చుచు గాత్రను లేపావశిష్ట హరిద్రా పిష్టంబుననొక శిశువుం గల్పించి యతని యుండశక్తి శౌర్యధైర్యంబులను బ్రాణ ప్రతాపంబులుం బ్రతిపాదించి నేను స్నానం బొనరించి వచ్చునంతకు నంతఃపురమున పురుషులం జొరనీకుమని తెల్పి తదీయ గృహ ద్వారంబున నతని నిలిపి ప్రమదావనంబున సఖీజన పరివృత్తియై జలకేళీ కుతుక పరాయత్త చిత్తంబున నుండె" అని పురాణ పద్ధతిలో రచించాడు.

— విఘ్నేశ్వర చరిత్రము : 1-65

దేవాది దేవతలతో కలసి మందిరము లోనికి వచ్చుచున్న శివుని ఆ బాలుడు అడ్డుకొన్నాడు. శివుడు తన పాశుపతాస్త్రముతో ఆ బాలుని శిరమును ఖండించగా, పార్వతి ఆ విషయమును విని ఆగ్రహించినట్లు పురాణ ధోరణిలోనే రచన సాగించాడు. తిరిగి శివుడు పార్వతిని ఊరడించుటకై గజాసురుని శీర్షమునుతెచ్చి శిశ్వాలికంఠాగ్రమున అతికించినట్లుకలదు ఈవిధముగా విఘ్నేశ్వరచరిత్రమను కావ్యములలో తక్కిన కావ్యములలో వలె వినాయకుని జన్మ వృత్తాంతమును రచన గావించాడు పేరునకిది విఘ్నేశ్వర చరిత్రయేకాని ఇందు విఘ్నేశ్వరుని జన్మ వృత్తాంతముతో పాటు రుక్మిణీ కళ్యాణము, శమంతకో పాఖ్యానము, శ్రీ కృష్ణుని బాల్యక్రీడలు, శ్రీ కృష్ణ, జాంబవంతుల యుద్ధ వర్ణనము, జాంబవంతుడు శ్రీ కృష్ణుని నుతించుట

మొదలైనవి. వివరముగ వర్ణింపబడినవి ఈ వర్ణలతో పాటు ప్రకృతి సహజమైన సూర్యోదయ, సూర్యాస్తమయ వర్ణనలు కూడ చోటు చేసుకొన్నవి. వీటితోపాటు శ్రీకృష్ణుని నివాసమైన ద్వారకా నగర వర్ణనము కూడ వర్ణింపబడినది. ఆయా ఘట్టములలోని వర్ణనలు హృదయంగమముగ నున్నవి. కథా సందర్భమును బట్టి కొన్ని ఘట్టములు ప్రబంధ రీతిలో మలచబడినవి ఈ విఘ్నేశ్వర చరిత్ర కావ్యములోని కొన్ని పద్యములు బాపయ ఇతర రచనయైన శ్రీరామ చరిత్రమున కూడా కలవు. శ్రీరామ చరిత్రమునకు గల తాళపత్ర ప్రతి అసపూర్ణమగుటచే ఎన్ని పద్యములు రెండింట సమానములో గుర్తింప వీలుపడలేదు.

# రసపోషణ

సాహిత్యం హృదయస్పంది అయిన కళ. ఒక కవి రచనను చదివి అందులో వుండే రసం, వృత్తి, రీతి, శయ్య, పాకం వంటి అంశాలతో కూడిన కవిత్వమహత్వానికి ముగ్ధులు కావడం సహజం ఏ కావ్యంలోనైనా ఈ గుణాలన్నీ అంతో ఇంతో చేరకపోతె ఒకభావాన్ని పటిష్ఠంగా చెప్పడం కుదరదు. అనగా పైన పేర్కొన్న రసం, వృత్తి, రీతి, శయ్య, పాకం మొదలైనవి. లేకపోతే ఒక భావం కేవల భావ మాత్రంగా మిగిలి పోతుందే కాని కవితాత్మకంగా తీర్చబడదు కాబట్టి కవిత్వాని కివన్నీ అవసరమైనవే.

ఏదైననూ ఒక కావ్యమును చదువునపుడు మన మనస్సున కలిగెడి హాయిని పూర్వ ప్రకరణములలో చెప్పబడిన కావ్యాంశములు నాల్గింటిలో ఏదయిననూ ఒకటిగాని, ఏ రెండుగాని, మూడుగాని, తుదకు నాలుగును కూడిగాని, కలిగింపవచ్చును ఆ హాయిని బట్టియే మనము ఆ కావ్యము రసవంతముగా ఉన్నదని అందుము ఆ నాలుగంశములును, ప్రత్యేకముగను, ఉమ్మడిగను, కావ్యమునకు సౌందర్యమును కలిగింప సమర్థములే గనుక. అవి కల్గించెడి సొగసుదనమె రసమని మనముకొందుము. ఒక పద్యములో భావావేశమును మాత్రమే కల్గించెడి అంశము మాత్రమే వుంది తక్కిన అంశములు లేకపోయినను, అది చదివినంతనే ఒడలు జలదరించి హృదయము ఉప్పొంగునేని ఆ పద్యము చాలా రసవంతముగ నున్నదని మెచ్చుకొందము. అట్లే ఎట్టి భావావేశమును కలింపకయే కవి చిత్రింప దలచిన మూర్తి మనగనుల యెదుట సజీవపదార్థము నటించుచున్నట్లుగా వర్ణింపబడియున్న పద్యమును చదివి, ఆ మూర్తి సాక్షాత్కారము వలన కలిగిన సుఖమునుబట్టి ఆ పద్యము కూడ రసవంతమే అందుము. అట్లే జ్ఞాన ధనుడైన ఒకకవి, ఒకగంభీరార్థమును ఒక పద్యంలో వ్యక్తమొనర్చినపుడు దానిని మన బుద్ధిచే మననము చేసుకొని, ఆ అర్థ గాంభీర్యము

నకును, దానికి జన్మస్థానమైన ఆ మహాకవి బుద్ధి విశేషమునకు జోహరు లర్పించుచు ఆ శ్లోకము గూడ రసవంతముగనే ఉన్నదనే కొనియాడుదుము ఈ రసమును గురించియు. దాని పరిణామ క్రమము గురించియు దాని స్వాదుత్వమును గురించియు ప్రపంచంలో
మొట్ట మొదట చెప్పినవాడు భరతుడు ఆయన ఈ ప్రక్రియనంతను, ప్రదర్శింపబడు చున్నపుడు మనము చూచేడి నాటక పరముగనే చెప్పెను. తరువాతి ఆలంకారికులు ఆ సిద్ధాంతమునే శ్రవ్య కావ్యములకును అన్వయించి తమ తమ గ్రంథములలో ప్రత్యేక రస ప్రకరణములను సూత్రములతో, వృత్తులతో, వ్యాఖ్యానములతో పెంపొదించిరి. కావున దృశ్యమైనను శ్రవ్యమైనను, రసభావ స్ఫోరకమైనది కవి వాక్యమే నాటకమైనచొ పాత్రలును, తదభినయమును ఆ స్ఫురణ కలుగుటకు మరింత సాయపడును,

కావ్య పఠనవేళ మనము రసానందమును అనుభవించునపుడు యీ కార్య కలాపమంతయు జరిగినదా అనియు, జరిగినచో ఆ యను క్రమము కానరాదేమనియు, ఒక్కొక్క కావ్యములో ప్రథమ పద్యము చదివినంతనే ఆ యానందము కలుగుటెట్లనియు, కొన్నింట ఎంతదూరము చదివినను అసలు కలుగదేమనియు, అనేక ప్రశ్నలు పుట్టవచ్చును. ఈ రస పరిపోషణాను క్రమమనెడి కార్యకలాప మంతయు విస్తృతమైన కథలు గల కావ్యములకు తగిన ప్రక్రియేగాని, చిన్న చిన్న ఖండ కావ్యములకు, చిట్టి పొట్టి పద్యములకు సంబంధించినది కాదు,

రససిద్ధిని గూర్చి మన ఆలంకారకులు చెప్పిన వాక్యములివి.

రస సిద్ధాంతమునకు ఆది గురువైన భరతుడు తననాట్య శాస్త్రములో "విభావాను భావ వ్యభిచారి సంయోగాద్రస నిష్పత్తిః" అని ఒక సూత్రము చేసెను.

ధనంజయుడు తన దశ రూపకమున భరతుని సూత్రమునే ఈ క్రింది విధముగా పెంచి వ్రాసెను.

విభావై రనుభావైశ్చ సాత్త్వికై ర్వ్యభిచారిభిః
ఆనీతః మానః స్వాద్యత్వం స్థాయీ భావో రసస్మృతః

విభావ, అనుభావ, సాత్త్విక, వ్యభిచారులచే ఆ స్వాద యోగ్యతను పొందింప బడిన స్థాయీ భావమే రసమని చెప్పబడుచున్నది

నవ రసములలో శృంగార, కరుణ హాస్య, శాంతములు కోమలములు. వీర, రౌద్ర, భయానక, బీభత్సములు, ఉద్ధతములు. అద్భుత రసము ఉభయ గుణాత్మకము. కోమల రసములచే హృదయా మార్ద్రవము (ద్రవీభవనము) శీఘ్రముగా జరుగును ఉద్ధత రసము మనస్సుకు ఉష్మలతను (Fervour) ప్రజ్వలనము కలిగించును చరమ దశలో అన్ని రసములును ఆనంద పర్యవ సాయులే అయినను, రససిద్ధికి హృదయ ద్రవీకరణమే నిదానము గనుక కోమన రసములలో రసోదయము శీఘ్రముగా జరుగును

నందూరి బాపయ తన విఘ్నేశ్వర చరిత్ర కావ్యంలో ఎక్కువగా భక్తి రసమునే పోషించెను. తన రచనయైన విఘ్నేశ్వర చరిత్ర కావ్యము క్షేత్ర మహత్మ్యమునకును, మరియు స్థల పురాణమునకు సంబంధించినది కావున దీనిలో భక్తి రసమునే పోషించెను.

తన కుమారుని మరణ వార్తను విని పార్వతి ఆగ్రహించుటను బాపయ రౌద్ర రసములో వర్ణించెను, ఈ రౌద్ర రసమునకు స్థాయీ భావము క్రోధము, ప్రతికూల విషయకముగా గాని శత్రు కృతాపచారము వలనగాని కలుగు మనః ప్రజ్వలనమును రౌద్ర రస పూరితముగా వర్ణించుతుు.

బాపయ తన కావ్యంలో శ్రీ కృష్ణుని బాల్యక్రీడలు గురించి వర్ణించునపుడు హాస్యరసమును పోషించెను. తనకావ్యంలోని ఈ అంశాన్ని పఠించునపుడు ఎవ్వరికైననూ హాస్యం కలుగక మానను.

తన రచనలోని ఈ క్రింది పద్యములలో హాస్య రసమును పరిశీలించవచ్చు

బంతులు రెండున్నవి నీ
కింతీ ! నా కొక్కటప్పు డిమ్మని వెఱపా
క్రాంతయును లేక కానొక
కాంతాసన యుగము బట్టి కడవడి బెనగున్"
విఘ్నేశ్వర చరిత్రము : 1-121

"గద్దరి తలమున మొటికయొక
ముద్దియు పాలిండ్లు వెన్న ముద్దలటంచున్
గ్రద్దన గంచెల వెడలచి
తద్దయు బిగబట్టి కేరు తన కిడమనుచున్" 1-122

అని పై పద్యాలలో శృంగారముతో కూడుకొన్న హాస్యాన్ని తనసహజమైన కవిత్వ ధోరణిలో వెల్లడి చేశాడు.

కావ్యంలోని శ్రీ కృష్ణ, జాంబవంతుల యుద్ధ వర్ణనలో వీర రసము కన్పించును. జాంబవంతుడు బలవంతుడు శ్రీ కృష్ణుడు చక్కని నేర్పు గలవాడు మరియు సుదర్శన చక్రధారి అంతటి మహిమాన్వితుడు బలవంతుడైన జాంబవంతుని ఓడించుట గొప్ప విషయం కాదు. వారిరువురు ఇరువది దినములు పోరాడినను ఫలితము లేనట్లు రచించి తర్వాత ముష్టి ఘాతమునకు లోనైనట్లు రచన గావించాడు. వీరు యుద్ధమునకు తలపడి నపుడు చక్కని ఉపమానములతో రమ్యగోచరంగా రచన గావించాడు. యుద్ధమునకు పూనుకొన్నపుడు వారిరువురు ఏ విధంగా ఉండెడివారో తన రచనలోని క్రింది పద్యం ద్వారా గ్రహించవచ్చు

గీ: గహ్వరంబున నిద్దురవోవు సింహంబు
దరికి జేరిన మత్తకరి విధమున
నాకట గృశియించు నట్టి బెబ్బులి తోడ
బోరంగ నేగు నాబోతు కరణి

నివురు గప్పిన గొప్ప నిప్పు చొప్పెఱుగక
 చేసిపె వాలు మక్షికము రీతి
గుబుసంబు గవిసిన గుండు కాలహిని
 సకలంగ బోవు మూషికము గలసి

సర్వభూత మయాత్మకు సర్వసాక్షి
సర్వ లోకేశు సర్వజ్ఞు సర్వసేవ్యు
గపట నాటక సూత్ర సంఘటన చతురు
జాంబవంతుడు హస్త పాశముల బట్టి''

— విఘ్నేశ్వర చరిత్రము 2–65

తర్వాత వారు యుద్ధము చేయునప్పుడు ఎలా ఉండిరని ఊహించు కొనుటకు కూడ చక్రాని ఉపమాన సామ్యములతో వీర రసముతో కూడు కొన్న లక్షణగ్రాహి పద్యమును రచించెను.

"తెబ్బులుల రీతి బలు గుబ్బలుల భాతి గను
 బొబ్బ మెకముల్ వలెను మబ్బుగవ పోల్కిన్
గిబ్బల తెఱంగునను జబ్బు పడకబ్బలియు
 లబ్బునకు మిన్నవియు బొబ్బలిడుకొంచున్

గబ్బి తన మేరు పడ నిబ్బరపు బీరముల
 దెబ్బలం దెమల్చుచును ద్రొబ్బులిడు కొంచున్
డబ్బువ భువిం బడుచు గొబ్బునను లేచుచును
 బ్రబ్బు తమి బోలిరపు డబ్బురవము తోవన్"

వి చ. ; 2-74

అని పై విధంగా శ్రీ కృష్ణ, జాంబవంతుల యుద్ధ వర్ణనను చక్రాని పద్యములో పూర్వ కవుల వలె రచన గావించాడు.

# వర్ణనలు

నండూరి బాపయ తన విఘ్నేశ్వర చరిత్ర కావ్యంలో షష్ఠ్యంతముల తర్వాత విఘ్నేశ్వర చరిత్ర కథారంభమును తెలుపుతూ మొదటగా నైమిశకానన వర్ణనము ఈ కావ్యంలోని వర్ణనను గురించి వివరించుటకు ముందుగా నైమిశ శబ్ద నిర్వచనమును తెలియజేయుట అవసరము

పూర్వము బ్రహ్మదేవుడు మనోమయమైన ఒకచక్రం లోక హితానికై కల్పించాడు. దానిని సత్యలోకం నుంచి దొర్లించాడు అది దొర్లి దొర్లి ఒక లోకం నుంచి మరొకలోకానికి వచ్చి వచ్చి, భూలోకంలో ఒక చోట ఒరిగిపోయింది. ఆ చక్రం యొక్క నేమి (ఇరుసు) అక్కడ విచ్చిపోయింది ఈ విధంగా దానికి నైమిశం అనే పేరుకలిగింది. అటువంటి నైమిశారణ్యంలో శౌనకమహర్షి ద్వాదశవర్ష సత్రయాగంచేశాడు ఆసత్రయాగంలో శౌనకాది మహామునులు సూతకులంలో పుట్టిన సూతుణ్ణిపూజించి అతనివల్ల పురాణేతిహాస సంహితులు విన్నారు కాబట్టి నైమిశం సూతవాణితో తాదాత్మ్యం పొంది మహా విద్యాస్థానమైంది అటువంటి పవిత్ర విద్యాసానంగా ఏర్పడ్డ నైమిశకానన వర్ణనతో తన కావ్య రచనను ప్రారంభించడం విశేషంగా పేర్కొనవచ్చు బాపయ తన నైమి శకానన వర్ణనము తెలుపుతూ రచించిన మొదటి పద్యం.

"వేదపఠో నినాద పరిపిద్ధ ధరా గగనాంతరంబు సు
స్వాదు ఫల ప్రసూన విలసన్నగ మధ్వరహోమ ధూమ సం
ఛాదిత దిక్తటాంతర విశాలము పుణ్యనదీ తటంబు నై
ప్రొది యొనర్చు సర్వముని పూజ్యము నైమి శకాననం బిలన్"
అని వర్ణించాడు. — విఘ్నేశ్వర చరిత్ర 1-31

నైమి శకానన వర్ణన చేస్తూ అందులోని జంతువుల వర్ణనను పూర్వ

కవుల వలె అలంకార పద్ధతిలో రచించాడు. తన కావ్యంలో జంతువుల వర్ణనను క్రింది పద్యంలో పేర్కొన్నాడు

"పులులును ధేనువుల్ నకుల పుంజములన్ భుజంగములన్ వృకం
బులును గురంగ సంఘములు మూషికముల్ వృషదంశ కంబులన్
బొలుపుగ సింహముల్ గరులు బొందు వహించును జాతివైరముల్
దొలగి ముదం బెలర్ప నతి దుష్కర మౌని తపస్సమృద్ధి చేన్" 1-33

అని వరుసక్రమంలో వర్ణించాడు ఆ నైమిశకానన వనంలో శౌనకుండను మునీంద్రుడు మొదలగువారు అత్యంత శ్రద్ధతో ద్వాదశాబ్ద సత్రయాగం చేసియుండుచు, అచ్చటికి విచ్చేసిన సూతున్ని శౌనకాది మహామునులు పూజించి అతనిని ప్రసన్నుని చేసి అతనికి అర్ఘ్య పాద్య విధులొసగి, మరియు అనేక విధముల ప్రార్థించి అతనివలన నిఖిల పురాణ కథా విధానంబులం బ్రవర్తిల్లుచు ఒక్కనాడు ఆ మహానుభావునకు శౌనకాది మహామునులు ఇట్లనిరి అని రచించాడు. ఈ విధంగా తన రచనలో నైమిశకానన వర్ణన గావించాడు.

నందూరి బాపయ తన కావ్యంలో ద్వారకానగర వర్ణనము గావించుటకు ముందు శ్రీ మన్నారాయణుడు కృష్ణావతారము దాల్చినట్లు పేర్కొన్నాడు బాపయ కూడా పూర్వ కవుల వలె శ్రీ కృష్ణుడు దినదినాభివృద్ధి పొందుతున్నట్లు రచించి అతని యొక్క బాల్య చేష్టలను కూడ పేర్కొన్నాడు తర్వాత అతని (శ్రీకృష్ణుని) నివాసమైన ద్వారకానగర వర్ణనము చేశాడు. ద్వారకా నగరమును వర్ణిస్తూ సహజమైన ధోరణిలో క్రింది విధంగా తెలిపాడు

ఆ నగరమును తలచుకొన్నంతనే ముక్తి లభించుననియు, కన్నులతో చూచిన మహానుభావులకు అక్కడ కాపురము ఉండి కృతార్థులైనట్లు

భావింతురని వర్ణించాడు. మరియు ఆ నగర వర్ణనను క్రింది పద్యంలో వర్ణించాడు.

ఉ॥ "ఆ పురి భర్మ రత్న కలితా వరణోన్నతి గాంచి దాటగా
నోపక సూర్య చంద్రులు తదుత్తర దక్షిణ పార్శ్వ మార్గ సం
వ్యాపక లౌదు రిప్పలు కనర్గ ఘటన్న జగత్ప్ర సిద్ధిగా
డావల వెల్పలం జమట తప్పనె యిప్పటికైన వారికన్"

—విఘ్నేశ్వర చరిత్రము : 1-133 అని వర్ణించాడు.

మరియు ద్వారకా నగరంలోని కోటలను, కేతనంబులను (ఇళ్ళను) కాసారములను (సరస్సులను), కుట్టిమంబులను (రాతి కట్టడములను), చంద్రశాలలను, చప్పరంబులను (పందిరి) క్రింది పద్యంలో చెప్పాడు.

సీ॥ కోటల సొరు శృంగాటకంబుల బారు
తరణుల తీరు సౌధముల కోరు
కేతనంబుల యొప్పు కీలు బొమ్మల చొప్పు
తేరుల మెప్పు వేదికల విప్పు
కాసారముల మంపు గణికాంగనల యింపు
నుపవనంబుల పెంపు నృపుల సొంపు
కుట్టిమంబుల వీలు గోపురంబుల చాలు
జల యంత్రముల జాలు జనుల మేలు

గీ॥ చంద్రశాలల రంగు రచ్చల హొరంగు
చప్పరంబుల కొప్పు నశ్వముల యేపు
భద్ర గజముల వృద్ధి సద్భట సమృద్ధి
దనర జెలువొందు నప్పురి ధరణియందు

అని వర్ణించాడు. — విఘ్నేశ్వర చరిత్రము : 1-138

అంతేగాక ఆ పురమునందు నివసించువారు కూడ ఎటువంటి వారో వర్ణించాడు. ద్వారకా నగరమందు అనఘులు, యాయజూకులు, తపోధనులు, జితేంద్రియులు, సూనృతవ్రతులు హృదయా తత్త్వ విధిజ్ఞులు శ్రుతి స్మృతిజ్ఞులు, సకర్మరతులు, మహీసురులు, పూజన నిరతులు నివసించేడి వారని పేర్కొన్నాడు. మరియు కాండ ప్రకాండులు, పాండు యశులు, పాండిత్య శీలురు, దండాధినాథులు, మండలేశులు, పార్థివోత్తములు మొదలైన వారు దండోప తండములుగ ఉన్నట్లు రచించాడు

ఆటువంటి పట్టణమునందు (శ్రీ కృష్ణుడు) మురహరుండు తల్లి దండ్రులతోను, అన్నదమ్ములతోను, బంధువులతోను, ఆప్తజనులతోను కలసి మహోన్నత వైభవంబు నందనరారుచు స్వ పక్షంబు వారింగటాక్ష వీక్షణంబులం దనిపి రక్షించుచు విపక్ష క్షోణీ పతుల శిక్షించుచూ సుఖంగా ఉన్నట్లు రచన గావించాడు. ఈ ద్వారకా నగర వర్ణనలోని పద్యములనేకములు నండూరి బాపకు వేరొక రచనయైన శ్రీరామ చరిత్ర కావ్యమునందు కూడ కనబడుచున్నవి.

## సూర్యాస్తమయ వర్ణనము

బాపకు పేర్కొన్న సూర్యాస్తమయ వర్ణన క్రింది పద్యాలలో కన్పించును.

క॥ "హరి వేటలాడుచో దన
కరణంబుల వేడి'సోకి కినయు నటంచున్
బిర బిర మరువున కరిగిన
కరణి దరణి చరమగిరి శిఖరమున గుబ్రంకొన్"

— విఘ్నేశ్వర చరిత్రము 2–27

క॥ "కాలోచిత కృత్య ద్విజ
పాళీ ముక్తార్ఘ్య తోయ బ్రహ్మాస్త్ర హతా
భీలక మందేహ దితిను
కాళిరుధిర మనగ సంధ్యయలరె బడమటన్" 2-28

పై విధముగా సూర్యాస్తమయ వర్ణనను కావించుచూ వెంటనే చంద్రోదయమును పేర్కొన్నాడు. సూర్యాస్తమయం జరిగిన వెంటనే చంద్రుడుదయించుట సహజం గావున ఆ విధంగా తన రచనలో తెలియ జేశాడు. చంద్రోదయ వర్ణనను తన కావ్యంలోని క్రింది పద్యము ద్వారా తెలియజేశాడు. ఈ పద్య రచనలో ఒకే వస్తువును వివిధాలుగా వర్ణించుట జరిగినది.

సీ॥ పాక శాసన వధూ ప్రాసాద శిఖర సం
కలిత హాటక రత్న కలశమనగ
యామినీ సతి కంఠసీమ నెంతేని యు
శోభిల్లు మంగళ సూత్ర మనగ
బ్రాగ్వామలోచన ఫాల బాగంబున
దీపించు కాశ్మీర తిలక మనగ
గమల జాండ వ్యాప్త ఘన తమో విహృతికై
దేవత యుంచిన దీప మనగ

గీ॥ దామరలు గ్రుంక గైరవతతి చెలంగ
జడధు లుప్పొంగ జీకట్లు కడు దొలంగ
జగము లలరంగ జక్రవల్ జత వడంగ
సోముడుదయించె సత్కళా ధాము డగుచు

—విఘ్నేశ్వర చరిత్రము ; 2-32

పై పద్యంలొ చంద్రుని రత్నకళశంగాను, రేయిఅనే మగువ మంగళ సూత్రంగాను, తూర్పు కంతమోమున కాశ్మీర తిలకంగాను, దీపముగాను, వర్ణించాడు. పై విధంగా సూర్యాస్తమయ వర్ణనను, దానితోపాటు చంద్రోదయమును వర్ణించి పిదప అంతకంతకు చంద్రుని యొక్క కాంతి కిరణములు జగమంతయు పిండి చల్లిన విధంగా నిండు వెన్నెలలు కాసినట్లు రచించి ఆ వెన్నెల వెలుగులొ వేటకేగునటువంటి శ్రీకృష్ణుడు తనతో కూడుకొన్న పరివారముతో కలసి అతని పురమునకు చనుదెంచెనని రచించాడు ఈ విధంగా సూర్యాస్తమయ వర్ణను పేర్కొంటూ దానికి అనుబంధగా చంద్రోదయమును కూడా అలంకార యుక్తముగా రచించి సంపూరి బాపయగారు పేరెన్నిక గనెను.

## సూర్యోదయ వర్ణనము

బాపయ తన విఘ్నేశ్వర చరిత్ర కావ్యములొ సూర్యోదయ వర్ణనము గావించుటకు ముందు మరియు సూర్యాస్తమయ వర్ణన తర్వాత క్రింది సన్నివేశమును కల్పించాడు శ్రీకృష్ణుడు వేటకేగిన సమయమున సూర్యాస్తమయ సమయం తర్వాత సత్రాజిత్తునకు సహోదరుడైన ప్రసేనుండను వాడు శమంతకమణి కంఠంబునందు ధరించి తురంగారూఢుడై వేటకు వెళ్ళి వనమునందు సంచరించు సమయమున సింహము ఒకటి అశ్వ సహితముగ (హర్యక్షరం బశ్వ సహితంబుగ) అతనిని పరిమార్చి ఆ రత్నమును తీసుకొని వెళ్ళుటకు ప్రయత్నంచగా అంతలో భల్లూక పతియగు జాంబవంతుడు ఆ రత్నమును గైకొని తన మందిరమగు గిరి కందరంబున అందంగా తన నందనకు కేళీ కందుకంబుగా డోలికాగ్ర భాగంబున

ప్రవేలాడగట్టెను. అంతలో ఆరాత్రి ప్రసేనుండు గృహంబునకుం జేరకున్న సత్రాజిత్తుండు తత్తజల్లు చిత్తంబున వర్తినవగలం బొగులుచుగడయిడరాని యిడుముల పేరి కదలింబడి యడలుచున్న సమయంబున అని వర్ణించాడు ఈ విధంగా వర్ణించిన తర్వాత సూర్యోదయ వర్ణనను గావించాడు

సూర్యోదయ వర్ణనను క్రింది పద్యంలో పేర్కొన్నాడు

క॥ కుక్కుటము తెలమి గూసెను
జక్కవ కవడాసె దిశల జంద్రిక వాసెన్
జుక్కల దొర కనుమూసెను
జక్కెర విలుకాడు విల్లు సడలగ జేసెన్"

– విఘ్నేశ్వర చరిత్రము : 2.35

అని సహజ ధోరణిలో సూర్యోదయ వర్ణనము గావించాడు సూర్యోదయము కన్నా ముందు కోళ్ళు కూతవేయుట సహజముగా జరుగు కార్యము దానిని దృష్టిలో ఉంచుకొని "కుక్కుటము తెలమి గూసెను" అని రచించి సూర్యోదయానికి ఒక కొత్త విశేషాన్ని పేర్కొన్నాడు. మరియు క్రింది పద్యములో కూడా సూర్యోదయమును వర్ణించాడు.

సీ॥ హరి హర సరసి జోదర కేళీ భువనంబు
భూసుర సముదయ పుణ్యరాశి
కోక వితానంబు కొంగు బంగారంబు
పద్మిని దివ్య తపః ఫలంబు
వేదత్రయమునకు విలసిల్లు పెట్టియు
లోకత్రయమునకు లోచనంబు
కలువ వెలందుల గమికి మన్నన బావ
చీకట్ల పాలింట చిచ్చుతుప్ప

గీ॥ వేడి పోడిమి గలవాడు వెలుగుఱేడు
నెలకు సంగడి కాడు వెన్నెలకు సూడు
నేడు గఱ్ఱములు గల తేరెక్కువాడు
పొడుపు గుబ్బలిపై గాన బడియెనపుడు" 2–36

బాపయ పై విధంగా అలంకార ప్రాయముగా సూర్యోదయ వర్ణనను గావించాడు.

## శ్రీ కృష్ణ జాంబవంతుల యుద్ధ వర్ణనము

సత్రాజిత్తుని సహోదరుడయిన ప్రసేనుడు నుండి జాంబవంతుడు పొందినటు వంటి శమంతకమణి వృత్తాంతమును శ్రీ కృష్ణునికి నారదుడు క్రింది విధంగా తెలిపెను. ఆ మణి అల్పుండగు సత్రాజిత్తునకుం దక్కదు విన్నుం చెందును. అని చెప్పగా శ్రీ కృష్ణుడు మణిని అన్వేషించుచూ జాంబవంతుని కడకుచేరి మణిని తీసుకొనబోగా మునుపు ఎందరినో భంగ పఱచి యిచ్చటికి కూడా వచ్చితివా అని పలికి నిన్ను వచ్చిన రీతిగా పోని వ్వను అని శ్రీ కృష్ణునితో జాంబవంతుడు యుద్ధమునకు తలపడెను. ఈ విధంగా తలపడిన యుద్ధమును వర్ణించుటలో నందూరి బాపయ ప్రత్యేక శ్రద్ధ వహించి అలంకార ప్రాయంగా పద్యమును రచించెను.

సీ॥ గిరి గహ్వరమున నిద్దురవోవు సింహంబు
దరికి జేరిన మత్త కరి విధమున
నాకట గృశియించు వట్టి బెబ్బులి తోడ
బోరంగ నేగు నాబోతు కరణి

నివురు గప్పిన గొప్పనిప్పు చొప్పెఱుగక
చేరిపై వాలు మక్షికము రీతి
గుబుసంబు గవిసిన గుందు కాలాహిని
జెనకంగ బోవు మూషికము పగిది

గీ॥ సర్వభూత మయాత్మకు సర్వసాక్షి
సర్వలోకేశు సర్వజ్ఞు సర్వసేవ్యు
గపట నాటక సూత్ర సంఘటన చతురు
జాంబవంతుడు హస పాశముల బట్టి"

— విఘ్నేశ్వర చరిత్రము 2-65

అని శ్రీ కృష్ణుడు, జాంబవంతుడు యుద్ధానికి తల పడినప్పుడున్న తీరును అలంకార యుక్తంగా చెప్పినాడు వీరిరువురూ అనేక దినములు పోరాడిరి. వీరి యొక్క పోరాటమును బాపయ లయగ్రాహి పద్యంతో పేర్కొన్నాడు.

లయగ్రాహి॥ "బెబ్బులుల రీతి బలు సబ్బలులక్షభాతి గమ
బొబ్బ మెకముల్ వలెను మబ్బుగన పోల్కిన్
గిబ్బల తెఱంగునను జబ్బు పడకబ్బలియు
లబ్బునను మిన్నవియ బొబ్బలిడు కొంచున్
గబ్బి తన మేరు పడ నిబ్బరపు బీరముల
దెబ్బలం దెఱల్పుచును ద్రొబ్బులిడు కొంచున్
డబ్బున భువిం బడుచు గొబ్బునను లేచుచును
బ్రబ్బు తమి బోరిరపు డబ్బురము దోపన్"

— విఘ్నేశ్వర చరిత్రము 2 74

అని పై విధంగా వారియొక్క భీకర పోరాటాన్ని వర్ణించాడు ఈ విధంగా వారిరువురూ ఇరువది దినములు పోరాడగా చివరకు శ్రీ కృష్ణుడు జాంబవంతుని ఓడించుటకు పూనుకొని నడినెత్తిపై పిడికిలిపోటు పొడిచెనని రచించాడు. ఈ విధంగా ముష్టి యుద్ధములో పాల్గొన్న జాంబవంతుడు నెత్తురు కక్కుచూ శరీరమంతయు తడిగా ముద్దకాగా, గుండెలు చేదిరి వసుధాస్థలిపై కూలబడెను అని పేర్కొన్నాడు పిదప ఆవిధంగానిశ్చేష్టితుండైన జాంబవంతుడు సొమ్మసిల్లి అంతలోనే తెలివినొంది తన మనస్సులో ఈ విధంగా అనుకొన్నట్లు రచించెను.

"ఈతడు నన్ను గొట్టగనే యిట్లయి తీతని నేను గొట్టనన్
రాతిని గొట్టినట్ల యవురా! పరికించి కనుంగొనంగ నా
చేతులు కాళ్ళు గోళ్ళు గడు జెక్కలు ముక్కలు నయ్యెవీడు పెన్
భూతము దయ్యెమో యెఱుంగక బోలదు మున్నిటు లెన్నడుంగనన్

— విఘ్నేశ్వర చరిత్రము : 2-80

అని శ్రీ కృష్ణుని గూర్చి జాంబవంతుడు గొప్పగా ఊహించు కొన్నట్లు రచన గావించాడు.

## ఛందస్సు

చందః ప్రశస్తి "ఛందః పాదౌతు వేదస్య

—పాణినియ శిక్ష -41

ఛందము వేదమునకు పాదములు, వేదముయొక్క ప్రతిష్టకు పచారమునకు ఛందము సాధనము, వేదాంగములు ఆరింటిలో ఛందో రూపమైన యంగము వేద పురుషునకు గతి సాధనమైన పాదద్వయంగా రూపింపబడినది.

చందో నిరుక్తి:   "ఛందాంసి ఛాదనాత్"

— నిరుక్తము : 8-3-11

ఛందము ఛాందకమని యాస్కముని నిర్వచించెను. దేవత మంత్రమయి యనియు, మంత్రముఛందోమయమనియు చెప్పబడుటచేత చందముచే నాచ్ఛాదింప బడుచున్నది. మంత్రమయియైన దేవతయేయని విదితమగుచున్నది. శ్రుతియు నీ యర్థమునే వివరించుచున్నది.

దేవావై మృత్యోర్బిభ్యతః త్రయీం విద్యాం ప్రావిశన్
తే ఛందోభి రచ్ఛాదయన్। యదేభి రచ్ఛాదయంస్తత్
ఛందసాం ఛందస్త్వం"

- ఛాందోగ్యోప నిషత్తు : 1-4-2

దేవతలు మృత్యువు వలన భయపడు చున్నవారై త్రయీ విద్యను ప్రవేశించి చందములచే తమను ఆచ్ఛాదించుకొనిరి కనుక చందములకు ఛాదనము వల్ల చందస్త్వము సిద్ధించు చున్నది. మంత్రమయియైన దేవత చందోమయమైన యాచ్ఛాదనమును పొంది మృత్యుభీతితొలగి యమరమగుచున్నది.

"ఛందయతి ఆహ్లాదయతీతి ఛందః"

- అమరకోశము : 3-20

చందము అహ్లాదకము మంత్రాత్మయైన దేవతకు మంత్ర ద్రష్టయైన ఋషికి మంత్రశ్రోతలైన సర్వమానవులకు అభిలషితార్థ ప్రధాన రూపమున అహ్లాదము కలిగించునది. చందము

"ఛందః పద్యే అభిలాషే చ"

- అమరకోశము : 3-233

చంద శ్శబ్దమునకు పద్యము అభిలాష యనియు అర్థములు కలవు చందము యొక్క ఈ ప్రయోజన బాహుళ్యమును దృష్టియందుంచు కొని కావ్యాధ్యయనము, కావ్యార్థాను సంధానము చేయవలెను.

చందో దర్శనము : చందో దర్శన మనగా చందముల యొక్క అంగ ప్రత్యంగ స్వరూప స్వభావ పరమార్థములను తెలుసుకొనుట.

"చందో 2క్షర సంఖ్యా వచ్ఛేదక ముచ్యతే"

- అథర్వ బృహత్సర్వాను క్రమణిక వి.1

"యదక్షర పరిమాణం తచ్ఛందః"

- ఋక్సర్వాను క్రమణిక 2-6

"చతుర్వింశత్యక్షరా దీని చతురుత్తరాణి
గాయత్ర్యా దీని చందాంసి"

- యజుర్వేదసర్వాను క్రమణిక 5వ అధ్యాయము

చందము అక్షర సంఖ్యా నియామకము అక్షర పరిమాణమే చందము గాయత్రి మొదలైనవి చందములు అవి చతుర్వింశత్యక్షరాది చతురక్షరోత్తరములు చందముల తొలి దర్శనము అక్షర సంఖ్యా నిష్ఠమై యున్నది అదిమ చ్ఛందము గాయత్రి. అది చతుర్వింశ త్యక్షర దానినుండియే చతురక్షర వర్ధన రూపమున నన్యచ్ఛందములు పుట్టినవి

పాశ్చాత్యులు చందములను Numbers అనియు, Measures అనియు వారు వ్యవహరించిరి పాశ్చాత్యులు Numbers స్థానమున Numerositie కనిపెట్టిరి ఆ Numerositie యందు Proportion కనిపెట్టిరి Rhythm కనిపెట్టిరి. Compion అను ఆంగ్ల చందోవేత్త చందస్సంబంధియైన Nnmberను గురించి యిట్లనెను

"Number is discreta quantitas, so that when we speak simply of number we intend only the dissevered quantity ; but when we speak of a poem written in number, we Consider not only the distinct number of sillables but also their velua which is contained in the length of shortness of their soud"

'.. So in a verse the numeration of the sillables is not so much to be observed as their waite and due proportion'

- Elizabetaan lyrics : P. 56

సంఖ్యయనగా పరిమాణ వివేచనము చందో విషయమున మాత్రము సంఖ్యయనగా అక్షర గణనము కాదు. అక్షర శ్రుతి యందలి హ్రస్వత్వ దీర్ఘత్వములు. వాని సంబంధము ముఖ్యముగా గమనింపదగినవి. వివేచనా శీలియైన శ్రోత్రేంద్రియము అక్షర బంధౌచిత్య నిర్ణాయకము శ్రవ్యాక్షర బంధమే చందమగును గాని అక్షర సంఖ్య మాత్రమే చందము కాదని Campion యొక్క యభిప్రాయము

అక్షరములు పరిమాణమున వివిధములుగ నున్నవి పరిమాణమనగ అవయవ సన్నివేశ వశమున నున్నట్టి అణుత్వ మహత్వ హ్రస్వత్వ దీర్ఘత్వాది లక్షణ విశేషము. అణుత్వ మహత్వములే చందశ్శాస్త్ర పరిభాష యందు లఘుత్వ గురుత్వములని వ్యవహరింప బడుచున్నవి అక్షర సంఖ్యా భేదము చందో భేదకమైనట్లు అక్షర పరిమాణభేదము కూడ చందో భేదకము కాగలదు. చందోఽంగములు : కావ్యమందలి వాక్యములు, పదసముదాయములు వాక్యమందలి పదములు అక్షర సముదాయములు వాక్యములను పదములుగా, పదములను అక్షరములుగా విభజింపవచ్చును పదము లందలి యక్షరముల క్రమము, వాక్యమందలి పదముల క్రమము అనేక విధముల నుండును పదము లందలి యక్షర క్రమము, వాక్య మందలి పదక్రమము వాక్యచ్ఛందమును రూపించును అచ్ఛందమైన వాక్యము అసంభవమే అయినను ప్లాపన దీపనాది లక్షణములు ప్రస్ఫుటముగా గల వాక్యచ్ఛందములే చందములుగా స్వీకరింప బడినవి.

అక్షర సంఖ్యా దృష్టిచే చందములు ఇరువది యారని చెప్పబడినను వాని యందలి యక్షర విన్యాస క్రమ భేదములచే సిద్ధించు చందములు

అసంఖ్యాకములని చెప్పవలసియున్నది చందములు మాత్రా నిష్టములు అక్షర నిష్టములు గలవు అక్షర నిష్టములందు అక్షర సంఖ్యా క్రమ నియతములు శార్దూల విక్రీడితాదులు, అక్షర
గణ నియతములు సీసగీతాదులు, మాత్ర సంఖ్యా నియతములు వైతాలీయాదులు, మాత్రాగణ నియతములు కందాదులు కలవు మాత్రా చందములందు మాత్రకు అక్షర చ్ఛందములందు అక్షరమునకు ప్రామాణ్యము.

చంప మెట్టిదైనను చందో విధియందు గమనింపవలసిన యంగములు పది కలవని భరత మహర్షి తెలిపెను.

సంపత్తు, విరామము పాదము, దేవత, స్థానము, అక్షరము, వర్ణనము, స్వరము, విధి, వృత్తము - ఇవి ఛందో దశాంగములు రసాద్యర్థ నిర్వాహణ సమర్థమగునట్లు చందమును నిర్మించుట యందు కవికి ఈ యంగములు సాధనములు.

నండూరి బాపయ గర్భ బంధ కవిత్వములలో దిట్టయని అతని రచనయైన విఘ్నేశ్వర చరిత్ర నిరూపించుచున్నది ఇందు చక్ర, కుండలినాగ మాలికా బంధములును, మత్తేభ కంద గర్భసీసము. కందమిళిత మణిగణ నికరము, కంద గీతక గర్భిత చంపకమాల, స్రగ్విణీ కలిత భుజంగ ప్రయాతము, చతుర్విధ కందమును ప్రదర్శింప బడినవి వీటికి తోడు పంచ పాదములతో ఒక చంపకమాల వృత్తాంతము రచింపబడినది

చక్ర బంధమునకు ఉదాహరణ :

శా॥ చక్రి । బాణ విరామ । సంతత దయా సమ్మిశ్రితా కల్ప । రా
నక్రా । పన్నగ మస్తకాంచిత పదన్యస్త ప్రభావా ప్రభూ ।
చక్రీ నస్థిత । ప్వాధి పార్చిత । రమేశా । వందితానంద । రా
రాకోండా । చతురా ననాద్య । చతురా । రారా । స్వభూ । శ్రీకరా

— విఘ్నేశ్వర చరిత్రము 2-83

కుండలి నాగ బంధము కు ఉదాహరణ .

చం॥ తరుణ శశాంక మస్తక । నుతవ్రత । శంకర । రమ్య। శత్రువ
ర్గర । గరుడాంక బాయ । శయ । కాయజహర । మహారథా। కవి
శ్వర శరణా । సుర ప్రవర వర్ణిత । శ్రీకర । శాంతమాన్య । క
ర్పర ధర । శాశ్వతా2భవ । భవా । వరణా । గురుపాతకాంతకా ।"

—విఘ్నేశ్వర చరిత్రము ; 1–172

విఘ్నేశ్వర చరిత్ర కావ్యంలోని పుష్పమాలికా
బంధమునకు ఉదాహరణ :

చం॥ "వర వరహార సన్నిభ శుభ్రప్రభ । శంకర । హీర హార సుం
దరతర । ధీరమానిత తత్రవత । శర్వ । భవా భవా భయా ।
గర ధర । సారయోగి గణ గణ్య । గజాసుర మార । మార సం
హర । ధరణీ రథా । నయ చయ క్షయ వైభవ । దేవపావనా ।"

—విఘ్నేశ్వర చరిత్రము 1.93

మత్తేభ కంద గర్భ సీసమునకు ఉదాహరణ :

సీ॥ వినుత లోకైక పవిత్రశీల । పవనాం
ధోమండనా । శంకరా । మహాత్మా
వితత శౌర్యాన్విత । విశ్వరూప । జగదా
ధారా । ధరిత్రీరథా । గిరీశ ।
నిశిత శూలాగ్ర వినిర్జితారి నిచయా ।
శీతాంశు రేఖాధరా । త్రిపుణ్య ।
నియతి సంస్తుత్య । వినీల కంధర । శివా
యదో ధీనా ధెము ధీ । దయాఢ్య

గీ॥ కరకలిత నవ్యశంబర । పుర విదళన
భవ విదూర । భుధనుత । విభవక్షర రహి

త|| మనసిజహరణ | గిరిశ | ధవళ వృషభ
గమన | గిరిజపతి | శివ | శంకర | గిరీశ"

– విఘ్నేశ్వర చరిత్రము : 1 94

పై పద్యంలో మత్తేభ విక్రీడితము కంద పద్యము ఇమిడి ఉన్నవి

మ|| నత లోకైక పవిత్ర శీల | పవనాం దోష ఖండనా | శంకరా |
తత శౌర్యాన్విత | విశ్వరూప | జగదాధారా | ధరిత్రీరథా |
శిత శూలాగ్ర | విసర్జితాసి నిచయా | శీతాంశు రేఖాధరా |
యతి సంస్తుత్య | విశాల కంధర | శివా | యాదోధినాథేషుధీ |"

— విఘ్నేశ్వర చరిత్రము 1 94

కం|| కరకలిత నవ్య శంబర |
పురవిదళన | భవ విదూర | బుధనుత | విభవ
క్షర రహిత | మనసిజ హరణ |
గిరిశ | ధవళ వృషభ గమన | గిరిజపతి | శివా |"

— విఘ్నేశ్వర చరిత్రము 1-94

పై విధంగా సీస పద్యమును పేర్కొని దానిలోని మత్తేభ, కంద పద్యములు మిళితమైనట్లు రచించుట బాపయ ప్రత్యేకతను చాటుచున్నది

కంద మిళిత మణిగణ నికరమునకు ఉదాహరణ :

"కరి దనుజ హరణ | ఘనతర కరుణా
కర | గిరిశ | శివా | నగంధర | భుజగా
భరణ | కలుషహర | భవ | సితధరణీ
ధర నిలయ | భవ విదళనా | శుభకర |"

విఘ్నేశ్వర చరిత్రము : 2-122

పై పద్యంలో బాపయ కంద పద్యము కూడా ఇమిడియున్నట్లు రచన చేసాడు. క్రింది విధంగా కంద పద్యమును విభజించవచ్చును.

"కరి దనుజ హరణ | ఘనతర
కరుణా (కర | గిరశ | శివ) తగర ధర | భుజగా
భరణ | కలుషహర | భవ | సిత
ధరణీ ధర నిలయ | భవవిదళన | శుభకరా |" 2-122

కంద గీత గర్భిత చంపకమాలా వృత్తమునకు ఉదాహరణ :

"పురహర | ధూర్జటీ | భువన పూజ్య | రమానుత | భూతనాద | శం
కర | వరదా | 2 భయా | త్రిదశగణ్య | మహేశ్వర | దేవ దేవ | శ్రీ
కర । కరుణాకరా । గరళకంధర । మన్మద గర్వహర । నా
కరిపు హరా । భవా । విశవకాయ । శివాప్రియ । విశ్వదీపకా ।"

— విఘ్నేశ్వర చరిత్రము 2-120

పై పద్యము చంపకమాల వృత్తమునకు చెందినదైననూ ఇందులో కంద గీత పద్యములు ఇమిడి ఉన్నవి. వాటిని క్రింది విధంగా పరిశీలించవచ్చు.

కందము॥ "హర । ధూర్జటీ । భవన పూ
జ్య । రమానత । భూతనాథ । శంకర । వరదా ।
కరుణాకరా । గరళ కం
ధర । మన్మథ గర్వహర । నాకరిపు హరా ।" 2 120

గీతము॥ "భువన పూజ్య | రమానుత | భూతనాథ |
త్రిదశ గణ్య | మహేశ్వర | దేవ దేవ |
గరళ కంథ ర | మన్మథ గర్వహర ।
విశవకాయ । శివాప్రియ । విశ్వదీపకా ।"2-120

స్రగ్విణీ కళిత భుజంగ ప్రయాతమునకు ఉదాహరణ :

"శివా । కామ దుర్గర్వ శిక్షా । కపర్దీ ।
భవానీ మనోనాథ । వాణీశ వంద్యా |"

భవా । వామదేవా । విపద్వర్గ హరీ ।
కవిస్తోమ సంరక్షకా । సోమలింగా ।'' 1-173

ఇందులో స్రగ్విణీ పద్యము మిళితమైనది. దీని క్రింది విధంగా పరిశీలించవచ్చు

''కామ దుర్గర్వ శిక్షా । కపర్దీ । భవా
నీ మనోనాథ ! వాణీశ వంద్యా । భవా ।
వామదేవా । విపద్వర్గ హరి । కవి
మస్తోమ సంరక్షకా । సోమలింగా శివా ।
— విఘ్నేశ్వర చరిత్రము : 1-173

బావయ తన కావ్యంలో గణ భంగము కాకుండుటకై "ద్వాపారాంతము" "అగారము" వంటి స్వతంత్ర ప్రయోగములను పేర్కొన్నాడు

ద్వాపారాంతము అను పద ప్రయోగమునకు ఉదాహరణ

శా॥ "ద్వాపారాంతమునందు బెక్కు దనుజుల్ ధాత్రీశులై పుట్టి రా
పాపాత్ముల్ ప్రతిలేని బాహుబల దర్ప ప్రాబవం బొప్పదు
ర్వ్యాపారోద్ధతులై చెలంగగ దదీయాత్యంత భారంబు దా
సైపం జాలక భూ సతీమణి స్వాంతంబుతో నయ్యెడన్"
— విఘ్నేశ్వర చరిత్రము : 1-102

అగారము అను పద ప్రయోగమునకు ఉదాహరణ ,

క॥ "అరణ్యము గైకొని ల
జ్జా రూషిత చిత్తుడగుచు స్వజ్ఞాజితుడా
గారమునకు జని బలవ
ద్వైరమునకు వెఱచి తనకు దావిట్లనియెన్"
— విఘ్నేశ్వర చరిత్రము 2-105

క్రింది పద్యంలోని 'దృక్ప్రాణి ఛాయాసక్తి' అను పదంలో తుగాగమము నిత్యంగా రావలసి యుండగా గణభంగ మగుటచే తుగాగమము కాలేదు కావున దృక్ప్రాణి ఛాయాసక్తి అని తన రచనలో పేర్కొనెను.

శా॥ "ప్రాసాదాగ్ర విహారి ముగ్ధ సుతులా ప్రాంతంబు లన్వేగు తా
రా సంతానము రాత్రి గాంచి యవిహార వ్రాత మౌనంచు, దా
రాసం బట్టి దలంచి హస్తములు డాయం జూచి దృక్ప్రాణి చా
యా సక్తిన్ గురివెంద పూసలని పాయం ద్రోతు రాపాలికన్"

— విఘ్నేశ్వర చరిత్రము 1-136

బాపయ రచనలోని క్రింది పద్యములలో గల "అతతప్రీతి," 'తోయ బ్రహ్మాస్త్ర" అను పదాలలోని రకారముతో కూడిన ప, బలను గణ భంగమును నివారించుటకై తేలబల్క వలసి వచ్చును. పై పదాలకు ఉదా॥

ఉ॥ "వా తెఱ దొండపండు రదవర్గము దాడిమ బీజ పంక్తి యం
చాతత ప్రీతి జేరిన శుకాళి వచస్యము దాయమో యనన్
నాతి మృదూక్తి సంతతి దనర్చె మనోహర లీల నింక నా
భీతి మృగాక్షి చెల్వెపుడు పేర్కొన్న బోలునె యెన్ని భంగులన్"

— విఘ్నేశ్వర చరిత్రము 1-160

క॥ "కాలోచచిత కృత్యద్విజ
పాళిముక్తార్ఘ్య తోయ బ్రహ్మాస్త్ర హతా
భీలక మందేహ దితిసు
తాళి రుధిర మనగ సంధ్యయులరె బడమటన్"

—విఘ్నేశ్వర చరిత్రము ; 2-28

క్రింది పద్యంలో "మోమాట" మను పదము ప్రయోగింప బడినది.

శబ్ద రత్నాకరములో ఈ ప్రయోగము మోమాటమని కాక మోమోట గా ఇవ్వబడినది. శబ్ద రత్నాకరములో ఈ ప్రయోగమును " మో " మోటం బించుకలేక తక్కిన భుజా"యుగ్మంబు న్" అను నాచన సోముని ప్రయోగము చూపబడినది. కానీ బాపయ పై శబ్దమును మోమాట మనియే తన కావ్యంలో ప్రయోగించెను ఇందులకు ఉదాహరణ :

మ॥ "మణి యిమ్మన హిరణ్య లోభమున మోమాటంబు చిత్తంబులో
నణు మాత్రంబు దలంప కియ్యనచటే యత్యంత మూర్ఖంబు ని
గ్గ్రహముపై వెండితము లేని నింద యిడితన్ వాచాల కత్వంబునన్
గణుతింపన్నము బోలు దుర్జనుడు లోకంబందునం గల్గునే"

— విఘ్నేశ్వర చరిత్రము 2-107

బాపయ రేఫ, అకారములను; లకార, ళకారములను అభేదముగ ప్రాసస్థానమున ప్రయోగించినాడు

రేఫ, అకారముల అభేద ప్రాసకు ఉదాహరణ ;

చ॥ "సుమచిర లీల భాద్రపద శుద్ధ చతుర్థిని శ్రీ గణేశు సు
స్థిర మతి నిల్పి పూజలిసి దేవమనుష్య భుజంగు లుగ్రమత్
చెఱకు రసంబు మీగడ యు క్షీరము లాజ్యము మోదకంబులున్
బెరుగును బాయసాన్నమును ప్రీతి నివేదన జేసి రంపటున్"

- విఘ్నేశ్వర చరిత్రము 1-82

పై పద్యములో మూడు, నాలుగు పాదములందు అకారమునకు, రేఫకు అభేద ప్రాస కుదర్చబడినది

లకార, ళకారములకు బాపయ తనకావ్యంలో రచించిన ఉదాహరణ

క॥ "కాలోచిత కృత్య ద్విజ

పాళీ ముక్తార్ఘ్య తోయము బ్రహ్మాస్త్ర హతా
ఖీలక మందేహ దితిసు
తాళి రుధిర మనగ సంధ్యయలరె బకమటనే"
- విఘ్నేశ్వర చరిత్రము 2-28

పై పద్యంలో మొదటిపాదము, రెండవ పాదమునందును తిరిగి మూడు నాలుగు పాదములందును ల, ళ లకు అభేద ప్రాసము చెప్పబడినది.

తన కావ్యంలోని ద్వితీయాశ్వాసాంతమున గల కంద పద్యమున విలక్షణ ప్రయోగ మొకటి ప్రయోగించెను. క్రింది పద్యంలో ఆ ప్రయోగ మును పరిశీలించవచ్చును.

క: "ఈ కృతి యా చంద్రార్కము
గా కుతలంబునను వెలయుగాత చిరముగా
నీ కారుణ్యము వలనన్
శ్రీకర! వెంటూరి నివేశ! శ్రీ సోమేశా!"
విఘ్నేశ్వర చరిత్రము 2-119

పై పద్యంలో రెండవ పాదమున మొదటి అక్షరము ద్రుతాంతము కావున అనంతర పదమగు కుతలంబు అనునది (ప్రథమమీది పరుషము లకు గసడదవలగు) నిత్యంగా గుతలంబు కావలెను. అట్లయినచో ప్రాస నియమము కలుగదు కాబట్టి బాపయ పై ప్రయోగమును "కుతలంబు" అనియే ప్రయోగించెను.

బాపయ తన కవిత్వ మెట్లున్నను కృతికర్త కది సమ్మతమేనని తన రచనలోని ద్వితీయాశ్వాసాంతమున గల క్రింది పద్యము ద్వారా తెలియ జేశాడు.

ఉ॥ "ముద్దున బెంచుకొన్న తమ ముద్దుల కీరపుదెబ్బలు పల్కఁ-నన్
దద్దయు సంతసిల్లు క్రియ నాదు కవిత్వ మదెట్టులున్న నీ
సద్దయు చేత గాంచునది సమ్ముదమే ఘటియించు నీకు శ్రీ
మద్ద్విజేంద్ర ముఖ్య సురమానిత ! వెంటురి సోమలింగమా !"

వి చ 2-118

## అలంకారములు

కావ్యంలో అలంకారాలు ప్రముఖ స్థానమును ఆక్రమిస్తాయి కావ్యానికి గుణాలు శోభను కలుగ జేస్తుండగా, ఆ శోభను అతిశయింప చేసేవి అలంకారాలు అని పేర్కొనవచ్చు

అలంకార మేనాటిదం వేద మేనాటిదో ఆ నాటిదని చెప్పవచ్చును ఎంత ప్రగాఢము అతి గూఢము అయిన విషయమైనను అలంకార సాహాయ్యమున మనోహరముగా సుబోధముగా చెప్పవచ్చును. ఇది ఋషి కవుల ఆమోదమునే కాక ఆదరము నందిన కవిత్వ సాధనము వేద కాలమున శబ్దార్థాలంకారము లున్నవి. అర్థాలంకారమున సాదృశ్య మూలకములగు ఉపమా రూపకాతి శయోక్త్యాదులే కాక సాదృశ్యముతో పనిలేని నిరుక్త్యాదులును ఉన్నవి.

'అలం' శబ్దమునకు భూషణ మనియే అర్థము. 'అలంభూషణ పర్యాప్తి శక్తివారణ వాచకమ్' దీనిచే అలంకరణ మనగా భూషణ కరణము పర్యాప్తికరణము శక్తికరణము వారణకరణము అను అర్థములు కలుగును

అలంకారములు కావ్యమునకు నగల వంటివి. నగలు శరీర శోభనెట్లు హెచ్చించునో అట్లే అలంకారములు కావ్య శోభను హెచ్చించును. అలం అను శబ్దమునకు కృ ధాతువు చేరగా 'అలంకార' మను రూపము ఏర్పడినది. అలం అన్నను అలంకారమన్నను 'భూషణ' మని అర్థము, అలంకారోతీత్యలం కారః" (ఇది కావ్యమును అలంకరించుచున్నది కనుక అలంకారము) అనికాని "అలంక్రియతే అనేన ఇత్యలంకారః (దీనిచే అలంకరింప బడుచున్నది కనుక అలంకారము) అనిగాని అలంకార పదమునకు నిర్వచనము.

'సౌందర్య మలంకారః' అలంకార మనగా సౌందర్యము అలంకరించునది అలంకారము కవి వాక్కును, వాగ్గతార్థమును అలంకారము అలంకరించును. కావ్యమున ప్రధానమగు రసము కవి వాక్కుల వలననే పోషింప బడుట వలన అలంకారము రస పోషణ హేతు వనవలెను.

'కావ్యం గ్రాహ్య మలంకారాత్' సౌందర్య మలంకారః' (అలంకార సంసర్గము చేత కావ్యము సహృదయులకు ఉపాదేయ మగుచున్నది) అను వామనాచార్య వక్కాణములును, వాలంకార తత్త్వ నిరూపకములు వామనుడు తన గ్రంథమున తృతీయాధి కరణ ప్రథమాధ్యాయములో

"కావ్య శోభాయాః కర్తారో ధర్మ గుణాః
తదతిశయ హేత వస్త్వలంకారః" - అని చెప్పియుండెను

అనగా శోభను కల్గించునట్టివి గుణములు కాగా, ఆశోభ నతిశయింప చేయునవి అలంకారములగు చున్నవని భావము

'అబ్ధికి అలలు అలంకారము, ఆకసమునకు తారలు అలంకారము గుడికి గంట అలంకారము మడికి పంట అలంకారము సుందరికిని వల్లె

కావ్య సుందరికిని గూడ అలంకారము లలంకారము" అని డా జంధ్యాల జయకృష్ణ బాపూజీ అలంకారములు కావ్యమునకు ఎంత అలంకారములో వివిధ పోలికలతో తెలిపియున్నారు.

శ్రీనాధుని సాహిత్య ప్రస్థానము , పుట - 139

అలంకారములు బహు విధములు కొన్ని పాత్రల మనస్తత్వమును నిరూపించునవిగ నుండును. మరికొన్ని కవియొక్క లోకజ్ఞతను చాటుచుండును. ఇంకొన్ని శాస్త్రార్థ బోధకములుగ నుండును ప్రధానముగ శబ్దాలంకారములు అర్థాలంకారములు అని అలంకారములు రెండు రకములు అను ప్రాసాదులు శబ్దాలంకారములు.

సంస్కృతమున అలంకార శబ్దము ఆభరణార్థమున నుండగా గ్రీకు బాషలో 'aurum' శబ్దము 'gold' అను నర్థము గలదు ఋగ్వేదమున అలం కృతి శబ్దము.

"కాతే అస్త్యరం కృతిః సూక్తైః"

- ఋగ్వేదము : 7-29-3

ఋగ్వేది శ్లోకమున అరంకృతిగా ప్రయుక్తమగుట గమనార్హము 'alam - aurum' శబ్దముల సాన్నిహిత్యము వలన అలంకారము లౌకికార్థమున నుండి రూప కాలంకార పద్ధతిలో (Meataphorical) కావ్య లక్షణముగా నేర్పడిన దనుటకు అవకాశము గలదు

అలంకార సారము సౌందర్యము సౌందర్యము శిల్ప మూలకము కావున పద్యమును సౌందర్యోపేతము చేయుటకు పాటించు శిల్పమే అలంకారము కావలెను "వైచిత్ర్య మలంకారః" అని మమ్మటుడును "అలంకారోహి విచ్ఛిత్తిః అని మరి యొకరును కవి ప్రతిభా నిర్వర్తితముగా నుండి విచ్ఛిత్తి కలిగినదే అలంకారమని కుంతకుడును చేసిన నిర్వచనములును,

"బంధో, గుంఫో, భణితిః, వక్రోక్తిః కవి వ్యాపారా ఇతి హి పర్యాయాః" అను వివిధ వ్యవహారములచే పేర్కొన్న బడుటయు అలంకారముల తత్త్వ మును కొంత ప్రకటించినవి.

ఒకే పరమాత్మను వివరించుటకై బహుకల్పనల కూర్పులో అలం కార మార్గ మావశ్యకమైనది ఎంత మేధానిధికిని తెలియని విషయమును మేధా మార్గమునకే భిన్న సమరూపములతో తెలుపుటకై అలంకార ప్రయో గము కలిగినది.

ఉన్నదిలేనట్లును, లేనిదున్నట్లును, ఉన్నదియున్నట్లును లేనిదిలేనట్లును వివ రించుకవితా విశేషమే-లంకారము ఒకపరమాత్మకు ఇంద్ర మిత్రవరుణాద్య నేక రూపము లాపాదించి తద్వారా చివరి కొక్క పరమాత్మనే ప్రవర్ణించు టలో వేదమంత్రము నలంకారమైనది.

వేదము ననుసరించి వెలువడిన భారత రామాయణేతి హాసములు భాగవతాది పురాణములు తత్త్వార్థ ప్రకాశమున కెక్కువగా అలంకారమను ప్రయోగించినవి రఘు వంశాది కావ్యములును వాని ననుసరించుచున్నవి కాని అలంకార ప్రయోగమున వేదముల కన్న ఇతిహాసములును, వానికన కాళిదాసాది తొలి కవుల కావ్యములను, వాని కన్న వైచిత్ర్యయుగ కావ్యము లును అలంకార ప్రయోగమున తత్త్వ ప్రాధాన్యము సడలించి అలంకరణ పర్వతమును అధికాధికముగ చేపట్టినవి ప్రతిభాశక్తి దార్శనికత మార్మికత తగ్గుకొలది అలంకారములు చిత్రకావ్య విశేషములుగ దిగజారుటలో ఆశ్చ ర్యము లేదు. కావ్యముల దలంకార బాహుళ్యము హెచ్చినది.

అలంకార ప్రయోగ మెప్పుడెట్లు ప్రారంభమైన దనుటకు తార్కా ణములు లేవు. మానవ సృష్టితో నిది ప్రారంభమై యుండవలెను. ఏలన మానవ జీవితములో బౌతికాలంకారములు ప్రవేశింపక పూర్వమే

సాదృశ్యారోపణాతి శయోక్త్యాది భావము లుండక తప్పవు. స్వయం కల్పిత నాగరికతకు దూరముగనున్న ప్రాక్తన మానవుడు దైవకల్పితమగు మనోహర ప్రకృతిని, నీలాకాశమును, వర్షాది ప్రకృతి వైచిత్ర్యములను చూచి ఆశ్చర్య చకితుడై యుండును వానితో తన పరిసరములను, తన జీవితమును, తన ఆలోచనలను, అనుభూతులను పోల్చుకొనుట వంటి అలంకార బీజ భూత ములగు భావములను పొందుచుండును.

సుఖ దుఃఖ భయక్రోధ విస్మయాది భావములు అనే కాలంకారము లకు ప్రేరకము లగుట గుర్తించినచో అతి ప్రాచీన మానవుడిట్టి భావముల నిప్పటికన్న గాఢముగ అచ్చముగ పొందువాడు గాన నాతని మాటలలో ఉపమా రూపకోత్ప్రేక్షాతి శయోక్తుల వంటి అలంకారములకు తావు కలుగక తప్పదు.

అలంకార భావ ప్రాచుర్య వివరణమిది కావ్యాలంకారము, సౌందర్యా త్మకము. సలక్షణము, రసపర తంత్రమునై పుష్టమై యున్నది. మహా కావ్యము లందీ అలంకారము కవికూర్పు. తీర్పు నేర్పుచే సుందరమై ప్రతిభాతి శయముచే రసార్త్రమై మేధాశక్తిచే రాణకెక్కి భావోల్బణముచే మహా ప్రభావము కలిగి, మరువ రానిదై యుండును. ప్రతి అలంకారము గాఢానుభూతులను, మధురార్థములను వెల్లివిరియును. అట్టివానినే అలంకారములగ స్వీకరింపవలెను కాని లక్షణము ననుసరించిన చాలదు.

ఇటువంటి అలంకారములు విఘ్నేశ్వర చరిత్రమున ఏ విధముగా పోషింప బడెనో పరిశీలింతము

## శబ్దాలంకారములు

కావ్యమునకు శోభను గూర్చునవి అర్థాలంకారములు శబ్ద వైచిత్ర్యమును,

చమత్కారమును కలిగించునవి శబ్దాలంకారములు. విఘ్నేశ్వర చరిత్ర పాత్ర స్వభావములను, వాగ్వైభవములను ప్రకటించుటకు ఈ క్రింది శబ్దాలంకార పద్యములను ఉదాహరణముగ పేర్కొనవచ్చును.

బాపయ కవిత్వం రసవంతమైనది ధారాశుద్ధి కలది అతనికి శబ్దాలంకారములపై మక్కువ ఎక్కువ. తన కావ్యంలో శబ్దాలంకారములను విరివిగా వాడినట్లు కనబడును.

వృత్త్యను ప్రాసాలంకారము "అన్ను మిన్ను కన్ను లన్నులినంబుల
కన్న తిన్న నగుచు నున్న వెన్న
గొన్నె లౌను కన్నె నెన్నొన లన్నన్న
మిన్న చెన్ను వెన్ను దన్ను నడుము"

- విఘ్నేశ్వర చరిత్రము 1-153

పై పద్యంలో ఒకే హల్లు (న్ను) ద్విత్వ నకారము పలుమార్లు ఆవృత్తి యగుట (మాట మాటకి వచ్చుట) వలన అది వృత్త్యను ప్రాస అలంకారము మరియు క్రింది పద్యములలో కూడ వృత్త్యను ప్రాసాలంకారమును పేర్కొన్నాడు

"కరవాల కుంత తోమర
పరిఘాదులు తరువరములు పర్వత వితతుల్
బిర బిర మఱి మఱి పఱపిన
గర పద ఘాతముల శౌరి ఖండించుటయున్"

విఘ్నేశ్వర చరిత్రము 2-70

పై పద్యంలో కూడా బాపయ వృత్త్యను ప్రాసాలంకారాన్ని రచించాడు
బాపయ క్రింది పద్యంలో ద్విప్రాసను పాటించి రచించినట్లు తెలియును

"కంబుగళంబును సత్కన
కంబు శరీరంబు భ్రమరకంబు కచము నా
కంబు నడుము సురుచిర కో
కంబు కుచ ద్వంద్వ మల శుకంబుల్ పలుకుల్
— విఘ్నేశ్వర చరిత్రము : 1-151

అని పై పద్యంలో మొదటి రెండక్షరములు ఒకే నియమంతో ప్రతి పాదము నందు పాటించడం జరిగింది. పై పద్యము రుక్మిణీ కళ్యాణ ఘట్టంలో రచింపబడినది.

క్రింది పద్యంలో కూడా వృత్త్యను ప్రాసాలంకారాన్ని గ్రహించవచ్చు.

"వాలుగల వాలుగలు చెలి
వాలుం గన్నులది మరుని వాలౌగదా యీ
నేల గల చెలుల జెలువున
నేలగలదు వేయు జెప్ప నేలా మీకున్"
— విఘ్నేశ్వర చరిత్రము : 1 155

## అర్థాలంకారవాఃలు

బాపయ తన కావ్యంలో శబ్దాలంకారముల కన్నా అర్థాలంకారములనే విరివిగా వాడినట్లు తెలియును. బాపయ కావ్యంలో అర్థాలంకారములను క్రింది విధంగా పరిశీలించవచ్చు.

ఉపమాలంకారము :

ఉపమానమునకు, ఉపమేయమునకు చక్కని సావ్యము చెప్పుట ఉపమాలంకార మగును. ఈ ఉపమాలంకారమందు ఉపమేయము, ఉపమానము, ఉపమావాచకము, సమానధర్మము అను నాలుగు అవయవములు

తప్పని సరిగా వుండి తీరును. అటువంటి అలంకారమును సంపూర్ణ ఉపమాలంకార మందురు.

బాపయ విఘ్నేశ్వర చరిత్ర కావ్యంలో ఉపమాలంకార మునకు ఉదాహరణ :

సీ "గిరి గహ్వరమున నిద్దురవోవు సింహంబు
దరికి జేరిన మత్త కరి విదమున
నాకట గృశియించు నట్టి బెబ్బులి తోడ
బోరంగ నేగు నాబోతు కరణి
నివురు గప్పిన గొప్పనిప్పు చొప్పెఱుగక
చేరిపై వాలు మక్షికము రీతి
గుబుసంబు గవిసిన గుండు కాలాహిని
జెనకంగ బోవు మూషికము పగిది

గీ॥ "సర్వభూత మయాత్ముడు సర్వసాక్షి
సర్వలోకేశు సర్వజ్ఞు సర్వసేవ్యు
గపట నాటక సూత్ర సంఘటన చతురు
జాంబవంతుడు హస్త పాశముల బట్టి"
—విఘ్నేశ్వర చరిత్రము 2-65

అని పై పద్యములో శ్రీకృష్ణ, జాంబవంతుల యుద్ధమును వర్ణించు నపుడు చక్కని ఉపమానములతో అలంకార ప్రాయముగా రచన సాగించి పూర్వకవుల విధానాన్ని పాటించాడు.

ఉపమాన అలంకారము :

రెండు వస్తువులలో మొదటి దానిని ఉపమేయముగను, రెండవదానిని

ఉపమానముగను వర్ణించి పరల ఆ రెండు వస్తువులనే మార్చి అనగా ఉప మేయము ఉపమానముగను, ఉపమానమును ఉపమేయముగను వర్ణించిన అది ఉపమానాలంకార మగును. ఈ అలంకారమును కూడా అనేక మంది కవులు వాడి యున్నారు.

బాపయ తన రచనలోని రుక్మిణీ కళ్యాణ ఘట్టమున ఈ ఉపమాన అలంకారమును ప్రయోగించునట్లు క్రింది పద్యం ద్వారా తెలుసుకొన వచ్చును.

క॥ కంబు గళంబును సత్కన
కంబు శరీరంబు భ్రమరకంబు కచము నా
కంబు నడుము సురచిర కో
కంబు కుచ ద్వంద్వ మల శుకంబులు పలుకుల్"
— విఘ్నేశ్వర చరిత్రము 1-151

పై పద్యంలో రుక్మిణి కళ్యాణ సమయంలో ఆమె యొక్క శరీర అవయవా లన్నిటిని ఉ ప మా నో ప మేయములుగ వర్ణించుటచే ఇది ఉప మాన అలంకారము

బాపయ రచనలోని క్రింది పద్యం లో కూడ ఉపమాలంకారమును పరిశీలించవచ్చు

సీ॥ "పంకరుహానన కుంభ రాలక జాల
మీన లోచన నవఫేన హాస
చక్రవాక స్తని సైకత జఘన శై
వాల శిరోజ మృణాళ బాహ
కమఠ పదాగ్ర సౌగంధి కామోధ కో
కనద పద ద్వయ కంబు కంఠి

మకరంద భాషిణి మకర కంఠూలత
యావర్త నిభనాభి హంస గమన

గీ॥ వీచికావళి కేవర విసరరవన
గాన యీచాన మెఱగడు ఘన విలాస
సరసి యనుచును సరసులు వరుస బొగడ
నెగడె జగడంబు గదుర నా చిగురబోణి
- విఘ్నేశ్వర చరిత్రము 1-152

అతిశయోక్తి అలంకారము :

అతిశయోక్తి అలంకారము ఎనిమిది రగములుగ కలదు. బాపయ కవిత్వంలో సంబంధాశయోక్తి అలంకారమున్నది.

సంబంధము లేనప్పటికీ సంబంధ ఉన్నట్లు రచించిన యెడల అది సంబంధాతి శయోక్తి అదురు.

బాపయ రచనయైన విఘ్నేశ్వర చరిత్ర కావ్యంలో సంబంధాతి శయోక్తి అలంకారమునకు ఉదాహరణ :

ఉ॥ "ఆపురి భర్మరత్న కలితా వరసౌన్నతి గాంచి దాటగా
నోపక సూర్య చంద్రులు తదుత్తర దక్షిణ పార్శ్వ మార్గనం
వ్యాపకు లౌదు రిప్పలు కనన్ద మటన్న జగత్ప్రసిద్ధిగా
దాపల వెల్పలం జనుట తప్పునె యిప్పటికైన వారికన్"
విఘ్నేశ్వర చరిత్రము- 2-133

పై పద్య లో ద్వారకా నగర వర్ణనము చేయుదలచి ఆ నగరమునకు

సంబంధము లేకటువంటి సూర్యచంద్రులు ఉత్తర దక్షిణ పార్శ్వ మార్గముల గుండా సంచరింతురని చెప్పుట వలన ఇది సంబంధాతి శయోక్తి యైనది. సహజముగా సూర్యచంద్రులు తూర్పునుంచి పడమర వైపుకు సంవ్యాపకులుగా ఉంటారు. కాని ఇక్కడ దానికి సంబంధం లేనివిషయమును చెప్పి దానిని ఉత్పలమాలా వృత్తంలో అలంకార ప్రాయంగా రచించాడు.

ఈ క్రింది పద్యములలో కూడ సంబంధాతి శయోక్తి అలంకారములను పరిశీలించవచ్చు.

గీ॥ "భుజగ కులమప్పురంబు సొపుగ గోరి
నిమ్న పరిఘా జలంబుల నిర్గమించి
బర్మ హర్మ్యాగ్ర కలిత సువర్ణ రూప
చిత్రిత పతాకముల జూచి చెదిరిపజుడు"

— విఘ్నేశ్వర చరిత్రము : 1-134

మ॥ "కనకాంభోజ సమూహ సంవృత లసద్గంగా ప్రవాహావగా
హనముం జెసి తటంబులం బొలుచు దివ్యస్త్రీ సమాజంబు నా
దనమం దత్పురి హేమకుంభ కలితో ద్యచ్చంద్ర కాంతాశ్మ సౌ
ధని కాయాంతర కేళిలోలు వసుధాధామాసనా శ్రేణితోన్"

— విఘ్నేశ్వర చరిత్రము : 1-135

స్వభావోక్తి అలంకారము.

జాతి, గుణముల యందున్న స్వభావమును ఉన్నది ఉన్నట్లుగా వర్ణించినచో అది స్వభావోక్తి అలంకార మగును బాపయ రచనలో స్వభావోక్తి అలంకారమునకు ఉదాహరణ :

సీ॥ "చూతకపిత్థ భల్లాత కీరిం జామ్ల
జంబీర ముఖ తరు సంకులంబు
సింహ శార్దూల ఘృష్టి కురంగ మర్కట
వృక హరు శశకాది మృగయుతంబు
కీరవన ప్రియ శారికా కౌశిక
కాక కేకిక ముఖ ఖగ కులంబు
సారసకైరవ షట్పద జలపక్షి
యాపన్నమేత పద్మాకరంబు

గీ॥ "మల్లికా మాధవీ నవ మాలికాల
తావితాన సమన్విత తతనికుంజ
పుంజ రంజిత కామోప భోగ బిం
విధువమగు కాననము గాంచె మధు విరోధి"
— విఘ్నేశ్వర చరిత్రము 2-23

పై పద్యంలో శ్రీ కృష్ణుడు వేటకేగినపుడు అక్కడ ఆ అరణ్యంలోని జంతువులను, పక్షులను మొదలైన వాటిని ఉన్నవి ఉన్నట్లుగా రచించుట వలన ఇక్కడ స్వభావోక్తి అలంకారము కలదు. మరియు శ్రీ కృష్ణుడు మధువిరోధి అని ఉన్నది ఉన్నట్లు చెప్పుట వలన కూడా స్వభావోక్తి అలంకారము ప్రయోగింపబడినది ఉత్ప్రేక్షాలంకారము:

ఈ ఉత్ప్రేక్షాలంకారము మూడు రకములు అందులో ఒకటైన హేతూత్ప్రేక్షను బాపయ తన రచనలో ప్రయోగించాడు హేతువు కాని దానిని హేతువుగా భావించినచో అది హేతూత్ప్రేక్షాలంకారమగును. ఇందులకు ఉదాహరణ:

కం॥ "హరి వేటలాడుచో దన
కిరణంబుల వేడిసోకి కినియు నటంచున్

బిర బిర పరవ్వన కరిగిన
కరణి చరణి చరమగిరి శిఖరమున గ్రుంకెన్"
విఘ్నేశ్వర చరిత్రము : 2-27

సూర్యుడు సాయం సమయము గడవగానే అస్తమించుట సాధారణ విషయము. కాని తన వేడి కిరణములు సోకితే కృష్ణుడు తనపై కోపగించు ననే భయంతో సూర్యుడు త్వరగా అస్తమించాడనే హేతువు సూర్యాస్తమ యానికి చెప్పబడినది. కావున ఇది హేతూత్ప్రేక్షాలంకార మగును

ఉల్లేఖాలంకారము :

ఒకే వస్తువును ఒకే వ్యక్తి పలు విధములుగా వర్ణించిన యెడల అది ఉల్లేఖాలంకార మగును. జాపు తన విఘ్నేశ్వర చరిత్ర కావ్యంలో సూర్యాస్తమయ వర్ణనలో ఉల్లేఖాలంకారాన్ని ప్రయోగించాడు ఇందులకు ఉదాహరణ.

సీ. "పాక శాసన వధూ ప్రాసాద శిఖర సం
కలిత హాటక రత్న కలశ మనగ
యామినీ సతి కంఠసీమ నెంతేయు
శోభిల్లు మంగళ సూత్రమనగ
ప్రాగ్వామ లోచన ఫాల భాగంబున
దీపించు కాశ్మీర తిలక మనగ
గమల జాండ వ్యాప్త ఘన తమో విహృతికై
దేవతలుంచిన దీప మనగ

గీ॥ "దామరలు గ్రుంక గైరవతతి చెలంగ
జడధు లుప్పొంగ జీకట్లు కడు దొలంగ

జగము జలరంగ జక్కవల్ జత విడంగ
సోముడుదయించె సత్కళాధాముడగుచు''

విఘ్నేశ్వర చరిత్రము : 2-32

పై వర్ణన సూర్యాస్తమయ వర్ణన మట్టంలో చెప్పబడినది. ఇందులో చంద్రుని రత్నకళశంగాను, రేయి అనే మగువ మంగళ సూత్రంగాను, తూర్పు కంఠసీమమున కాశ్మీర తిలకంగాను, దీపముగాను వర్ణించినాడు. కావున ఇది ఉల్లేఖాలంకారము

## ఇతరకవుల ప్రభావం

ఒకరు చేసిన కార్యము చక్కగా చూచి సరిగా అట్లే చేయుట యను సరణము ఉదాహరణమునకు నాయకుడగు చీమ యెట్లు ఏ దిశకు వెళ్ళునో తక్కిన చీమలు వాని ననుసరించును సృష్టి యందలి ప్రతి ప్రాణియు తన యొక్క పూర్వ ప్రాణిని యనుసరించు చున్నది అని చెప్పవచ్చును అన శ్వరములైన మహాకాశమున శబ్ద బ్రహ్మ యను పేర నిలిచి యుండు వేదముల వలన, పూర్వ సృష్టిని గూర్చి తెలిసుకొని, లోకమును సృష్టించు బ్రహ్మ సృష్టియు అనుసరణ మనవచ్చు కావున అనుసరణము సహజము

పూర్వ కవులను అనుసరించుట దోషముగాదు. నిపుణులైన కవులు పూర్వ కవుల రీతులను అనుసరించియు, తమదైన యొక రీతిని నిలుపుకొని రచన గావింతురు "పూర్వ కవుల రచనలనుండి అలవోకగా అక్కడక్కడ స్వీకరించుట దోషము గాదు. సంస్కృతమున 'బాణోచ్ఛిష్టం జగత్సర్వమ్ జగత్' అను నటుల భారతాది మహా గ్రంథములగు శబ్దముల ప్రయోగములు కవులకు శిరోధార్యములు, అనుకరణీయములు.

- మాధవరావు విన్నకోట . కావ్యరీతులు : పుట-89

నంఘూరి జొపయ తన కావ్య రచనలో ఇతర కవుల ప్రభావము కూడ కన్పించుచున్నది. తన రచనయైన విఘ్నేశ్వర చరిత్ర కావ్యమున ఆంధ్ర భాగవతాను కరణలు విశేషముగ కలవు కొన్ని పద్యములు ఒకటి రెండు పదముల మార్పుతో యథా తథముగ ఇందులో చేర్చబడినవి భాగవతము నందును, విఘ్నేశ్వర చరిత్రము నందును ఒక విధంగా ఉన్నటు వంటి పద్యములను క్రింది పద్యముల ద్వారా పేర్కొనవచ్చు

1. కం॥ "ఏ రాజేలెడు వసుమతి
నా రత్నము పూజ్యమానమగు నక్కడ రో
గారిష్ట సర్వమాయిక
మారీ దుర్భిక్ష భయము మాను నరేంద్రా"
- భాగవతము : దశమ , ఉత్తర; 52

పై విధంగా పోతన కంద పద్యంలో పేర్కొన్నటు వంటి భావములనే జొపయ తెలియజేయుచూ గీతపద్యంలో రచన గావించాడు.

గీ॥ "ఏ మహీశ్వరు డేలెడు భూమియందు
నమ్మణియు బూజ్యమాన మౌనచట సర్వ
మాయికా దుష్టమారీ సమస్తరోగ
భయము దుర్భిక్ష భయమును బాయుచుండు"
- విఘ్నేశ్వర చరిత్రము 2-12

2. వ॥ "దేవా ! నిన్ను బురాణ పురుషు నధీశ్వరు విష్ణు బ్రహ్మ విష్ణు నెఱింగుదు, సర్వ భూతంబులకుం బ్రాణ ప్రతాప ధైర్య బలంబులు నీవ విశ్వంబునకు సర్గస్థితి లయంబు నెవ్వరాచరింతురు వారికి సర్గ స్థితి లయంబుల చేయ నీశ్వరుండవు నీవ, యాత్మకుం బరమాత్మవు నీవ"
భాగవతము : దశమ : ఉత్తర - 67

పై విధంగా వచనంలో పోతన పేర్కొనటువంటి భావమునే బాపయ కూడ వచనంలోనే రచన గావించాడు.

వ॥ "దేవా నిన్ను బురాణ పురుషుని బరమేశ్వరు నధీశ్వరు విష్ణుం బ్రభవిష్ణు నాద్యంత శూన్యు నెఱుంగుదు. సకలజంతు నికరంబునకుం బ్రాణ ప్రతాప శౌర్య ధైర్యంబులు నీవ. స్థావర జంగ మాత్మకంబగు సమస్త బ్రహ్మాండంబులు సృష్టిస్థితిలయంబు లొనరించు వారికి సృష్టిస్థితిలయంబు లొనరింపం గుర్త వ నీ వ సర్వజ్ఞుండవు నీవ. సర్వేశ్వరుండవు నీవ" అని రచించాడు

విఘ్నేశ్వర చరిత్రము 2-81

3. సీ॥ "బాణాగ్ని నెవ్వఁడు పఱపి పయోరాశి
నింకించి బంధించి యేపుమాపె
బరగ నెవ్వఁడు ప్రతాప ప్రభా రాశిచే
దానవ గర్వాంధ తమస మడచె
గంజాతములు ద్రెంచు కరిభంగి నెవ్వఁడు
దశకంఠు కంఠ బృందములు ద్రుంచె
నా చంద్ర సూర్యమై యమరు లంకారాజ్య
మునకు నెవ్వఁడు విభీషణుని నిలిపె

గీ॥ నన్ను నేలిన లోకాధినాథు డెవ్వ
డంచితోదార కరుణా రసాబ్ధి యెవ్వ
డాతడవు నీవు కావె మహాత్మ నేడు
మాఱుపడి యెగు సేసితి మఱవవలయు"

- భాగవతము.; దశమ : ఉత్తర 68

పైన తెలిపిన భాగవతములోని సీస పద్య భావములను బాపయ తన కావ్యంలో కూడ సీస పద్య రచనతోనే పూర్తి చేశాడు.

సీ॥ "ధారుణాశుగ వహ్ని దరికొల్పి యింకించి
యెవ్వడు సాగరం బెలమి గట్టె
హాళి నెవ్వని ప్రతాపార్క బింబద్యుతుల్
దైత్య గర్వధ్వాంత తతి వడించె
పారసంబులు ద్రెంచు సాహసంబున నెవ్వ
డల దశగ్రీవుని తలలు దునిమె
నా చంద్ర తారార్కమై లంక నేల నె
వ్వండు విభీషణునకు వరమొసంగె

నన్ను నేలిన భువనైక నాథుడెవ్వ
డతి కృపా రస వార్ధియై యలరె నెవ్వ
డాతడవు నీవకావె మహానుభావ
నిన్ను మార్కొన్న తప్పు మన్నింపవయ్య'

— విఘ్నేశ్వర చరిత్రము 2-82

4 "మృతుడైన వాడు పునరా
గతుడైన క్రియం దలంచి కన్యామణి సం
యుతుడై వచ్చిన హరిగని
వితతోత్సవ కౌతుకమున వెలసిరి పౌరుల్'

– భాగవతము ; దశమ : ఉత్తర 75

క॥ "మృతుడగు వాడు పునర్జీ
వితుడైన క్రియ దలంప వెన్నుండు నవలా
రతనములు గొనుచు వచ్చిన
నతి విభవోత్సవ సమృద్ధి నలరిరి పౌరుల్"

– విఘ్నేశ్వర చరిత్రము : 2-101

5. క॥ "పాపాత్ముల పాపములం
బాపంగా నోపునట్టి పద్మాక్షునిపై
బాపము గలదని నొడివిన
పాపాత్ముని పాపమునకు బారముగలదే"

- భాగవతము : దశమ : ఉత్తర 77

క॥ "కలుషాత్ముల కలుషంబు ల
కలుషగతిం బారద్రోలు కమలాక్షునిపై
గలుషము గలదని నుడివిన
కలుషాత్ముని కలుషమునకు గడ యిక గలదే"

— విఘ్నేశ్వర చరిత్రము : 2-105

6. "మణి యిచ్చినాడు వాసర
మణి నీకును మాకు గలవు మణులు కుమారీ
మణి చాలు నంచు గృష్ణుడు
మణి సత్రాజిత్తునకును మరలగ నిచ్చెన్"

— భాగవతము : దశమ : ఉత్తర 82

"మణి యానేటికి గౌస్తుభ
మణి కన్న నిదేమి ఘనము మాకిపుడబలా
మణి చాలుననుచు హరియా
మణి సత్రాజిత్తునకును మగుడ నొసంగెన్"

—విఘ్నేశ్వర చరిత్రము 2-113

పోతనామాత్యుని కవిత్వాను కరణలు తప్ప ఇతర ప్రాచీన కవుల కవితాను కరణ లీకృతిలో నంతగా గానరావు.

# ఉ ప యు క్త గ్రం థ సూ చి


1. తెలుగు ప్రబంధం — కె. వి. ఆర్. నరసింహం
2. ప్రబంధములలో ప్రకృతి వర్ణలు — డా॥ అంతట నరసింహం
3. తెలుగు విజ్ఞాన సర్వస్వము — మూడవ సంపుటము
4. తెలుగు సాహిత్య సమీక్ష — డా॥ జి. నాగయ్య రెండవ సంపుటము

5. బ్రహ్మ పురాణము తెలుగు అనువాదము శ్రీ సుబ్రమణ్య దీక్షితుడు
6. వామన పురాణము ,, రామావఝుల కొండయ్యశాస్త్రి
7. శివ పురాణము ,, ముడిగొండ నాగవీరయ్యశాస్త్రి
(ద్వితీయ సంపుటము)
8 స్కాంద పురాణము ,, జనమంచి శేషాద్రిశర్మ
9. పద్మ పురాణము ,,
10. వరహా పురాణము ,,
11 లింగ పురాణము ,,
12. బ్రహ్మవైవర్త పురాణము ,,

13. గణపతి — మూలం శ్రీధర మూర్తి
అనువాదం : జానుమద్ది హనుమచ్ఛాస్త్రి

14. ఆంధ్రపత్రిక — సంవత్సరాది సంచిక — మార్చి 1925
అష్టావదశ పురాణములు (వ్యాసం) — శ్రీ కోటీశ్వర శర్మశాస్త్రి
విఘ్నేశ్వరుడు — వ్యాసావళి — విస్సా అప్పారావు